కథా నిలయం
5319
శ్రీకాకుళం
2853

పుట్టిల్లు

"తొలి ఉగాదిని నేనే! తొలి ఉషస్సుని నేనే!" అన్న పాట ఎక్కడో రేడియోలో సన్నగా వినవస్తోంది. వాకిట్లో వేపచెట్టు పూతబరువుతో, నెమ్మదిగా, ఆ పాటకు తలవూపుతోంది. మామిడిచెట్టు, ముదురుతోపు ఆకులు, లేతఆకుపచ్చ ఆకుల్ని చూసి "మా మృదుత్వం మీ కెక్కడిదేం?" అని గదమాయిస్తున్నట్లుగా, గర్వంగా తమ చిగుళ్ళని కదిలిస్తున్నాయి. పదిన్నర దాటింది. చైత్రమాసపు తొలి సూర్యుడు చుర్రుమనిపిస్తూ, సర్రుమని ఆకాశం మధ్యకు ఎగబాకుతున్నాడు. అందరి యిళ్ళల్లోనూ, తీపి తీపి వాసనలు వస్తోంటే పిల్లలు నాలుకలు తడుపుకుంటూ మురుస్తున్నారు. సదానందంగారింట్లోనూ, ఉగాది వుషారు తక్కువేంలేదు. సదానందంగారి తల్లి కనకమ్మగారు కూడా ఏదో మూకుట్లోవేసి, ఇల్లంతా కమ్మని వాసనలని వెదజల్లిస్తున్నారు. హాల్లో ఈజీచైర్‌లో జారబడి, పేపరు చదువుకుంటున్న సదానందంగారు, 'భోజనాలకి లేవొచ్చునా అమ్మా!' అని కేకేశారు.

"ఒక్క నిమిషం వుండండి! వంట అయిపోవచ్చింది" అన్నది కనకన్మ్మ.

"ఈలోగా నీ స్నానం కానీయవోయ్!" బద్ధకంగా పుస్తకం పుచ్చుకుని మంచంమీద దొర్లుతున్న కుటుంబ రావు నుద్దేశించి, అన్నారు సదానందం.

"ఊఁ." బద్ధకంగా లేచాడు కుటుంబం. ఆ రోజు ఉగాది పండుగ? ముప్పోటి ఆంధ్రులకూ, ముచ్చటయిన పండుగ! నూతన వత్సరంలో, రాబోయే రోజులను, తన ఆనందపూరిత ఆశలతో ఆహ్వానిస్తూ, సమస్త జీవకోటీ కల కలలాడుతూ, నూతన చైతన్యంతో పులకించుతోంది. సదానందంగారు పేపరు మడిచి టేబుల్‌మీద పెట్టి, లోనికివెళ్ళి తెల్లని పట్టుపంచెనరించి, రాగిచెంబుతో, పెరట్లోని కుళాయి దగ్గర నీళ్ళుపట్టుకుని వచ్చారు.

కనకమ్మగారు, వెండిపువ్వులున్న పీట కుటుంబానికివేసి, మామూలుపీట సదానందంగారికి వేసింది. రెండు వెండి కంచాలూ, కుటుంబానికి, వెండి మరచెంబుతో నీళ్ళూ పెట్టింది. సదానందంగారు, తనకు నిర్దేశించిన పీట మీద కూర్చుని, కుటుంబంకోసం చూస్తున్నారు.

"నీ శార్ధం—నా పిండాకూడూ, కళ్ళల్లోపోసి చచ్చావ్ కుంకుడు నురుగు! చాతకాని పీనుగువి చాత కానట్లు చావకూడదూ! నీచెల్లికీ, తమ్ముడికీ ఇల్లానేపోశావా? నేనంటే ఈసడింపు వెధవ పీనుగుకి!"

నీళ్ళగదిలోంచి కుటుంబరావు గొంతు వినిపించింది సదానందంగార్కి. సదానందంగారి మనస్సు, బాధగా మూలిగింది. తల్లి లేనిపిల్ల! దగ్గరసంబంధంకదాఅని ఇచ్చారు. ఇచ్చినందుకు ఒక ముద్దు ముచ్చట లేదుసరికదా; ఇక్కడకు వచ్చినప్పుడుకూడా, ఏదో వంకని తిట్తోనేవుంటాడు కుటుంబం. 'దాని తల్లివుంటే' అన్న భావం తటిల్లుమని హృదయంలోనికి రాగా, సదానందంగారి కళ్లు నిండుకున్నాయి! బాధగా పీటమీంచిలేచి హాల్లోనికివెళ్ళి కుర్చీలోజారబడ్డారు. ఇంతలో అన్నపూర్ణ వచ్చింది.

"లే అప్పా భోజనానికి! వారి స్నానం అయ్యింది" అన్నది. సదానందంగారు, అన్నపూర్ణ మొహంలోకి చూశారు. ఆమె నుదుటిమీద, మూమిడిచిగురు రంగు కుంకుమ గర్వంగా మెరుస్తోంది. కొత్తచీర కట్టుకున్న సంబరం, ఆమె పచ్చని శరీరమంతా ప్రదీపిస్తోంది. భర్తచేత పండుగపూటా తిట్లుపొందిన అవమానం, ఆమె ముఖంలో మచ్చుకైనాలేదు. ఆమె ఆత్మాభిమానానికి నివ్వెరబోయారు సదానందంగారు. మెల్లిగా భోజనాలహాలువెంపు వెళ్ళిపోయారు.

"అమ్మా ఉగాదిపండుగనాడు ఏమిజరుగుతే అది సంవత్సరం పొడుగునా జరుగుతుందట! నాన్న నిన్ను ఈరోజు తిట్టాడు - యింక సంవత్సరం పొడుగునా తిట్టుతాడు గాబోలు అమ్మా!" బాధగాఅన్నది అనూరాధ, పదేళ్ళపిల్లది.

"అమ్మా! నాన్న బలేగా తిట్టాడులే! ఇందాక బూరె పెట్టమంటే నాకు పెట్టావా మరి! అందుకే తిట్టాడు

నాన్న! నిన్ను అల్లా తిట్టాల్సిందే!" అన్నాడు ఎద్దేవాగా తొమ్మిదేళ్ళ రమణ. ఇద్దరిపిల్లల స్వభావ ప్రకటనలనీ, విని ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ. పూవుపుట్టగానే పరిమళించుతుందన్నట్లుగా, ఆడపిల్లకి ఎప్పుడూ, తల్లన్నా తల్లి వేపు వారన్నా అభిమానం ఎక్కువగా వుంటుంది. స్త్రీకి పుట్టింటి మమకారం జన్మ సహజంగా వస్తోంది.

"బయటికిపోయి ఆడుకోండి ఇద్దరూనూ! అనక మిమ్మల్ని పిలిచి, అప్పచ్చిలు పెట్టాను" అని అన్నపూర్ణ, లోపలికి వెళ్ళిపోయింది. రమణ బొంగరాలు తీసుకుని బయటకు ఆడుకుందుకు పోయాడు. అనూరాధకి తండ్రి మీద బాగా కోపమువచ్చింది. ఆ పిల్లలో పండుగ సరదా అంతా చచ్చిపోయింది. కట్టుకున్న కొత్తగాను విప్పేసి, గది కిటికీ తలుపులన్నీ వేసేసుకుని, చీకటిగదిలో తల్లికి తగిలిన తిట్లుగురించి వీడ్చినీడ్చి నిద్దరబోయింది—మధ్యాహ్నం, తల్లి మల్లెపూలు జడకుడదామని లేపేదాకా!"

2

"ఇదుగో! నే వెళ్తున్నా తలుపేసుకో!" అని అరుగు మీదనించి, లోపలికి ఒక కేక వేసి, చూరులోంచి కిర్రు చెప్పులుతీసి తొడుక్కుని, వేపపుల్ల నములుతూ, పొలంకేసి వెళ్ళిపోయారు రాజారామంగారు.

తూరుపు తెల్ల తెల్లవారుతోంది. జీవనభారం మోయ లేని గుమాస్తాలా, సూర్యుడు సెమ్మదిగా, నీరసంగా, తన విధి కుపక్రమించుతున్నాడు. చెరువులో, యింకా బ్రాహ్మణులు రావటం లేదుకదా అని, మూలవాళ్ళు తొందర తొందరగా నీళ్ళు ముంచుకుని పోతున్నారు. సిద్ధేశ్వరి లేచి, తాటాకులదడి వద్దకు వెళ్ళినుంచుంది. దడికవతల వెంపు నుంచున్న పెద్దతమ్ముడు, నానీ.”

2853

“అక్కాయ్! పదికుంచాలు చాలవంది చిన్నక్క. మేము స్కూల్‌కి జేతాలు కట్టాలి. వెచ్చాలుకూడా ఇందులోనే తెచ్చుకుంటే, నెలపొడుగునా, తిండికి గింజలుండవు. అంచేత వీలున్నప్పుడు, ఇంకో యిరవయికుంచాలు ధాన్యం యిమ్మనమని చెప్పమంది” అన్నాడు

“ఇష్ష! నెమ్మది. మరిది వూళ్లోనే వున్నాడు. మున్నబు పంపువెంపుచూడు! ఆ పంపులో కుప్పలు నూర్చుకుంటున్నారు. ఆ ట్రాక్టర్ లైటు ఎప్పుడు కనపడితే, అప్పుడు రా! అందాకా కొద్దిగా యిస్తాను” అని సిద్ధేశ్వరి లోపలికివెళ్లి, పెద్దకూతురు సీతని లేపి తీసుకొచ్చింది. ఇద్దరూకలిసి పురికి చుట్టివున్న గడ్డివెంపులను తప్పించి, ఒక చిన్న గోనెసంచి నిండుకూ ధాన్యం తీసి, మళ్ళీ పురికి చుట్టివున్న వెంపులని యథాప్రకారం సర్దేశారు. ఆ సంచీ మూటని, మేనమామకి అందిచ్చింది సీత. నానీ వెళ్ళిపోయాడు. స్త్రీలకి పుట్టింటి మమకారం, సహజమే! కాని, తన పిల్లల భవిష్యత్తు గురించి, కించిత్తు అయినా, యోచన చేయక, అత్తవారింటి సొమ్ము, పుట్టింటికి చేరవేయటమే

పనిగా పెట్టుకున్న, సిద్ధేశ్వరిలాంటి స్త్రీలు, మాతృత్వపు పవిత్ర భాధ్యతకే కళంకం తెస్తున్నారు. ప్రతి స్త్రీకి, ఒక బిడ్డ కలగగానే, ఆ బిడ్డ భవిష్యత్తు ఉజ్వలంగా వుండాలనీ, దానికి, తన సర్వశక్తులూ, ధారపోయాలనీ, ఒక దృఢ సంకల్పం కలిగి తీరుతుంది. కానీ పైసా చొప్పున, ఆ వాంఛలన్నీ అరికట్టుకొని, కూడబెట్టి, పిల్లల చదువు సంధ్యలకీ పెళ్ళిపేరంటాలకీ; వినియోగిస్తారు, తల్లిదండ్రులు. సిద్ధేశ్వరి సంతానహీన కాదు. ఇద్దరు కొడుకుల్నీ, ముగ్గురు కూతుళ్ళనీ తీర్చి దిద్దవలసిన మాతృమూర్తి! అయినా ఆమె నిర్లక్ష్యంగా అత్తవారిది, ఇంకా సమిష్టి కుటుంబమే కదా, అన్న అసూయతో,తమ సంసారం గుల్ల చేసి పుట్టింటి వారి సదుపాయము చూస్తోంది. సిద్ధేశ్వరి పుట్టింటివారు బాగా బ్రతికిచెడిన వాళ్ళు. సిద్ధేశ్వరికి, అరుంధతి అనే పిల్లలూ, నానీ, వెంకులూ, అనే తమ్ముళ్ళూ వున్నారు. అరుంధతి భర్త బాగా ధనికుడే. కానీ, మూడో పెళ్ళివాడు! ముసలివాడు! అంచేత ఆయనకు జ్వరం వచ్చినప్పుడు, అరుంధతి తనకు విషమిచ్చి వుంటుందనే, నమ్మకంతో ఆయన 'ఆస్తి' అంతా పసిపిల్లల హాస్పటల్‌కి వ్రాసేసి చనిపోయాడు. పెళ్ళయిన ఆర్నెల్లకే, అందమయిన అరుంధతి, తెల్లచీరతో, పుట్టెడు చీకటిని నెత్తిన పెట్టుకుని పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు, ఏ ధనానికైతే ఆశించి, అరుంధతి నూరేళ్ళ జీవిత భాగ్యాన్ని, కాలరాశారో ఆ ధనమూ దక్కకుండగానే పోయింది! మిగిలింది, అందమైన వయసులో వున్న అరుంధతీ, తల్లిదండ్రులు, తమ భవిష్యత్తు నెల్లా ఈ

నిర్ధనత్వంతో, తీర్చి దిద్దుతాదో, అని ఎదురుచూసే, ఎదిగే ఇద్దరూ మగపిల్లలూ ! చాతకాని తనంతో, అరుంధతి తల్లి తండ్రులు, బెంగటిల్లిపోయి చనిపోయారు!

అరుంధతి తప్పనిసరిగా, నానీ, వెంకుల బాధ్యతని, తలధరించాల్సి వచ్చింది. అక్కచెల్లెళ్ళ ఆసరాతో, ప్రక్క వూరి హైస్కూళ్ళల్లో చదువుకొంటున్న, నానీ, వెంకులూ, ఒక విధమైన, స్వేచ్ఛాభావం వల్ల, నిర్లజ్జగా, ప్రవర్తించటం నేర్చుకున్నారు. ఎదిగే మగపిల్లల, విశృంఖలత్వాన్ని ఎవరు ఆపుచేయగలరు? పధ్నాలుగు, ఇరవయినాలుగూ, సంవత్సరాల మధ్యవున్న మగపిల్లలు చెడిపోవటానికున్న అవకాశాలన్నిటికీ, ప్రభావితం లౌతారు అది, వారి తప్పు కాను ! ఆ వయో ప్రభావం అల్లాంటిది! ఆ వయసులో అల వాటు అయిన దురలవాట్లు, తర్వాతి జీవితం అంతా సిడలా, వెన్నంటి పయనిస్తూనే వుంటాయి ! ఆ వయస్సులో వాళ్ళకి, సరయిన ధర్మదీక్ష కలిగేలా, తల్లిదండ్రులు, లేక, బాధ్యత వహించాల్సినవారు, చూడాలి. కుటుంబం కూడా, నానీ, వెంకులు, సహ విద్యార్థి అవటం, వాళ్ళ విచ్చలవిడి ఖర్చులకు, కొంత దోహదకారి అయ్యింది. కుటుంబానికి, పెద్ద ఆస్తి వున్నది. అన్న రాజారామం, ఎంత అడిగితే అంతా తమ్ముడికి, లేదనకుండా ఇచ్చేవాడు. రాజారామం గారికి, నానీ, వెంకులు, తమ ఇంటికి, యధేచ్ఛగా రావటం ఆట్టే సహానం కలిగించేది కాదు. కాని కుటుంబానికి, వాళ్ళు, స్నేహితులవటంనించి, తప్పనిసరిగా వూరుకునేవారు. కుటుం

భానికి, ఇంట్లో సర్వస్వతంత్రంగా వుండేది.అతనేమిచేసినా, రాజారామంగారు కల్పించుకునేవారు కాదు. ఏమన్నా అంటే, ఆ స్తిని పంచమంటాడని భయం. రాజారామం గారు, వుమ్మడిగా, సంసార నిర్వహణ గురించి, బోలెడన్ని అప్పులు చేశారు. స్వతహా, ఖర్చుమనిషి ! పైగా, సిద్ధేశ్వరి, అండర్ గ్రవుండ్ వ్యాపారం ! ఇంట్లో ఏం వండుతో, అవి సగం, పుట్టింటికి రవాణా చేసేది సిద్ధేశ్వరి. కుప్పలు నూర్చి, ఎనభయ్యేసి బస్తాలు పురులుగా కడితే, ఒక నెల తిరిగి, మళ్లీ మిల్లులకి బేరం ఇచ్చి, పురి తీసి, కాటాతో తూకంవేస్తే, పది పదిహేను బస్తాలు తేడా వచ్చేది. ధాన్యం ఆరేయి కనుక తరుగుతాయి అనేవాళ్ళు పాలేళ్ళు. "ఎలకలు కన్నాలు పెట్టాయి. వాటిల్లోకి తోడుకున్నాయేమో," అని కుటుంబం ఆ కన్నాలన్నీ తప్పించేవాడు. కుంచెడు,అడ్డెడు, గింజలు దొరికేవి ! బస్తాలకి బస్తాలు నెల్లాళ్ళల్లో తింటాయా ఎలకలు? రాజారామంగారు మౌనం దాల్చేవారు. ఆయన అనుమానం, తమ్ముడి మీద వుండేది. గట్టిగా అంటే కుటుంబం విడిపోతాడేమో, అప్పులన్నీ తను వొంటిగా కుటుంబంతో విడిపోయి తీర్చలేడని భయం. ఎల్లానో అప్పులన్నీ తీర్చాలి అనుకొంటూ వుండటం, ఈలోగా పిల్ల పెళ్ళో, పిల్లాడి చదువో అవసరంగా రావటం, దానితో ఇవ్వాల్సిన వాళ్ళకి, ఇయ్యలేకుండగా పోవటం, దానితో వడ్డీలకి వడ్డీలు పెరిగిపోయి, తడిసి మోపెడు అయిపోయాయి అప్పులు !

సిద్ధేశ్వరి చిత్రమైనస్త్రీ ! కొంతమంది స్త్రీలకి, అస్తమానూ, సానుభూతి పొందటం ఇష్టముగా వుంటుంది. అందుకని, లేనిపోని కష్టాలు కొని తెచ్చుకుంటారు- ఈ స్వయంభాధితులు! సిద్ధేశ్వరికి, ముగ్గురు కూతుళ్లూ, ఇద్దరు కొడుకులూ వున్నారు. పెద్దమ్మాయ్ సీతకి పెళ్ళి అయ్యింది. ఆ పెళ్ళికి బోలెడంత అప్పుచేశారు రాజారామంగారు. ఆ పెళ్లిముందర, సిద్ధేశ్వరి, తన నగలన్నీ తీసి అమ్మేసింది. రాజారామంగారు, భార్య త్యాగనిరతికి, ముగ్ధులైపోయారు. ఇంట్లో శుభకార్య సమయంలో, ఏ స్త్రీ నిరాలంకరణ ఒప్పకలదు? లేనినాళ్ళు ఎరువు సొమ్ములు తెచ్చుకొని, అలంకరించుకునే ఆనందసమయంకదా అది? సీత పెళ్ళికి వచ్చిన బంధుపులంతా, సిద్ధేశ్వరిని, పరామర్శించసాగేరు.

"అయ్యో తల్లీ ! మెడ అంతా బోసిపోయిందే ? ఇంటికి పెద్దకోడలివి! పువ్వంటి పుణ్యస్త్రీవి ! వంటినిండా నగలతో గలగల్లాడుతూ మహాలక్ష్మిలా వుండేదానివి. ఏం చేశాడే మారాజు?" అని అత్తవారి వెంపు ఒక వృద్ధురాలు ఆత్మతగా అడిగింది. సిద్ధేశ్వరి, బిక్కగా నవ్వింది.

"ఏం చేస్తాము చెప్పండి! పిల్లలుగలదాన్ని ! సమిష్టి కుటుంబమాయె ! నాకు, నగలూ నాణ్యాలూ కావాలి అంటూ పట్టుక కూర్చుంటే ఎల్లా కుదురుతుంది ? చేసేది

మా అమ్మాయి పెళ్ళయితే, వుమ్మడి ఆస్తిమీద అప్పులు చేయకూడదుకదా!" అన్నది. నిజానికి, ఆమెనగలు అమ్మిన డబ్బు, పైసకూడా, సీత పెళ్ళికి ఖర్చుచేయలా! ఆ డబ్బు పెట్టి, అరుంధతి తనపేర, ఒక యకరం పొలంకొనుక్కుంది. సీతపెళ్ళికి, వుమ్మడిగా, ఇరవయివేలు అప్పుతెచ్చి, ఘరానా సంబంధంతో పెళ్లిజరిపించి దర్జాగా ఖర్చుచేశారు రాజారామం, కుటుంబం.

తల్లి, చాటుగా పుట్టింటిని ఆదుకోవటం, మగపిల్లలు భార్యకి, అబ్బులికి ఏ మాత్రం ఇష్టం వుండేదికాదు. ఆడపిల్లలు మాత్రం, మేనమామలంటే ఇష్టంగావుంటూ, ఇంట్లోని సామాన్లు, పినతల్లికి జేరవేయటంలో తల్లికి సాయపడుతూ వుండేవారు. అసలు కుటుంబం, మొదట అన్న పూర్ణని పెళ్ళిచేసుకోనన్నాడు.

"నాకు ఆ అమ్మాయి నచ్చలేదు. నేను చేసుకోను. బలవంతంగా చేస్తే, దేశాలుపట్టి పోతాను." అన్నాడు.

రాజారామంగారు మెత్తబడ్డారు. "ఇష్టంలేందే చేయట మెందుకు? అనవసరంగా, ఒక అమాయకురాలి నూరేళ్ళ జీవితం వ్యర్థలపాలు చేసినట్టు అవుతుంది." అన్నారు సిద్ధేశ్వరితో. సిద్ధేశ్వరి మెదడులో విద్యుత్తు ప్రవహించింది. నచ్చని పిల్లని బలవంతంగాచేస్తే, దేశాలు పట్టిపోతానన్నాడు కుటుంబం, కనుక నిజంగా అన్న పూర్ణనే చేయాలి. చేస్తే, చేసుగలిగితే కుటుంబం దేశాలు పట్టి పోతాడు, అప్పుడు, తమ ఆస్తి, రెండు చెక్కలవ్వాలిసిన పరిస్థితిరాదు. అందుకని బాగా ఆలోచించి,

"ఏవో, కుర్రతనం, మాటలు. మీరు లెక్క చేయకండి. అవతల పిల్లకలవాళ్ళు, పెద్దమనుష్యులు. మాట్నాక కాదనటం భాగుంటుందా? వూరంతా ఏవంటారు? 'తమ కూతుకయితే ఇట్టే పెళ్ళి చేసుకున్నారు. ఆస్తిపాస్తి చాల్లొన్నస్తుందని, చెట్టులా ఎదిగున్న తమ్ముడికి పెళ్ళి చేయటంలేదు. రేప్రొద్దుట తమకొడుకుల్ని వాళ్ళు వూళ్ళు సవరిస్తోంటే ఇల్లానే చూస్తో వూరుకుంటారా?' అంటారు. ఆతను వయసులో వున్నాడు. ముందు పెళ్ళి చేస్తానంటే ఒద్దొద్దని గునిసి, తీరా ఏ జాతిలేనిదానో అభాసు చేస్తే, వాళ్ళొచ్చి నెత్తిన కూర్చుంటారు. అన్నగారు ఎన్నిరోజులకీ పెళ్ళి చేయకపోతే ఏం చేస్తాడుపాపం! అనిమన్నే అంటారు." అన్నది.

రాజారామంగార్కి భార్య సలహానచ్చింది. "నిజమే! తను అప్పుడే సీత పెళ్ళిచేశాడు. సుబ్బులూ, బాబ్జి పెళ్ళికొదిగారు. తన సంసారం గింజాటన తనదేకాని లోకం సంగతి అంతగా తను పట్టించుకోలేదు. లోకం ఇప్పటికే తన్ని గురించి ఎన్నో అనుకోవచ్చును. అన్నిమాటలు, 'సిద్ధి' చవిన పడివుంటాయికనుకనే కుటుంబం పెళ్ళి చెయ్యమని పోరుతోంది. పిచ్చి సిద్ధి! తోటికోడలు, రావాలన్న సంబరమేకాని, వచ్చిన మర్నాటి నించీ వంటింటి పెత్తనం దారు అయి, తన జాగా ఖాళీ చేయిస్తుందని దానికి తెలీటం లేదు!" సిద్ధేశ్వరి మీద చెప్పలేని జాలివేసుక వచ్చింది రాజారామంగారికి కుటుంబాన్ని అన్నపూర్ణని పెళ్ళిచేసుకొమ్మని బ్రతిమాలాడు రాజారామంగారు.

"నాకు నచ్చలేదు, ఆ పిల్ల! ముభావంగా అన్నాడు కుటుంబం.

"నచ్చటం నచ్చకపోవటం వేమిటి చెప్పు! మంచి వంశంలో పిల్ల! నెమ్మదస్తురాలు! అంతకంటె కావాల్సిం దేముంది? అయినా ఇప్పటి పరిస్థితిలో మనకు పిల్లనిచ్చే దెవరు?" ఆ ప్రశ్నకి వళ్ళు మండుకవచ్చింది కుటుంబానికి.

"ఇచ్చేదే వాళ్ళే అయితే నేనసలు పెళ్ళే చేసుకోను." అన్నాడు. తమ్ముడి తిరుగుబాటుకి, నిగ్రహశక్తి కోల్పో యారు రాజారామంగారు.

"చేసుకోవూ? ఎందుకని చేసుకోవు? పెళ్ళి చేసుకోక వూరిమీదపడి తిరుగువాతా రాధాయిగాడిలాగా? అల్లా అయితే నా ఇంట్లో ఒక్కక్షణం వుండకు. వెంటనే వెళ్ళు!" ఆవేశంగా అన్నారు రాజారామంగారు. రాధాయి, వాళ్ళ దూరపు చుట్టం. నిష్ఠేపంలా లక్ష్మీదేవివంటి భార్యవుండగా, ఆమెని, వదిలి ఒక తూర్పు మనిషిని రిజిష్టర్ మారేజ్ చేసుకున్నాడు. ఆమెకోసం, ఆస్తిఅంతా హారతి కర్పూరంలా వెలిగించాడు.

"అయితే నా వాటా నాకు పంచియ్యి! నేను బొంబాయివెళ్ళి చదువుకుంటాను" అన్నాడు కుటుంబం. నిజానికి బొంబాయి వెళ్ళి కుటుంబం చదవాల్సిన దేమీ లేదు. రాధాయితో కలిసి, గుర్రప్పందేలు కట్టాలని కుటుంబం వుబలాట!

రాజారామంగారి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది. అప్పటికే, వున్నడిగా ఇరవయివేలరూపాయిల

అప్పువుంది. ఇంట్లో చూడబోతే, ఎన్ని వెచ్చాలు తెచ్చినా అయిపోతూంటాయి. పోనీ, దండిగా పిండివంటలతో భోజనాలు చేస్తున్నారా; అంటే ఎప్పుడూ కూరలు లేవు అంటూ, కొత్తిమిర పచ్చడీ, మొంతిమజ్జిగాతో, భోజనం పెడుతుంది సిద్ధేశ్వరి. ఏదయితే, కుటుంబం నోటివెంట, తాను వినాల్సి వస్తుందని భయపడ్డాడో, ఆమాట కుటుంబం అననే అన్నాడు. తల మునిగిన అప్పులు! ఆ ఏడు పండిన పంట, భూమిపన్నులకే కటాకటిగా సరిపోయ్యేటువుంది. ధాన్యంధర, బాగా పడిపోయి వుంది. మంచి డిఫ్రెషన్ రోజులు. కానీ; అంటే రూపాయిలా కళ్ళకద్దుకునేవారు! తననేదో; అదృశ్య హస్తం పట్టి పీడిస్తోందని, అనుకొన్నారు రాజారామంగారు. నిస్సహాయంగా, సిద్ధేశ్వరి వెంపు చూశారు.

"నీ కెందుకు నచ్చలేదోయ్ నాయినా! నాకు చెప్పు. నువ్వు నాకు పెద్దకొడుకుతో సమానం! నా దగ్గర నీకు దాపరికం ఎందుకు? చదువుకోవాలంటే పెళ్ళి అడ్డమా ఏమిటి! మన కుటుంబ పరిస్థితులు నీకు తెలుసుగదా? ఇలా పంతం పట్టుక కూర్చుంటే మేమే మయిపోవాలి చెప్పు! మీ ఆన్నయ్యకి, రాత్రీపగలూ, ఒకటే ఆలోచనగావుంది. నిన్ను బలవంతం చేయలేరు! అటు పెద్దమనుష్యులకి నీమీద తనకున్న భరోసాతో మాట ఇచ్చేశారు. అసలే బ్లడ్ ఫ్రెషర్ వున్నమనిషాయే. ఈ వ్యాకులతవల్ల ఏ పక్ష వాతమోవస్తే ఎవరుచేయగలరు? ఈ ఋణాలన్నీ తీర్చి ఆస్తి నిలబెట్టి' నా పిల్లలకి ఒక దారి చూపించే దేముడువి నువ్వే

అనుకున్నాం. నీకు ఈ ఇంటిబాధ్యత ఒప్పగించాలను కుంటున్నాం. నా ముఖం, పిల్లల ముఖంచూసయినా, కాదనకు నాయినా!" దీనంగా అన్నది సిద్ధేశ్వరి.

ఆమె అంతదయగా మాటాడుతోంటే, కరిగిపోయేడు కుటుంబం.

యువకహృదయం ఎప్పుడూ త్యాగబుద్ధితో ఆలోచిస్తోంటుంది. ఏవేవో మహాకార్యములుచేసి, కీర్తిపతాకను చేబట్టాలని, వేడిరక్తం పురికలుసేస్తో వుంటుంది. కుటుంబం తననొక మహత్తర త్యాగం చేయబోయే వ్యక్తిగా వూహించుకున్నాడు. అన్నగారి కుటుంబరక్షణకోసం, తన నూరేళ్ళ. ఆనందయుత దాంపత్య జీవితాన్ని, త్యాగంచేసి కేవలం నిస్సారమైన, పెళ్ళికి వప్పుకున్నాడంటే, అది అతని లోని త్యాగబుద్ధిని, నాగస్వరం పాడి మేలొకొల్పిన సిద్ధేశ్వరిదే ప్రజ్ఞ అవుతుంది. అవదా మరి!

4

పెళ్ళి అయ్యేదాకా, అవ్వాలని, వేయిదేముళ్ళకి మ్రొక్కున్న సిద్ధేశ్వరి పెళ్ళి అయిన మరుక్షణానించీ, ఇది ఎల్లా బెడిసి పోతుందా అని ఆలోచించసాగింది. పెళ్ళిలో కుటుంబం ఆడపిల్లవాళ్ళతో కలిసి మెలిసి తిరగటం చూసీ

నానీ, వెంకులూ తమకి ఇంక దిక్కూమొక్కూ ఎవరూలేరని, ఫీలపించాగు. చేతులారా పెళ్ళిచేశానే అని సిద్ధేశ్వరి మధన పడసాగింది. ఇంక సీత, సుబ్బులూ, ఇరవయి నాలుగంటలూ, కుటుంబం చేసే ప్రతీ చిన్నపనీ పర్యవేక్షిస్తూ తల్లికి చెప్పటమే పనిగా పెట్టుకున్నారు.

"అమ్మా! పిన్నికి లేతగులాబీరంగు జాకెట్ బాగుంటుందని అన్నానడేవ్! పెళ్ళి వొద్దొద్దని తెగగునిశాడు. ఇప్పు ఆవిడ కొంగు పట్టుకి తిరుగుతున్నాడు." అన్నది సీత.

"అవునే పల్లకీలో మన సుశీలని కూర్చోవద్దని కసిరేశాడు. పిన్ని పింతల్లికూతురుని, కూర్చోబెట్టితే నోరు మూసుకు కూర్చున్నాడు." ఒక సమిధ యధాశక్తి తధాభక్తి అన్నట్లు వేసింది సుబ్బులు.

ఈలోగా, సుబ్బులువచ్చేడు అక్కడికి. వాడుకూడా ఏమన్నా వార్తతెచ్చేడేమో అని ఆత్రుతగా చూసింది సిద్ధేశ్వరి వాడివెంపు.

"అమ్మా! కొత్తపిన్ని ఎంత మంచిది అనుకున్నావ్! నేను సున్నుండలు అడిగితేనే, అవి అస్తమానూ తింటే అజీర్తిచేసి కడుపులో పోట్లువస్తాయని చెప్పి, వాళ్ళగదిలోకి తీసుకవెళ్ళి, మేజామీదున్న పళ్ళెంలోని పంచదార జిలేబీ పెట్టిందే! ఎల్లాగయినా ఈ పిన్ని చాలా మంచిది. అయా పిన్ని మంచిదికాదు. తాటిపండు తింటేనే చూడలేక చచ్చేది

వెధవముండ!" అన్నాడు సీతకు తమ పిన్నిని అబ్బులు తిట్టినందుకు చర్రుమంది.

"దరిద్రపు వెధవకానా! ఆ జిలేబీ అంతా నల్లచీమలు పట్టింది. అందుకని నీకు ఇచ్చింది. అంతేకాని నీ మీదప్రేమ పొంగిపొర్లుతుందనుకున్నావా! మేనమామను పెళ్ళాం, మేనత్త వుతుందా, పినతండ్రి పెళ్ళాం పినతల్లి అవుతుందా! అని! ఆవునేతితో చేసిన మినపసున్ని అజీర్తి ఏమిటిరా, వెర్రి పీనుగా!" అంది సీత.

"ఏమోబాబూ! మీతో ఏది చెప్పినా ఇల్లాగే తిట్టారు. మీతో చెప్పటం కంటె రఘుబావతో ఆడుకోవడం మంచిది. ఏమే సుశీ! వస్తావా ఆడుకొంటానికి? రఘుబావ ఇంచక్కా పేకముక్కలతో మేడకట్టాడు. బువ్వాలాట ఆడుకుందాము. దా!" సుశీ చేయిపట్టుకుని అన్నాడు అబ్బులు.

"వాడి మొహానికి పేకమేడ కాకపోతే సిమెంటుమేడ వస్తుందా? మీరిద్దరూ ఏదో చావండి దాన్నికూడా తీసుక వెళ్ళటం ఎందుకు మేళం?" అన్నది సుబ్బులు.

సుబ్బులికీ, అబ్బులికి, ఋణం పడదు. పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది.

"ఏమిటొదినా తర్వాత కార్యక్రమము? అన్నయ్య నిన్నడగమన్నాడు." అంటూ కుటుంబం వచ్చాడు.

"అదే ఆలోచిస్తున్నాను." అన్నది సిద్ధేశ్వరి.

"అంటే." ఆత్రుతగా అడిగాడు కుటుంబం.

"ఏంలేదు. పూర్ణ ఇంకా చిన్నపిల్ల. మన కెల్లానూ గృహప్రవేశం ఆనవాయితీలేదు. మన వూరు చూడబోతే

శుద్ధ పల్లెటూరు. ఇప్పట్నించీ ఆ పిల్లదాన్ని తీసుకవెళ్ళి, మన లంకలో పడేయటమెందుకు ? ఇక్కడ తల్లి లేదు. బామ్మ ముసలావిడ. ఆచంటిపిల్ల లిద్దరికీ కాస్త సాయి తాగా వుంటుంది. పాపం ! కొన్నాళ్ళు, ఆ పిల్లలిద్దరూ, కాస్త రెట్టకట్టేదాకా, ఇక్కడ్నే అట్టే పెట్టితే, సదానందం గార్కి నిశ్చింతగా వుంటుంది." అన్నది సిద్ధేశ్వరి.

వదినగారి, ఉదారబుద్ధికి విస్మితుడయ్యాడు కుటుంబం. "స్త్రీ త్యాగశీలి, దయామయి, మాతృమూర్తి అన్నారిందుకనే! ఎంతమంది సాధక బాధకాలని, ఆలోచించిందీ వదిన! అటు తన చదువూ సాగుతుంది – ఇటు, సదానందంగారు తల్లిలేని పిల్లల్ని గురించి దిగులు పెట్టుకోకుండా నిశ్చింతగా రోజులు గడపకల్గుతారు."

"అలాగేనమ్మా వదినా ! నీ ఆలోచన దివ్యంగా వుంది. ఇప్పుడే ఆడపిల్లవాళ్ళతో చెప్పేయి." అన్నాడు కుటుంబం.

అవలీలగా తోటికోడలు తమ ఇంట స్థానాన్ని, ఆక్రమించుకుండా చేయగలిగిన, తల్లి ప్రజ్ఞావిశేషాలకి అద్భుత పడ్డారు సీతా, సుబ్బులు.

సిద్ధేశ్వరికి రాజకీయనాయకుల కుండతగ్గ ప్రజ్ఞావిశేషాలు వున్నాయి. కాని ఆమె సామాన్యస్త్రీగా, ఒకసమిష్టి కుటుంబానికి, ప్రాతినిధ్యం వహించవలసిరావటంతో, ఆ అద్భుత తెలివితేటలు వింతపుంతల త్రొక్కనారంభించాయి. వురవళ్ళు పగవళ్ళుగా ప్రవహించే నదీమతల్లికి, సరయిన

ఆనకట్టలుకట్టి, జలాలను కావాల్సినచోటికి మళ్ళించుకోగలిగితే పృథివి సస్యశ్యామల మవుతుంది. లేనిచో వూరులూ నాడులూ ఆ నుడిగుండాలలోపడి సర్వనాశనమగుచున్నవి.

పెళ్ళయిన సంవత్సరందాకా తన్ని అత్తవారు తీసుక వెళ్ళకపోవటం అన్నపూర్ణకి భయంగా తోచింది. తను అంత అందకత్తెకాని మాట వాస్తవమే! గృహప్రవేశం ఆనవాయితీ లేదన్నారు. ఒప్పుకోవచ్చును. ఒకొక్క ఇంటికి ఒకొక్క ఆనవాయితీ వుంటుంది. కాని సంవత్సరం గడిచినా భర్తనించి కాని, బావగారూ, తోటికోడలునించికానీ, వేకబురూ, కాకరకాయ లేకపోవటంతో అన్నపూర్ణకి, భర్త తన్ని వదిలేసి వుంటాడన్న అనుమానం పట్టుకుంది. 'తనంటే అయిష్టతవున్నమనిషిలా అగుపడలేదుమరి! ఆమాడురోజులూ ఉల్లాసంగానే గడిపారు. మరి ఈ పరాన్ముఖ మెందుకు! తీసుక వెళ్ళకపోతేమానే, ఒకసారివచ్చి వెళ్ళగూడదూ-అని తనలో తనే మల్లా గుల్లాలుపడేది అన్నపూర్ణ. అన్నపూర్ణతో పెళ్ళయిన తోటి ఆడపిల్లలు, అత్తవార్ల ఇళ్ళకు వెళ్ళటం, మళ్ళీ పండుగలకు, పబ్బాలకు భర్తతో అత్త, ఆడబిడ్డలతో వేడుకగా రావటం, అన్నపూర్ణకి ఏదో లోటుగా అనిపించేది. వాళ్ళు అందరూవచ్చి,

"నువ్వు ఇంకా ఇక్కడే వున్నావా? అత్తవారు తీసుకెళ్ళలేదా" అని అడిగేవారు. అన్నపూర్ణ ఏం చెప్పాలో తోచక, గిజగిజలాడేది.

"ఆ చిన్నది తల్లిలేనిపిల్ల! అని వాళ్ళాయన, ఇక్కడ్నే వుంచమన్నాడు. అక్కడ పదిమంది పిల్లా జెల్లాతో

చేయలేదని వుంచమంటే వుంచాడు. అదంటే పంచప్రాణాలూనూ, వాళ్ళాయనకి." అని చెప్పేది కనకమ్మగారు.

అన్నపూర్ణకి, క్రోధం వచ్చేది.

"అలాచెస్తావ్ దేనికి మామ్మా? వాళ్ళు నన్ను తీసుకవెళ్ళరుకదా! వదిలేశారు. అని చెప్పేయ్!" వుగ్రోషంగా అనేది అన్నపూర్ణ. "పయిసయివాళ్ళు ఎన్నైనా అంటారు. అంతమాత్రాన్న మనం తేలిపోవాలా ఏమిటి? ఇవ్వాళా, రేపటితో పోయే బంధుత్వంకాదు. వాళ్ళతో నీజన్మ ముడిపడింది. ఇల్లాంటప్పుడు మనం వూహూ వాడ చాటుపోవటం నీభవిష్యత్తుకి మంచిదికాదు. నీలోనిలబెట్టుకోగలిగే సహనానికే, ని జీవితానికి సుఖశాంతిని ఇస్తుంది. ఏ పరిస్థితుల్లోనూ, సహనాన్ని కోల్పోను" అని చెప్తూ కనకమ్మగారు కళ్ళస్నాట నీళ్ళుపెట్టుకున్నారు. అన్నపూర్ణ మామ్మ మాటల్లోని సత్యాన్ని, ఆచరించ పూనుకుంది. అటు పిమ్మటనించీ ఎవరైనా, "నీవు అత్తవారింటికి వెళ్ళలేదా?" అని అడిగితే "మావారి చదువు పూర్తికాలేదనో మాచెల్లి తమ్ముడు, బెంగపెట్టుకుంటారనో" చెప్పేది.

5

ఈమధ్య రాజారామంగారింట్లో చిన్న గాలిదుమారం రేగింది. కుటుంబం పెళ్ళయి సంవత్సరం గడిచినా, భార్యను తీసుకురావటంకాని, తాను అత్తవారింటికి పోవటంకాని, చేయకపోవటంచూసి, స్నేహితుడూ, హితుడూ అయిన రాధాయ్, కుటుంబాన్ని మళ్ళీ పెళ్ళిచేసుకొమ్మని ప్రోత్సహించాడు. కుటుంబానికి ఈ సలహా నచ్చింది. తనకి అన్నపూర్ణ అందం తగదని, కుటుంబం ఏనాడో నిశ్చయించుకున్నాడు. అన్నగారిమాట జవదాటలేక, కేవలం సంసార తృప్తికోసం అన్నపూర్ణని వివాహం చేసుకున్నాడు. "పెళ్ళిచేసుకున్నంత మాత్రాన్న ఆమెతోటే జీవితం అంతా గడపాలని రూల్సున్నవుందా ! శ్రీకృష్ణుడికి పదహారువేలమంది గోపికలు ఎందుకు వున్నారు ? అతని అందానికి, మురళిగానానికి సమ్మోహితులైకదా ! ఆస్త్రీలు అతని చరణదాసులై పోయారు ! ఒక్కొక్క గోపికలో ఒక్కోవిధమైన సౌందర్యం కనిపించి, శ్రీకృష్ణున్ని తమవాడుగా చేసుకుంది ! అనుకున్నాడు కుటుంబం.

కుటుంబానికి తనొక పెద్ద అందగాడిననే అహంభావం వుండేది. సిద్ధేశ్వరీ, పిల్లలూ కూడా పగలుచూస్తే రాత్రికల్లోకి వచ్చేమనుష్యులు ! అడుగుపొడుగునా, జానెడు పెడల్సున వున్న సిద్ధేశ్వరి ముఖం నల్ల తెలుకపిండి అచ్చునూ, పాతకైసు చెప్పునూ జ్ఞప్తికి తీసుకవస్తుంది.

పిల్లలుకూడా తల్లిపోలికకు దగ్గరోనే వుంటారు. కుబుంశానికి కొంచెం రంగువున్న మాట వాస్తవమేకాని అంతమాత్రానికే, తనలాంటి అందకాడు మిస్ యూనివర్సకాకపోతే మానె, కనీసం ఏ ఆంగ్లోఇండియన్ వనితనో తెచ్చుకోవాలన్నంత అహంభావం పెంపొందించుకోవటం, వీమంత సమర్థనీయం? పునర్వివాహం చేసుకోవాలన్న తన భావాన్ని అన్నగారికి చెప్పటంతోటే రాజారామంగారు, తోక త్రొక్కిన త్రాచల్లే లేచారు.

"ఏం నీకేం శని దాపురించింది? వాళ్లు, గుట్టుగల మర్యాదస్థులు కనుక, నీవు ఇన్నిరోజులూ పోకపోయినా వూరుకున్నారు. అదే మరొకళ్ళయితే, అటో ఇటో తేల్చ మని, కోర్టుకీడ్చేదురు. ముగ్గురాడపిల్లలతండ్రి అయివుండి కూడా, తమ్ముడు వెకిలివేషాలు వేస్తోంటే చూస్తూ వూరు కున్నాడని, లోకం నా నెత్తిమీద దుమ్మెచెరుగుతారు. నా సంసారం అంతా నడిరోడ్డుమీద నిలబడాలి. ఇంక నా ఆడపిల్లలకి, పెళ్ళిళ్ళు అవుతాయా? భార్యని వొదిలేసిన పినతండ్రిని చూసి ఎవరు ముందుకు వస్తారూ? వెధవ వేషాలు మాని, లక్షణంగా వెళ్ళి పూర్ణని, తీసుకొచ్చుకో! తోటికోడళ్ళిద్దరూ చెరొకపూటా వండుకుంటారు. ఆపద్ధతి మీదే నా ఇంట్లో వుండు. లేకపోతే నీముఖం నాకక్కనపడ కుండా ఎటయినా పో!" విసురుగా అనేసి కండువా దులుపు కుని భుజంమీద వేసికొని పొలంకేసి వెళ్ళిపోయారు. కుటుంబం ఆలోచించాడు. 'నిజానికి స్త్రీగా, అన్నపూర్ణలో ఏమీ లోపంలేదు. కూడా కూడా త్రిప్పుకుందుకు మాత్రం

తనలాంటి అందగాడిప్రక్కన ఏమాత్రమూ బాగుండదు. కాని తనలాంటి అందమైనవాడు, అన్నపూర్ణలాంటి అనాకారితో సంసారం చేస్తే లోకం అంతా, తన మంచితనాన్ని వేనోళ్ళ పొగుడుతారు. మామగారు ఆస్తిపరుడు. ఆర్జనపరుడు. తను వాళ్లపట్ల మంచిగా వుంటే, అన్నపూర్ణ వల్ల కలిగిన సంతానాన్ని ఆయనే భరాయిస్తాడుకూడా! తనకి అనుకోకుండా ఒక అనాకారిని కన్యచేసనించి తప్పించాడనే కీర్తి లభ్యమవుతోంటే వదులుకోవట మెందుకు? ఇంక అందాలమాటా! ధనం పారేస్తే, బోలెడంత అందం కొనుక్కోవచ్చు! తనలాంటి అందమైన ధనికయువకుడు కావాలనుకుంటే అందాలు దొరకవా? అందం ఆయుధంగా అడుక్కుతినే స్త్రీలు ఎక్కడవుంటారో రాధాయేని అడిగితే సరి! వాడు, సినిమా స్టార్లనే ఒక వూపు వూపాడు, అనుకొని అత్తవారింటికి ప్రయాణమయినాడు. కుటుంబం. సిద్ధేశ్వరి విస్తుబోయింది మొదట! ఆమె తలచినది ఒక్కటీ, జరుగుతోన్నదొక్కటీ! ఇష్టంలేని పెళ్ళిచేస్తే పారిపోతాడనుకున్నది. అలా పారిపోలేదు సరికదా, ఆమెగారినే తెచ్చి తనతెలిన రుద్దటానికి ప్రయాణమవుతున్నాడు. ఇంక ఆగలేకపోయింది సిద్ధేశ్వరి.

"ఒక్కమాట కుటుంబం!" అన్నది.

"ఏమిటమ్మా!" అన్నాడు కుటుంబం. అతనికి అన్నగారి మీదకంటే వదినగారంటే ఎక్కువ భయభక్తులున్నాయి. సిద్ధేశ్వరి కాపురానికి వచ్చేసరికి, కుటుంబం

అయిదేళ్ళ చంటివాడు. ఆమెని బెజవాడ కనకదుర్గలా చూసుకునేవాడు కుటుంబం.

"మీరు పూర్ణని ఇక్కడకు రమ్మనమని జలవంత పెట్టకండి. బస్తీలో అపురూపంగా పెరిగినపిల్ల పాపం! ఇక్కడకు తీసుకవచ్చి, చెర్లోంచి నీళ్లు జేరబోసి వండిపెట్టమంటే భాగుంటుందా? అక్కడ మాత్రం ఎవరున్నారు? తల్లిలేని చిన్నపిల్లలు, అక్కకూడా వుంటే సంబరపడతారు. వాళ్ళని బెంగటిల్లచేసి ఇక్కడకు తీసుకవచ్చి మనం భావుకునేదేముంటుంది? మీ అన్నయ్య మాటలకేం లేండి. ఇంట్లో కుండలు డింకీలు కొడ్తున్నా దర్జాలకు లోపం రానియ్యరు. ఇక్కడకు తీసుకవచ్చి ఇంటిల్లపాదికీ, వండి పెట్టమంటే భాగుంటుందా? అక్కడ హాయిగా వాళ్ళమామ్మ వండి అంచేతిలో ముద్దలు వేస్తేకూడా తినలేనంత దర్జాగా వున్న పిల్లదికదా!" అన్నది.

... ...

కుటుంబం సాఫ్టాత్తూ లక్ష్మణస్వామి. అతనికి, అన్న గారిపిల్లలే సర్వస్వం! ఆమె ఆజ్ఞ తిరస్కరించటానికి అతనికి బితుకు బితుకుగా వుండేది.

అన్నపూర్ణ భర్తసిచూసి సంబరపడింది. ఇరుగు పొరుగువారందరితో, తాను అత్తవారింటికి, వెళ్ళిపోతున్నా నని చెప్పి సంబరపడింది. కనకమ్మగారు మినపసున్ని, అరిసెలుచేసి, డబ్బాల్లోదాచారు. వచ్చిన వారంరోజులదాకా ప్రయాణం మాట ఎత్తలేదు కుటుంబం. అన్నపూర్ణకి, భర్త వారంరోజులూ తనతోటి గడపటంతో కొంచెం కొత్తవది

లింది. తండ్రికొన్న రెండు కొత్త చీరలూ కుటుంబానికి చూపెట్టింది.

'బాగున్నాయి' ముక్తసరిగా అన్నాడు కుటుంబం.

"అరడజను జాకెట్లకి సరిపడగ బట్టకొన్నారు." అంది అన్నపూర్ణ.

"అలాగా!"

"ఈ రెండుచీరలూ ఒకటి చాకలిదానికి ఇంకొకటి మన పనిచేసే మనిషికీ ఇవ్వాలట. అందుకని కొన్నారు. జాకెట్టు గుడ్డలు అందరికీ ఇమ్మన్నారు. పళ్ళుకొనాలట! గూడెంలో చక్కెరకేళి, అరటిగెలలు కొనమన్నారు. మామ్మ చలిమిడిచేస్తోంది. పళ్ళకి మా అప్ప డబ్బు ఇస్తా నన్నారు; ఇప్పుడే కొనేస్తే అక్కడికి వెళ్ళేసరికి కుళ్ళిపోతా యని!" అంది.

"ఏమిటీ ప్రయాణ సన్నాహం?" అన్నాడు.

"మరి మీరు నన్ను తీసుకవెళ్ళుతారుగా!" అన్నది అన్నపూర్ణ.

"ఏదో పోనీకదా చూసిపోదామని వస్తే నాతో పంపేద్దామని వేస్తున్నారా? ప్లాను! అంత భరాయించ లేకపోతే కష్టం; తీసుకవెళ్ళి పడేస్తాను. పెద్దలు స్తిమంతులని పేరు. కన్నకూతురికే అన్నం పెట్టటానికి ముఖం చూసుకునే మనుష్యులని నాకు తెలీదు" అని వెంటనే తన బట్టలని సర్దు కోనారంభించాడు. అన్నపూర్ణ నిర్ఘాంతపోయింది. కనకమ్మ గారు మెల్లిగా వచ్చారు.

'అయితే ఈ సారికి పూర్ణని తీసుక వెళ్ళవా నాయినా' అని అడిగారు.

'ఈ అవతారమూ రని వెంటపెట్టుకు పొమ్మనా మీ వుద్దేశ్యం?' అన్నాడు కోపంగా.

'పెళ్ళి అయి అన్ని ముచ్చట్లూ అయినాక, ఇద్దరూ చెరొకచోట వుండటం ఏం బాగుంటుంది బాబూ! వీడో తీసుక వెళ్ళి నాల్రోజులుంచుకుని, పంపుతోంటే సబబుగా వుంటుంది. ఏదో కాస్త చేతికి,కాలికి సాయితాగా వుం టుంది' అన్నది భయపడుతూనే, కనకమ్మగారు.

"మీ మనమరాలు పండి వార్చకపోతే మేమంతా లంఖణాలు చేయాలనుకొంటున్నారల్లేవుంది. అదేంకుదరదు. నేను తీసుక వెళ్ళను. తీసుకు వెళ్ళనిదానికి, నువ్వెందుకు రావటం? అంటే నేనూ రావటం మానేస్తాను" గట్టిగా అన్నాడు. అన్నపూర్ణ లోపలికిపోబు గుడ్లనీరు, గుడ్లకుక్కు కుంటూ, కూర్చుంది.

"ఛ! అంత మాటెందుకు బాబూ! నీకు తీరికవున్న ప్పుడు నువ్వే వస్తుండు! నీ కెల్లా ఇష్టమైతే అల్లానే కానీయి. మాకు మాత్రం ఎవరున్నారు?" అన్నారు కనమ్మ గారు.

"అప్పా! నువ్వు తీసుక వెళ్ళ దింపెయ్యి నన్ను! ఎన్నే ళ్ళిలా? ఆయన ఇష్టంవచ్చినప్పుడు వస్తారు; లేనప్పుడు లేదు" అనేది అన్నపూర్ణ.

"పోనీలే అమ్మా! ఇక్కడమాత్రం నీకేం కష్టం! అతని కిష్టమయినప్పుడు అతనే తీసుకవెళ్తాడు. బొత్తుగా అతని కిష్టం లేనప్పుడు మనం తొందరపడి వెళ్ళకూడదు అతని పరిస్థితి ఏమిటో. ఎందుకని తీసుకవెళ్ళటంలేదో. మనకేం తెలుసుగా? ఇక్కడకు వచ్చినప్పుడు, సరదాగా మనతో కలిసిపోయి వుంటున్నాడుగదా?" అనేవారు సదానందం గారు.

కాలం ఊరుకోదుకదా మరి! కాలచక్రానికి మనుష్యుల పరిస్థితులతో, ప్రవర్తలనతో ప్రమేయముండదు.

6

అసురసంధ్యవేళ! రాజారామంగారు, విధరుగుమీద కూర్చుని పాలేళ్ళకి ధాన్యం కొలిపిస్తున్నారు. పాలెంవెళ్ళిన కోమటి గురవయ్య బండి నిండుగా, అపరాలు వేసుకుని, నిండు చూలాలిలా అరుగువార నిలబడి ది. చిన్న పాతగుడ్డ మూటకట్టుకుని, చెంగున క్రిందకు దూకాడు రఘు. వెనకాతల నెమ్మదిగా, సుబ్బమ్మ క్రిందకు దిగుతూ—

'అంతా కులాసానా, అన్నాయ్!' అంది.

"ఆఁ కులాసాగానే వున్నాము. లోపలకు పదండి! వృత్తరం వ్రాయకపోయేవా, మన బండి పంపిద్దునూ" అన్నారు రాజారామంగారు.

'రావాలని అప్పటికప్పుడు అనుకున్నానన్నాయ్! అంచుకని ముఖస్తుగా తెలపటం జరగలేదు' అని సావిట్లోకి వెళ్ళింది. రఘు తెచ్చిన మూట సుశీలా, అబ్బులూ, విప్పి తూంచే, సుబ్బులు చోద్యం చూస్తూన్నట్లు నిలబడింది.

'పిద్దత్తా కాసిని మంచినీళ్ళియ్యవ్!' అన్నాడు రఘు.

చెర్లో కావాల్సినన్ని మంచినీళ్ళున్నాయ్ అల్లుడా! చూడలేదూ? అంది సిద్ధేశ్వరి.

'వాడేం తెలియనివాడా ఏమిటమ్మా వొదినా! అల్లుడు ప్రజామాపెట్టున్నాడు. మంచినీళ్ళడిగితే, కాఫీ ఇస్తా వుడా అని వేశాడు ప్లాను' హాస్యంగా అన్నది సుబ్బమ్మ.

వెంటనే ముఖం విచారంగా పెట్టింది సిద్ధేశ్వరి

'మీ అన్నగారి ఆవు ఈచుకపోయింది. సమృద్ధిగా పాలు ఇస్తున్న, కుటుంబం బంగోలు ఆవు పురుగుముట్టి చచ్చిపోయింది. వేదన్నా, చిన్న గేదెని కొనమంటే, దాళవా కోతలు-చేతులో డబ్బులేదు అంటున్నాడు, అన్న దమ్ములు. వూళ్ళో యెక్కడా, గుక్కెడు పాలు దొరకటం లేదనుకోండి. చల్లనీళ్ళకి ముఖం వాచిపోయాము. మజ్జిగ బదులు, బెల్లపునీళ్ళు పోసుకుని తింటున్నాం. అన్నం, కాఫీ, ఎల్లావుందో చూసి, నాలుగునెల్లు అయ్యింది' అన్నది సిద్ధేశ్వరి.

సుబ్బమ్మకి, ఇదంతా కొత్తకాదు. అత్తవారి తరపు

పుట్టిల్లు

బంధువులు ఎవరువొచ్చివున్నా, సిద్ధేశ్వరి నాలుగురోజుల్లో ఇల్లంతా, అయ్యవార్లంగారి, నట్టిల్లుచేసి చూపెట్టుంది. ఏదన్నా అంటే,

"నాచేతిలో అక్షయపాత్ర ఏదన్నా వుందనుకున్నారా! అందరూ వొచ్చి, నెల్లతరబడి, తిష్ఠలువేసుకు తింటూంటే సామాన్లు, అయిపోక, వూరిపోతాయా! చెట్టుకు కాయటంలేదు సామాన్లు. రూపాయలుపోస్తే వస్తాయి" అంటుంది. ఆ మాట అనిపించుకోవటం ఇష్టంలేక, అయిదుగురి పిల్లలతల్లిని ఏమీచేయలేక, వూరుకుంటారు రాజారామంగారు. అంచేతే, చిన్నతనంలో, భర్తని పోల్పోయిన సుబ్బమ్మ, మూటయాభై యకరాలకి కామందులయిన, అన్న దమ్ములుండీకూడా, చిన్న ఆడబడుచు ఇంట్లో ఆపసీ ఈపసీ చేసిపెట్టూ, వాళ్ళనే మంచిమాట ఆడుకుంటూ కాలక్షేపం చేసుస్తోంది. స్త్రీకి కష్టమునకూ, సుఖమునకూ, ఆదుకొనేది పుట్టిల్లు అంటారు. ప్రతిస్త్రీకూడా, తన పుట్టిల్లు అంటే విపరీతంగా ప్రేమిస్తుంది. తన అన్నదమ్ముల ఇల్లు, సిరిసంపదల కాలవాలమై వుండాలని కాంక్షిస్తుంది. కాని అన్న తమ్ములు మట్టుకు పెరిగి పెద్దవారైనాక, అక్కచెల్లెళ్ళంటే అంత అభిమానించరు. తమ తల్లితండ్రులు, అక్కచెల్లెళ్ళకి దోచిపెట్టేశారని బాధపడతారు. వారి భార్యలయినా అంతే! ఇంటికి, తమవెంపు బంధువర్గంవచ్చివుంటే వున్న వుపాయములు; అత్తఆడబిడ్డలు వచ్చివుంటే వుండవు. ఏల వచ్చేరా దేముడా, అన్నట్లు, లేనిపోని రోగాలు, కోపాలు, దెబ్బలాటలు తెచ్చుకుంటారు.

రఘు ఈలవేసుకుంటూ చెర్లోకి పరిగెట్టుకునివెళ్ళి కాళ్ళూ చేతులూ ముఖమూ కడుక్కుని కడుపునిండుకూ నీళ్ళు త్రాగి, చొక్కాతో ముఖం తుడుచుకుంటూ వచ్చి మామయ్యదగ్గిర నిలబడ్డాడు.

"ఏరా పరీక్షలు బాగా వ్రాశావా?" అన్నాడు రాజారామంగారు.

"ఓ! ఫస్టుగా వ్రాశాను మామయ్యా!" అన్నాడు రఘు.

2853

"ఇక్కడ నిలబడకు. దుమ్ము! లోపలికివెళ్ళి అబ్బులితో ఆడుకో! అత్తని మినపసున్ని పెట్టమని తిను! వొళ్ళే అబ్బులూ! రఘుబావకి, అమ్మని మినపసున్ని పెట్టమ్రా! మీరందరూ ఇంచక్కా ఆడుకోండి" అన్నారు రాజారామం గారు.

అంతవరకూ అత్తతెచ్చిన మూటవిప్పి అరటిపళ్ళూ, జామపళ్ళూ, వాటాలు వేసుకుంటున్న అబ్బులూ, సుశీలా మినపసున్ని మూటవినేసరికి ఒక్కసారి లేచిపోయారు.

"అమ్మా అమ్మా! మాకు సున్నుండలు పెట్టవే! రఘుబావకి రెండియ్యవే, వాడు నిన్న లేడుగా!" అన్నాడు అబ్బులు. సిద్ధేశ్వరి, సిదానంగా పిల్లవెంపుమూసి, మెల్లిగా నవ్వి రెండుచేతులూ తిరగవేసి బోర్లించింది.

"ఎక్కడున్నాయ్ వెర్రివెధవాయిల్లారా! ఇదీవొరస! వొదినా మీ అన్నయ్యకి, తింటానికి నోరువుంది కాని, సామాన్లు తేవటానికి చేతులుండవు. నిన్న మధ్యాహ్నం,

నోరు బాగాలేదంటే కాస్త పిండివుంటే కలిసాను. అది ఇప్పటివరకూ వుంటుందా? అసలే రావణాపిల్లలు! ఏదన్నా చేస్తే, అన్నంకూడా మానేసి, అదే తింటూ కూర్చుంటారు. మీరు స్నానంచేసి రాండి! మధ్యాహ్నం ఎప్పుడనగా, భోజనంచేశారోఏమో! కాసిని బియ్యం పొంగించుకుంటురుకాని! పిల్లలకి అన్నంవుంది. నాకు నోరు చేదుగా వుంది. నేను ఈ పూట భోజనం చేయను. మీకూ, మీ అన్నతమ్ముల్లకే వంట!" అంది సిద్ధేశ్వరి.

"ఏమిటే అమ్మా! సున్నుండలు అన్నీ. అయిపోయాయా? ఇందాకనే కదూ! బుట్టనిండాపెట్టి సుబ్బిచేత మామయ్య వాళ్ళింటికి పంపించావ్! మాకు పెట్టమంటే లేవని చస్తావేం?" అన్నాడు అబ్బులు. రఘు అబ్బులు నోటి దురుసుతనానికి నిర్ఘాంతపోయాడు.

"మాయచచ్చినాడా! నేను మామయ్యా వాళ్ళింటికి వెళ్ళానా? నువ్వుచూచి చచ్చావా! దొంగపీనుగా! ఈసారి ఇల్లాంటి అబద్ధాలుచెప్పి నీ తల పగలకొట్టాను" అని అరవ సాగింది సుబ్బులు.

"నేను చూశాను. దడిలోంచి, సూరమ్మగారి పెరట్లోంచి వెళ్ళలేదూ! చేసినవన్నీ వాళ్ళ ముఖాల్న తగలేయటం, ఇంట్లో మాకు పెట్టమంటే లేవు పొమ్మనమంటం! ఇదేం భాగుందేం!" ఏడుపుగా అన్నాడు అబ్బులు. సుబ్బులు ఇంక ఆగలేక, వాణ్ణి బాదసాగింది. వాడు వ్యూహంలా! తిరగబడి కొట్టాడు. ఒకళ్ళ నొకళ్ళు కొట్టుకుంటుంటే, రఘు ఆశ్చర్యపోయాడు.

"అబ్బబ్బ వూరుకోవే సుబ్బులూ! అసలే చీపురు పుల్లలా వున్నాడు. వాణ్ణి అలా బాదేస్తావేమిటే కాస్తన్నా జాలిలేకుండా?" అన్నది సుబ్బమ్మ ఆగలేక.

"అదికాదు వొదినా! వీడస్సలు లేనిపోని మాటలు కల్పించి అంటాడు. వీడిమాటలు నిబద్ధి అనుకుని, మీ అన్నయ్య నన్ను చావమోదుతారు. అలా చితకొట్టినా బుద్ధివస్తుందా ఏమిటి! వెధవ ధనియాలజాతి! మీరు స్నానం చేయండి. రండి; ఆలస్యం అయింది. రాత్రయిపోతోంది" అన్నది సిద్ధేశ్వరి. సుబ్బమ్మ చేసేదేమీలేక, స్నానంచేయ టంకోసం, మంచినీళ్ళబిందె తీసుకొని చెరువుకేసి వెళ్ళిపో యింది. సుబ్బులూ, అబ్బులూ, దారాసింగ్, ఆలీరజాలను మించుతున్నారు. నోటికి వచ్చినన్ని తిట్లు తిట్టూ, కొట్టుకుం టున్నారు. సుశీల మధ్య మధ్య రిఫరీగా రాబోయి వాళ్ళ పిసురుకు తూలి గోడకు కొట్టుకుంటూ పెద్దగా ఏడుస్తోంది. రఘు ఇంక ఆగలేకపోయాడు. గబగబా వాకిట్లోకి వెళ్ళి,

"మామయ్యా మామయ్యా! వాళ్ళు కొట్టుకుంటు న్నారు" అన్నాడు. రాజారామంగారు, మధ్యాహ్నంనుంచీ ధాన్యం తూకం వేయిస్తూ పాలేళ్ళ జీతాలు కొలిపిస్తూ ఆ లెక్కలతో సతమతమౌతున్నారు. దానితో ఆయనకు ప్రళయకాల రుద్రునిలా అరికాలుమంట తలకెక్కిపోయింది. వెంటనే బెడ్డింగు కట్టుకునే తోలుబెల్టు పుచ్చుకుని, ఏమిజరి గిందో వాళ్ళు యెందుకని కొట్టుకోవాల్సి వచ్చిందో కారణం తెలుసుకోకుండానే—

"నన్ను విసిగిస్తున్నారు వెధవల్లారా! ఇద్దరూ ఛావండి నా శని విరగడవుతుంది" అంటూ యిద్దర్నీ కలిపి బాదసాగారు. అప్పుడే పొలంనించి యింటికివచ్చిన కుటుంబం—

"ఏంటన్నయ్యా అల్లా కొట్టిచంపుతున్నావ్! పిల్ల ముండ వాళ్ళని!" అని మధ్యకు రాబోయాడు.

"నువ్వూరుకో! అడ్డురాకు! ఇవ్వాళ వీళ్ళ అంతూ పంతూ తేల్చేస్తాను" అంటూ ఇంకా బాదసాగేడు.

సాధారణంగా ఎవళ్ళయినా పిల్లల్ని కొట్టుకుంటున్నప్పుడు, అడ్డురాగూడదు. కొట్టొద్దని మనం అంటూన్న కొద్దీ అదే, వాళ్ళ ప్రజ్ఞా పాటవాలకి, కొలబద్ద అయినట్లు ఇంకా ఎక్కువ కొట్టసాగుతారు. పిల్లలయినా అంతే! ఏడ్చే పిల్లలదగ్గరికివెళ్ళి—

"మా బాబుగా వీడవకమ్మా!" అని సముదాయించి చూడండి. మనం సముదాయించినకొద్దీ వాళ్ళు శృతిపెంచుతారు తప్ప, తగ్గనివ్వరు. వద్దన్నకొద్దీ అలవాటుని ఎక్కువచేసుకోవటంలో పిల్లలూ, పెద్దలూ అన్నతేడా ఏమీ లేదు.

సుశీల, చిన్నాన్న చంక నెక్కింది వెక్కి వెక్కి ఏడుస్తూ.

'మకేం చిన్నాన్నా! రఘుబావ, అక్కాయిమీదా అన్నాయిమీదా, నాన్నారికేమో చాడీలు చెప్పాడు. నాన్నా కేమో, వాళ్ళని కొట్టున్నారు' అన్నది. కుటుంబం అగ్ని హోత్రుడయ్యాడు.

"ఏరా రఘూ ? మింగ మెతుకు లేదు మీసాలకి సంపెంగనూనెలా వుంది నీ బ్రతుకు? వారాలు చేసుకు బ్రతుకుతున్నావు. బుద్ధిలేదురా రాస్కెల్ ! వాళ్ళింటికి వచ్చి, పాళ్ళ పిల్లలమీద చాడీలు చెప్తావురా, ఇడియట్" అని రఘుని చెండటం మొదలుపెట్టాడు కుటుంబం. రఘు తెల్లబోయాడు. తను చేసిన తప్పేమిటో ఆ చిన్న హృదయానికి తెలియటంలేదు. ఇద్దరూ కొట్టుకుని తిట్టుకుంటుంటే గాభరాపడి, మామయ్యతో చెప్పాడు. మామయ్య వాళ్ళని విడదీస్తాడేమో అనుకున్నాడు. ఆయన విడదీయలేదు సరికదా, ఆయన కూడా వచ్చి బాదుతున్నారు. ఈ దారుణ హింసాకాండతోబాటు చిన్నమామయ్య తన్నితిట్టి న్నాడు. అంతా అగమ్యగోచరంగా కన్పించింది. మారు మాట అనకుండా, విధరుగుమీదకువెళ్ళి నల్లని నిశీధా కాశంలో మెరిసే చుక్కల్ని చూస్తూ కళ్ళల్లోని సీరు, కళ్ళ ల్లోనే ఇంక పెట్టుకుంటూ కూర్చున్నాడు. పొయ్యి భగభగా మండిపోతున్నా బియ్యం పడేయటం మర్చిపోయి నిర్ఘాంత పడి, నిలుచుండిపోయింది సుబ్బమ్మ. సిద్ధేశ్వరి మటుకు, తీరు బాటుగా లాంతరు వెలిగించి గడపమీదపెట్టి, జుట్టు చిక్కు తీసుకుంటూ వూడిపోయిన జుట్టుని కాలి బొటనవ్రేలికి చుట్టుకుంటూ కూర్చుంది.

అనూరాధ బల్లోకి వెళ్ళటానికిజడేసుకుని గౌనుతో దు కుక్కని, ముస్తాబయి, వంటింట్లో కనకమ్మగారి వెనకాతల నించుంది.

"ఏమే పైంకాలా! నించుంటావేం, వెళ్ళు!" రమణకి తలదువ్వుతోన్న అన్నపూర్ణ కూతుర్ని గదమాయించింది.

"నేనూ, బల్లోకి వత్తానేరాదా?" అంటూ గింజుకో సాగాడు రమణ. అన్నపూర్ణ వాణ్ని గట్టిగా పట్టుకుంది. అనూరాధ దృష్టి కనకమ్మగారు వేయిస్తోన్న, స్వగ్గువడియాల మీదవుంది. అంచేత తల్లి అదిలింపుకాని, రమణ గోల కాని, ఆ పిల్లది పట్టించుకోలేదు. కనకమ్మగారు వెనక్కి తిరిగి చూశారు.

"ఆసి భడవా! వెనకాతల వున్నావా? ఇంద వడియం! తమ్ముడు ఏడుస్తున్నాడు, వాణ్ని కూడ తీసుకపో బల్లోకి!" సగం వడియం రాధచేతిలో ఎత్తివేస్తూ, అన్నారు కనకమ్మగారు.

"వాడు మొక్కా తొడుక్కోడు మామ్మా! పైగా సగంలో, బెంచీ మీద పడుక్కుని నిద్దరోతాడు. మాష్టారు మీ ఇల్లు దగ్గరేకదా తీసుకపోయి అమ్మగారికిచ్చేసిరా!- అంటారు. వాడు నడవడూ! నేను ఎత్తుకుని మొయ్యలేను." అంది అనూరాధ. తల్లి కనకమ్మగార్ని మామ్మా, అని పిలవ

టంవల్ల, పిల్లలిద్దరూ కూడా కనకమ్మగార్ని మామ్మా, అనే పిలుస్తారు.

"ఎంత చదువు చదివావే గుమ్మడికాయలా ముఖం నువ్వూనూ! పోన్లేరా! దాన్నిపోనీయి! నీకు "ఢమ ఢమా"లు బండికొనిస్తాను ఆనక!" అంది అన్నపూర్ణ రమణని దగ్గరగా పొదువుకుని. అనూరాధ రోడ్డుమీదకు వురికింది.

అన్నపూర్ణ కడుపు ఫలించింది. ఇద్దరు పిల్లలు, పుట్టి పెరుగుతున్నారు. తిమనుటుకు తాము ఒక చిన్న సంసారం లాగున్నారు. అల్లాంటప్పుడు ఇంకా పుట్టింట్లో వుంటం బాగు అనిపించలేదు. ఈమధ్య కుటుంబం వచ్చినప్పుడు, మళ్లీ ఒక్కసారి అడిగింది.

"ఏమండీ, నన్నుకూడా తీసుక వెళ్ళండి! ఎంత కాలమనీ, మీరు అక్కడా, నేను ఇక్కడా వుంటంచెప్పండి! ఏం బాగుంటుందీ మీకే ఆలోచించండి!"

"ఏం? నా మీద విరహం భరించలేక పోతున్నావా? అక్కడికెందుకు?" వెటకారంగా అన్నాడు కుటుంబం.

"ఛ! అల్లా అంటారు ఎందుకు? పిల్లలు ఎదిగొస్తున్నారు. పిల్లలు ఎదిగే రోజుల్లో మధ్యస్థంగా వుంటేపాడయిపోతారు. వాళ్ళకి చదువూ సంధ్యలూ, పెళ్ళిళ్ళూ పేరంటాలూ చేయాలా, వద్దా!" అన్నది.

"ఊ! సొదపెట్టకు! నా ఖర్మాన, నన్ను బ్రతకనీయి. ఇల్లా నా రోజులు వెళ్ళిపోతే చాలు!" విసుక్కున్నాడు.

"అదేం మాటండీ! పిల్లలూ భార్యావుండగా ఎంత కాలమని, అన్నగారింట్లో వుంటారు? వాళ్ళమట్టుకు మీకు ఎన్నాళ్ళు వేడి, వెచ్చాచేసి పెడతారు? నాకున్న బాధ్యత, స్వాతంత్రతా, వాళ్ళకేంవుంటుంది ? కావాల్సివస్తే మీ రొచ్చిన వాటాలో అయిదెకరాలో, పదెకరాలో ఇచ్చేయండి, పిల్లలు ఎక్కువ వున్నారుకనుక. అంతేకాని వాళ్ళకి ముట్టచెప్పాలని,వాళ్ళింట్లోనే వుండాల్నా!వాళ్లేమో, పెళ్ళాం పిల్లల్ని బస్తీలో దాచుకున్నాడు; మా చేత చేయించుకుంటున్నాడు-అని చెప్పుకుంటారుట! ఏదో మన మానాన మనం పడివుంటే తీరిపోయేదానికి, ఒకళ్ళచేత మాట అనిపించుకోవటం ఎందుకు? మీరు పడేమాటలు అన్నీ వింటుంటే నాకెంత బాధగా వుందో మీ కేం తెలుస్తుంది? నేను ఆ మాత్రం వండిపెట్టలేనా చెప్పండి!" భుజ్వాగ్ను రాలై అంది అన్నపూర్ణ.

"ఏడిశావ్ వెధవ సలహాలూ నువ్వూనూ! అంత కంటే, మా బాబు పెట్టలేక పొమ్మంటున్నాడని చెప్పి యాడవకూడదూ? అసలు సంగతి చెప్పుకోవటానికి ఆభి జాత్యం చావలేదు! పుట్టింటి మమకారం అడ్డువస్తుంది అమ్మగారికి ! పాపం!" ఈసడింపుగా అన్నాడు కుటుంబం. అన్నపూర్ణ నిర్ఘాంత పోయింది. ఎంత అజ్ఞానదన్నోచూడండి! ఆణిముత్యాల్లాంటి పిల్లలు! అదితి వంటి భార్య! కేవలం మేము పోషించలేమని పుట్టింటివారు వెళ్ళకొడితే తప్ప, తన భార్యా పిల్లల్ని సంరక్షించుకోవాల్సిన అవసరంలేదను కునేభర్త! భర్త అనగా భరాయించువాడు - అని అర్థం !

వివాహబంధం అతి పవిత్రమయినది. ఆ మూడు ముళ్ళల్లో వున్న మహిమ అనంతమయినది! వాళ్ళ శరీరాల ఏకత్వంతో పాటు, ఆత్మలు కూడా, ఏకమయిపోయి, అద్వైతభావమును పొందుతాయి అంటారు. జన్మాంతమూ కలిసి ప్రయాణించే, వాళ్ళ జీవితయానంలో, అతి పవిత్రమయిన గృహస్థవిధు లను నిర్వర్తిస్తూ ఇరువైపుల బంధువర్గాన్ని పార్వతీ పరమేశ్వరులై ఆదరించాలి!

"అవేం మాటలండీ! వాళ్లు వీళ్లు పోషించగలిగితే మటుకు, మనకని ఒక సంసారం ఏర్పడొద్దుటండీ! పిల్లలు ఎదుగుతున్నారు. వాళ్ళని ఈ లోకంలో వ్యక్తులుగా నిలబెట్టాల్సిన బాధ్యతమనదికాదా? ఇప్పటికయినా మనదంటూ ఒక యిల్లూ వాకిలీ లేకపోతేఎలా?" వున్విగ్నంగా అంది.

"ఎప్పుడూ వెధవసొద, వెధవసొదాని! నా కోసం కన్నట్లు మాట్లాడుతావేమిటి? శనిలా దాపురించారు, నా ప్రాణానికి! నువ్వూ నీ పిల్లలూ, ఏ గంగలోదూకినా సరే, నా జోలికివుటుకు రాకండి! కావల్సివస్తే, కాగితం వ్రాసి ఇస్తాను." విసురుగా అన్నాడు.

"నువ్వూ నీ పిల్లలూ" అన్నమాట అన్నపూర్ణకి కళాఘాతంలా తగిలింది. తనకేమీ కారా వాళ్ళు? వాళ్ళని కనటంలో తప్పంతా తనదేనా? తన పిల్లలట! వాళ్ళు తన పిల్లలు అయితే మరి ఆయనపిల్లలు ఎక్కడవున్నారో మరి? అన్న పిల్లలే తనపిల్లలేమో తనకేమి తెల్సు? ముందువెనుక లాలోచించకుండా శరీరం అర్పించినందుకు ఫలితం ఇది? వీదో పిల్లలు కలిగితే నన్నా, వాళ్ళ లేతముఖాల్లో ప్రతి

బింబించే, తన ముఖాన్నయినా చూసి, మనసు మార్చుకుని తనతో సాఫీగా సంసారం సాగిస్తారనుకున్నది. స్త్రీ ఎప్పుడూ అప్పటికప్పుడు జరిగేదే చూసుకుంటుంది, ముందాలోచన శూన్యం స్త్రీకి! అందుకనే, స్త్రీ పతనమౌతున్నది. పతన మయినా ఆ పరాభవం, స్త్రీనే అగ్ని జ్వాలల్లా చుట్టుముట్టు తుంది. పతనానికి కారణమయిన పురుషుడు మటుకు, మహా రాజులా, ధీరుగా బ్రతుకున్నాడు. అందుకనే, స్వయంగా తాళిగట్టిన భర్తతో సంసారం చేయగా పుట్టిన పిల్లల గురించి కూడా, అన్నపూర్ణ తానేదో తప్పుచేసిన దానిమల్లే బాధపడసాగింది.

8

సుబ్బమ్మ గురించి అందరూ, తలొక మాటా అంటూంటారు. భర్త పోయేసరికి, సుబ్బమ్మకి ఇరవయి సంవత్సరాలు చూత్రమే వుంటాయి. రఘుకి ఆరు సంవత్స రాలువయసున్నది. అన్నలూ, వదినలూ, ముచ్చటగా సంసారాలు జరుపుకుంటూంటే చూడలేక, ఆ అసూయ భరించలేక అత్తవారి పంచన చేరిందని అంటారు! నిజం దేముడెరుగు, నీరు పల్లమెరుగు– అన్నసామెతలా, సుబ్బమ్మ పుట్టింటనే మర్యాదగా, గడుపుదామని ఎంత బాధపడిందో దేముడికే తెలియాలి. నిండు వయస్సులో, విధవయై, చంటి

వాడు తప్ప, మరో సంతలేని యువతి, భావమరదుల్లోనూ, అత్త ఆడబిడ్డల్లోనూ వుంటం ఏ మంత గౌరవ ప్రదమయిన విషయం కాదు. ఆ సంగతీ సుబ్బమ్మకి తెలుసును. అందు కనే భర్తపోయిన పధ్నాలుగో రోజున, అన్న అయిన రాజా రామంగారితో పుట్టింటికి వచ్చింది. తన్ని కనిపెంచిన అమ్మా, నాన్నా, లేకపోయినా, అన్నకూడా, నలుగురు పిల్లలుగల తండ్రికనుక, తన్ని కడుపులో పెట్టుకుని దాచు కుంటుకు సిద్ధమయినాడని అన్నగారన్నా, వొదినగారన్నా పుట్టెడు అభిమానం, నింపుకున్నది సుబ్బమ్మ. పిల్లలు గల వాళ్ళకే మనుష్యులయొక్క మమతలు; అర్థమౌతాయి. అనుకుంది సుబ్బమ్మ! సుబ్బమ్మ ఇంటికి వొచ్చిన రెండు రోజులకే సిద్ధేశ్వరికి అంక పొంకాల మీద జ్వరం వొచ్చే సింది.

మాంగళ్యానికిదూరమై వైవాహిక జీవిత చిహ్నంగా మిగిలిన పసికందుని లోకంలో ఎలానిలబెట్టుకలనా అని అమిత వ్యధ చెందుతూన్న సుబ్బమ్మ, వంటచార్జీ తీసుకోక తప్పలేదు.

"పుట్టెడు చీకటిలో వున్నావు. నాకు ఈ మాయ దారిరోగం ఇప్పుడే దాపురించాలా! రెండు రోజులు నీకు దుఖం, తీరేదాకాఅన్నా గుప్పెడు అన్నంవండి పెట్టలేక పోయాను. పాపిష్ఠిదాన్ని!" అంటూ వగలు పోయింది సిద్ధేశ్వరి!

"ఫర్వాలేదు వొదినా! బాధపడి బెంగపెట్టుకోకు! మనలో ఋనంకాకపోతే పైవాళ్ళు కష్టానికీ సుఖానికీ ఆదు

కుంటూరా?" అన్నది సుబ్బమ్మ. అన్నగారిమీద విపరీత మయిన కృతజ్ఞతాభావంతో వున్న సుబ్బమ్మ, తన పెట్టెతీసి నగలమూట తీసింది. తన్ని కష్టంలో ఆదుకున్నారుకదా అని రెండు జతల గాజులుతీసి సీత కిచ్చింది. మూడు వరసల గొలుసు, దండ పట్టీలు, రెండువరసల పుస్తెలతాడూ, వడ్డాణం, మొదలయిన ఇతరవస్తువులు అన్నగారి చేతికిచ్చి, "అమ్మివేసి డబ్బుచేయి అన్నాయ్!" అన్నది. ఆయన అవి అమ్మి సుబ్బమ్మ చేతికిచ్చి;

"ఇదుగో నమ్మాయ్! పంధొమ్మిది వందలు వచ్చినాయి. తీసుకుని దాచుకుంటావో, లేక వడ్డికిస్తావో, లేక పదికుంచాల భూమి గొనుక్కుంటావో, నీ ఇష్టంవచ్చినట్టు చేయి. రఘు కుర్రవెధవ! వాణ్ని ఎల్లాపైకి తీసుకవచ్చి, చదివించుకుంటావో ఏమిటో, నా కంతా అగమ్య గోచరంగావుంది." అన్నారు బెంగగా.

సుబ్బమ్మ హృదయం తటపటాయించింది. నూటయాభై యకరాలు అజమాషీ చేస్తున్న రాజారామంగారి కన్న, తనకు కావాల్సిన మొగదిక్కు ఎవరున్నారు? తన అన్న తమ్ముళ్ళు, తనబాగోగులు చూడకపోతే ఇంకెవరుచూస్తారు? ఆమె కళ్ళు అశ్రుపూరితా లయ్యాయ్!

"అదేమిటన్నయ్యా! నాదగ్గరెక్కడ దాచను? ఆడ దాన్ని నాకు డబ్బువ్యవహారాలేమి తెలుస్తాయి? నీదగ్గరే వున్నాయ్యి! ఏదయినా మంచిపొలం ఖరీదుకొచ్చినప్పుడు, నువ్వేచూసి ఏదన్నా, కొని పడేద్దువుగాని" అన్నది. వినమ్రంగా సుబ్బమ్మ.

"అలాగేనమ్మా! అన్నట్లు రఘు, హైస్కూల్‌లో జేరాలి కాబోల్ను, ఏంచేద్దామనుకుంటున్నావ్!"అన్నారు.

రఘు ధర్మసంకటం ప్యాసయినాడు. "వాళ్ళ మేనత్త దగ్గిర వుంచుతాను" అన్నది.

"ఆమెకే నలుగురు పిల్లలు! వాళ్ళల్లో వీణ్ణి ఎల్లా కనిపెట్టుకుని చదివించుతుంది? నాకొకటి తోస్తూంది. అరుంధతి, పాలెంలో మకాంవుంటుందట! అబ్బుల్ని అక్కడ అట్టేపెట్టుదామను కుంటున్నాను. వాడితోబాటు, రఘునికూడా అక్కడ్నే వుంచుదాము. ఇద్దరూ కలసి చదువుకుంటారు" అన్నారు.

అరుంధతి అంటే మండిపడే అన్నగారికి, అరుంధతి వద్దనే పిల్లల్నివుంచి, చదివిద్దామన్న ఉద్దేశ్యము, ఎల్లా కలిగిందా, అని ఆశ్చర్యపోయింది. సుబ్బమ్మ. "సరేలే అన్నాయ్ అల్లానే పంపిద్దాము." అంది. సిద్ధేశ్వరికి జ్వరం బాగా తగ్గిపోయింది. ఇంకా నీరసంమటుకు వదలలేదు. ఏదయినా సాగుబాటులో వుంటుంది. ఇంట్లో జీతం బత్తెం లేని నౌకరు వెనకాసరా లేని విధవ ఆడబిడ్డ ఇంట జేరగా, సిద్ధేశ్వరిలాంటి భాగ్యమయికి, ఎక్కడలేనిరోగాలూ నీరసాలూ, పుట్టుకు రావటంలో ఆశ్చర్యం ఏముంది?

ఇప్పుడు అరుంధతి, నానీ, వెంకులుతో, పాలెం జేరింది. అరుంధతి కాస్తో, కూస్తో, మిగిల్చిన డబ్బు, అంతా నానీ, వెంకులూ, కరారావుడిచేసేశారు. చదువు పేరుతో డబ్బయితే ఖర్చుపెట్టారుకాని, వాళ్ళకి అక్షరం ముక్క యినా అంటలేదు సరికదా, పేక అడటంమాత్రం అనుభవించటంలో మటుకు బాగా ప్రవీణులైనారు. పెళ్ళిళ్ళు చేస్తే బాగుపడతారేమో అని, అయిదేసి వందల రూపాయలు, కన్యాల తల్లితండ్రుల కెదురిచ్చి, పెళ్ళిళ్ళు చేసింది. భార్యాలు కాపురాని కొచ్చినా, వాళ్ళకి పావలా డబ్బులు సంపాదించాలి అన్న బాధ్యత పట్టలేదు. వేళకి ఇంటికిరావటం వున్నదేదో తింటం, పూరిమీదపడి తిరగటం తప్ప, వేరే దృష్టి అలవాటు అవలేదు. అరుంధతి గాత్రం వినసొంపుగా వుంటుంది. అమావాస్య నాడు రాత్రి, రెండో ఝామునో, ఒక హరిదాసు, కలలోకి, వచ్చాడని, దేవుణ్ని భజించి, పూజలుచేస్తూ, కైవల్యము పొందమని, తన అగచేతులో కలకండపెట్టి, గుప్పిటమూసి, అంతర్ధాన మయ్యాడని, చెప్పేది. సాయంకాలం ఆరుగంటలు దాటినతర్వాత, లేతపసుపురంగు వాయిల్ చీర, అదేరంగు జాకెట్టు వేసుకొని, జుట్టుపదులుగా జారుముడి వేసుకుని, వీధి అరుగుమీద "శ్రీరామ పట్టాభిషేకమూ, సీతాకళ్యాణమూ" వున్న పటములముందర కూర్చొని, అరటిపళ్ళల్లో అగరొత్తులు గుచ్చి వెలిగించి,

కొబ్బరికాయలు కొట్టి, తంబుర మీటుకుంటూ, అపర మీరాబాయిలా, వచ్చిన ఒకటో రెండో కీర్తనలను పాడుకుంటూ కూర్చొనేది. ముందర రోజుల్లో ఇది ఎవరూ పట్టించుకోక పోయినా, క్రమక్రమంగా, ఇరుగుపొరుగున వున్న పనిలేని ఆడవాళ్ళు కూడా వొచ్చి కూర్చుంటూండే వాళ్ళు. మరి కొన్నాళ్ళు గడిచాక కొంచెం అలవాటు పడి వున్న మగవాళ్ళుకూడా, వొచ్చి కూర్చుంటూండేవాళ్ళు. అల్లా వస్తూ పోతూ దేవుని దగ్గరకి వుట్టిచేతులతో రాకూడదని, పళ్లో పూలో, తెస్తూ అణో బేడో దక్షిణ కూడా వేస్తోండేవారు. క్రమంగా అరుంధతి అరుగు, చిన్న భజన కేంద్రంగా తయారయ్యింది. మగవాళ్ళు, అరుంధతి సొగసుకోసం వస్తే, ఆడవాళ్ళు వాళ్ళమగవాళ్ళని, కనిపెట్టటానికి వొచ్చేవారు. వీదయినా, అరుంధతి వున్నంతసేపూ, ఆ అరుగుమటుకు ఖాళీగా వుండేదికాదు. సంవత్సరం తిరిగే సరికి, అరుంధతి ప్రాక్టీసు బాగా ఎక్కువయిపోయింది. దేముడు పటాలకి బదులు, వెండి విగ్రహాలు వెలిశాయి! ఇంకా పెద్దయిల్లు అద్దెకి తీసుకుంది. విశాలమయిన హాలులో విగ్రహాలు వుంచి భజన చేయటం మొదలు పెట్టింది. భగవతీ సాక్షాత్కారం పొందగోరిన నడివయస్కులైన మగవాళ్ళు, అయిదూ పది సమర్పించుకునేవారు. వొదినగారి ఆర్జనని, వెయ్యి కళ్ళతో కాపాడుకుంటూ, ఆమె శరీరం, అలిసిపోకుండా చూసుకునేవారు నానీ, వెంకుల భార్యలు. ఈ స్థితిలో రఘు అబ్బులితోపాటు చదువుకుంటుకువచ్చాడు. పిల్లలు వుంటున్నారన్న సాకుతో, సిద్ధేశ్వరి పది బస్తాల

ధాన్యమూ ఒక పాడిగేదెనీ, పంపించింది. రఘూ, అబ్బులూ, సాయంకాలం భజన ప్రారంభం అవగానే, అందరిళ్ళకీ వెళ్ళి చెప్పి వచ్చేవారు.చిన్న పట్టులాగుసుతొడుకుని, కొబ్బరిముక్కలు తరగటం, దేవుని విగ్రహాలు తోమటంవంటి పనులు చేసి పెట్టేవారు. రఘుకి, అరుంధతి మీద కొద్దిగా భయం వీర్పడింది. భజనలే కాకుండా, అరుంధతి ఏకాహములు సప్తాహములు కూడా చేయుట మొదలు పెట్టింది. భజన సాయంకాలాలు నాలుగింటికే మొదలు పెట్టినా రాత్రి పదయినా పూర్తిఅయ్యేదికాదు. అందరూ ఇంకా ఇంకా తలలూపేవారేకాని, ఇంక వెళ్తామంటూ లేచి నించునేవారు ఒక్కరూ వుండేవారుకారు.

ఆరోజు శరత్పూర్ణిమ. పగలల్లా, వానముంపుగా రావటంవల్ల అరుంధతి భజనచేయలేదు. గదిలో జంపకానా కప్పుకుని పడుకున్న రఘు గదిలో వీదో అలికిడి అయినట్లు అయి కళ్ళు విప్పిచూశాడు. ప్రక్కమంచంమీద, అబ్బులు మూలుగుతూ పడుకున్నాడు.

"ఓరే బావా! కొంచెం అమృతాంజనం తెచ్చి పెట్టవురా తలనొప్పి దంచేస్తోంది." అన్నాడు. రఘులేచి, లాంతరు వత్తి పెద్దదిచేసి, అమృతాంజనం తెచ్చి, అబ్బులు కణతలకి రుద్దాడు.

"ఇంక చాలులేరా, పోయి చేతులు కడుక్కొచ్చి పడుకోరా!" అన్నాడు. రఘు పెరట్లోకి వెళ్ళాడు. మదురు గోడనీడ, వెన్నెల్లో కొండ చిలువలా పడుకొంది. అంతా నిశ్శబ్దంగా వున్నది. జామచెట్టు మొదట్లో, తెల్లని బట్టల్లో

నించున్న అరుంధతినిచూసి, రఘుకి జడుపు పుట్టింది. నూతిలోకి చేదవేసి, జామచెట్టుదగ్గర నించున్న ఆకృతివైపే చూస్తూ నిలబడిపోయాడు. దబ్బునుని చేద నూతిలోకి జారిన చప్పుడికి, అరుంధతి ఫులిక్కిపడించి. నూతికేసి చూసింది. రఘు నిలువునా వొణికి పోతున్నాడు. అరుంధతి నెమ్మదిగా రఘుకేసి నడిచి వచ్చింది. వెన్నెల్లో తెల్లని బట్టల్లో, తనకేసి నడిచివస్తున్న అరుంధతిని చూస్తూనే, కెవ్వుమని వెర్రి కేక వేసి క్రిందకుపడిపోయాడు రఘు. అరుంధతి ముందు నిర్ఘాంత పోయింది. కొంచెంసేపు ఆలోచించి;

"రఘూ జడుసుకున్నావా?" అన్నది.

రఘు మెల్లిగా కళ్ళుతెరిచి చూశాడు. అరుంధతి అనునయంగా చూసింది.

"లేదత్తా!" కాస్త తెప్పరిల్లి లేచాడు.

"చూడు, అబ్బులికి జ్వరం వొచ్చినట్లుంది. కాస్త ఈ చీటీ లక్ష్మీకాంతంగారి కిచ్చివొస్తావా !" అని నాలిక్కరుచుకుంది. గబగబా లోపలికి వెళ్ళి ఇన్ని జామపళ్ళూ కొబ్బరి చెక్కలూ తెచ్చి-

"చూడు రఘూ ప్రసాదం పట్టుకొని వెళ్ళు! ఇవ్వాళ వాళ్ళింట్లోవాళ్ళు రాలేదు. ఈ చీటీ లక్ష్మీకాంతంగారికి ఇయ్యి! ఆయనే తలుపు తీస్తారులే నిను!" అన్నది. రఘు మారు మాట్లాడకుండగా, లక్ష్మీకాంతంగారింటికి వెళ్ళాడు. వీధరుగు మీద వెంకట్రామయ్య పచార్లు చేస్తున్నాడు. రఘుని చూడగానే ఆత్రంగా అరుగుదిగి వొచ్చి, ఆ చీటీ

లాగుకొని చదువుకొని చింపిపార వేశాడు. రఘుకి, ఏమి చేయాలో తోచలేదు. ఆయన పైకి ఏమీ తెలియని వాడికి మళ్లే.

"ఏమేవ్ ! సాధమ్మగారింటి నించి కుర్రాడు వొచ్చాడే చూడు!" అని తోపలికి గట్టిగా కేక పెట్టాడు. లోపల గాజులు ఘుల్లుమన్నాయి. చిన్నసైజు ఐరావతంలా వున్న ఒక స్త్రీమూర్తి ఇవతలికి బరువుగా నడిచి వొచ్చింది.

"ఏమబ్బాయ్! రాత్రిపూట వొచ్చావ్!" అన్నది. రఘు పళ్ళు, కొబ్బరి చెక్కలు, అరుసుమీద పోసి;

"మా అత్త ప్రసాదం ఇచ్చీ మంది.మరేమో" సందేహిస్తూ ఆగిపోయేడు. అరుంధతేమో లక్ష్మీకాంతంగారి కిమ్మనింది. ఆ చీటీ! మరి ఆయనేమో, లాగేసుకుని చదివి చింపేశాడు. చెప్పితే, ఏమవుతుందో ! ఉప్పరకపోతే, అత్త తన్ని తిట్టుంది. ఆమెగారి కెందుకియ్యలేదని ! అననే అన్నది కూడా, తలుపు ఆయనే తీస్తాడనీ. ధైర్యం చేశాడు పన్నెండేళ్ళ రఘు. వెంకట్రామయ్య పిల్లిలా లోపలికి జారుకున్నాడు.

"ఏమిటబ్బాయ్!" అన్నదావిడ..

"మరేమో మా అత్త మీకిమ్మని ఒక చీటీ ఇచ్చిందండీ. అది ఆయన లాగీసుకుని చించేశారు." అని, ఆ ఆజానుబాహుడు, తన్నెక్కడ పట్టుక తంతాడో అని భయంతో పరుగు తీశాడు రఘు.

"ఛీ, వెధవబుద్ధి!" అనుకున్నదావిడ ! లోపలకి వెళ్ళింది. వెంకట్రామయ్య బుద్ధిగా పందిరిమంచంమీద, దోమ తెరలో ముడుచుకు పడుక్కున్నాడు.

"హుఁ ఈవిడతో కూడా మొదలుపెట్టారన్న మాట! మీకు సిగ్గువేయటంలేదూ! ఆమెగారేదో వైధవ్యభారం మర్చిపోవటానికి భక్తిమార్గం సుగమంగా వుంటుందని ఇంటులోకి దిగితే, మీలాంటి పెద్దమనుషులు ఆమెని రక్తి మార్గంలోకి దింపారా! యీభయి వేళ్ళువస్తున్నా మీకు బుద్ధి - నీతీ అంటూవుండదేం ఖర్మ!" అన్నది.

"ఎంత పిచ్చిదానివే లక్ష్మీ!" అన్నాడు వెంకట్రామయ్య.

"స్త్రీ యొద్దనుకుంటే మగవాణ్ణి కవ్వించే ప్రయత్నం చేయనేచేయదు. నిజంగా, ఆమెకి భగవత్సాక్షాత్కారం కావాల్సివుంటే, ఏ పుణ్యస్థలానికో పోయివుండేది. అల్లా చప్పబడిపోవటం ఆమె యవ్వనం శరీరానికి ఇష్టంగా వుంటుందా? మండే కోరికలని తీర్చుకోవద్దూ! ఆమెకి పురుష సాక్షాత్కారంకావాలి. విధవయైన స్త్రీకదా ! ఏ పురుషుడు ఆమెకి ఆలంబనగా దొరుకుతాడు? దానికి తగినంత పబ్లిసిటీ వుండాలావొద్దా! అందుకని ఈ భజన కేంద్రం పెట్టుకుంది. 'సూరు నోములూ, ఒక్క పాపంతో చెల్లు' అన్నట్లు ఆమె సాధమ్మగారిలా పేరూ పొందింది! ఆ కాషాయ బట్టల వెనుకదాగిన, ఆమె పొంగేయవ్వనాన్ని గుర్తించని, పురుషులు ఎవరుంటారు? ఇదేమీ, ఋశ్యశృంగుల కాలం కాదుగా!" అన్నాడు వెంకట్రామయ్య!

"ఛీ, ఛీ, ఈ పాడుమగాళ్ళు! ఏ ఆడదాన్ని, నీతిగా బతకనివ్వరుగదా!" ఈ సడింపుగా అంది లక్ష్మీకాంతం.

ఛీ,ఛీ! ఈ దిక్కుమాలిన స్త్రీలు! మగాళ్ళని వాళ్ళ ఖర్మాన్న వాళ్ళని వుండకుండా, ఆకర్షించటంమానరుగదా! ఇది అంతే, లక్ష్మీ! అందాన్ని అందుకోవటం, అనుభవించటంలోనే వుంది సృష్టి జీవరహస్యం. నువ్వేం దిగులు పడొద్దు. ఎవరి భాగు వాళ్ళు చూసుకోలేని దానికి నువ్వేం చేయగలవు?" తలక్రింద అరచేతులుంచుకుని పడుకుని నిశ్చింతగా అన్న భర్తని చూసి విస్మయపడింది లక్ష్మీకాంతం.

ఆ రాత్రి అరుంధతికి నిద్రపట్టలేదు. తెల్లవారిలేస్తూనే అందరివిూదా, రుసరుస లాడసాగింది. చెంబులూ, గిన్నెలూ బ్రద్దలు కొట్టుకుంటూ, నూతిదగ్గర దబదబా, నాలుగు చేదలనీళ్లు తోడి నెత్తిని పోసుకుని వంట ఇంట్లోకి వెళ్ళి పొయ్యిముందు కూలబడింది. నానీ భార్య- అమ్మలూ వెంకులు భార్య చిట్టీ ఆశ్చర్యపోయారు. తమ పెళ్ళిళ్ళు అయినది మొదలు ఇంట్లో వంటా, వార్పూ తామే చూస్తున్నారు! మరి ఈరోజు వచ్చిన కొత్తనింతేమిటో, ఈమెగారు రంగంలోకి దిగారు-అని హడిలిపోయారు.

"ఏమండోయ్ మీరు మడికట్టుకున్నారు? ఇవ్వేళ ఏకాదశియా! అయితే మేము స్నానంచేసి చేద్దుముకదా వంట" అన్నారు బుద్ధిమంతురాళ్ళు!

"అఖ్ఖర్లేదమ్మా ! నేను పుట్టుకుంకని ! ఇందుకోసమే పుట్టాను, ఇందులోనే చస్తాను." విసురుగా అన్నది. తోటి కోడళ్ళిద్దరూ ముఖా ముఖాలు చూసుకుని బయటిగదిలోకి వెళ్ళిపోయారు.

"వదినకంత కోపం ఎందుకు కలిగిందంటావ్ !" అన్నది అమ్మాలు. చిట్టి గమ్మత్తుగా నవ్వింది.

"నీకంతా లయోమయం. అక్కా ! కోపంకాదు ! ఆమె చేసినపాపం బయటపడుతుందనే భయం !" అన్నది.

"పాపమా ?" ఆశ్చర్య పోయింది అమ్మాలు.

"కాక !" చిత్రంగా చూసింది చిట్టి.

"వివరంగా చెప్పు చెల్లీ !" ప్రాధేయపడుతూగా అన్నది.

"వదిన బయటచేరి మూన్నెల్లలయింది. ఇంకా చెప్పాలా ?" అంది చిట్టి.

"నిజం ?" ఆశ్చర్యపోయింది అమ్మాలు

"అబద్ధం చెప్పటానికి నాకేమవసరం ?" ఎదురు ప్రశ్న వేసింది. చిట్టి.

"ఎవరంటావ్ ?" ఆలోచనగా అంది అమ్మాలు.

"ఛంఘీజ్ ఖాన్ తామర్లేన్ ఎవరైతేనేం నరహంతకులు ? – అన్నట్లు వెంకట్రామయ్యా, పశుపతో, విశ్వనాధమో, పూర్ణయ్యశాస్త్రి ఎవరో ఒకరు మహాభక్తులు! సాధు సౌందర్యోపాసకులు! వచ్చిన చిక్కేమిటంటే ఈసాధు పుంగవుల్లో ఒక్కరూ నేనూ – అని నిలబడలేరు. ఈ సమ

యంలో! ఆసమయానికి 'నేను నేను' అంటూ ముందుకు వురకలు వేసుకుంటూ భక్తబృందంలో చేరిన భక్త శిఖామణులే ఈ సమయంలో నీవులంటే నీవు అని ఒకళ్ళతప్పు, ఇంకొకళ్ళమీద రుద్దటానికి ప్రయత్నిస్తారు." కాచివడబోసిన దానిలా అంది చిట్టి.

"ఇదంతా నా ఖర్మ చెల్లీ! మేము కూటికి నీరసులం కాని గుణానికి నీరసుల్ంకాము. మావాళ్ళు డబ్బుకక్కూర్తి కొద్దీ నాకుచుట్ట బెట్టారు." నీతిమంతురాలిలా అంది అమ్మలు.

"మావాళ్ళు అంతే అక్కా! నన్ను కాలేజీలో చేర్పించి చదివించటం అమర్యాద అని మానిపించారు. సంసార పక్షమైన సంబంధం దొరికిందని మురిసిపోయి ముడి పెట్టారు. ఇప్పుడీ సంగతి తెలిస్తే మావాళ్ళు తలెత్తుకుని తిరగలేరు మావూళ్ళో!" అంది చిట్టి, మెడలోని మూడు వరసల చంద్రహారం సవరించుకుంటూను. ఆ హారం అరుంధతి, తనకి పశుపతి ఇస్తే తనకెందుకని, చిట్టికి ఇచ్చింది. అలానే అమ్మలుకీ, విశ్వనాధం ఇచ్చిన రెండుజతలగాజులూ ఇచ్చింది. తన సంపాదనలో అంతా తమ్ముళ్ళూ, మరదళ్ళూ సౌఖ్యంగా వుంటానికే వెచ్చిస్తోంది. కానీ పైసకూడా తనకని దాచుకోలేదు మానాన్ని కోల్పోయిన అరుంధతి!

10

రఘుకి అరుంధతివద్ద వుండటానికి బెరుగ్గావుంటోంది. వాళ్ళమేనత్త కామేశ్వరమ్మది కలిగిన కుటుంబం కాకపోయినా ఒక విధమైన ఆప్యాయతతో గంజో కలో పెట్టేది! స్వంత అన్నకొడుకనీ అదీకాక ఒక్కగానొక్క అన్నకి వంశాంకురం కదాని. కామేశ్వరమ్మకి రఘు అంటే పంచప్రాణాలుగా వుండేది. కామేశ్వరమ్మకి ఆరుగురూ మగపిల్లలే, ఆడపిల్లలులేరు. రఘు తెల్లగా సన్నగా ఆడపిల్లలా, నాజూగ్గా వుండేవాడు. ఎవరేంపని చెప్పినా విసుగు కనబరచకుండా చేసేవాడు. హోంవర్క్, ఎప్పటిదప్పుడు చేసుకుంటూ పాఠాలు శ్రద్ధగా చదువుతూ స్కూల్లో మాష్టర్లందరికీ ప్రేమపాత్రుడయినాడు. అరుంధతి వాళ్ళింట్లో రఘూకి వేదో సత్రపు భోజనం, మఠం నిద్రగా వుండేది. అబ్బులుతిన్నగా చదువుకునేవాడుకాదు. కొడిపిల్లలతో తిరిగేవాడు. చాటుగా బీడీలుకూడా కాల్చేవాడు. రఘుఅంటే ఆపేక్షగానేవున్నా తనతోపాటు జల్సాగా తిరగడని ఏడిపించేవారు. అంచేత ఒక ఆరునెల్లు గడిచేసరికి రఘు వాళ్ళ మేనత్తవగ్గిరకి వెళ్ళిపోయాడు.

"నేను నీదగ్గరే వుంటాను అత్తా! వాళ్ళింట్లో చదువుసాగటంలేదు," అన్నాడు.

"వుండరా నేను వద్దన్నానా? పిచ్చివాడా!" అన్నది మేనత్త.

రఘు మళ్ళీ వాళ్ళ మేనత్తగారింటికి మారిపోవటం అరుంధతికేమీ కష్టంగలిగించలేదు. కాని సిద్ధేశ్వరికి మటుకు అది తన అపజయానికి మొదటి చిహ్నంగా తోచింది. తన మేనల్లుడు వుంటం లేదుకదాని రాజారామంగారు నాలుగు బస్తాలు ధాన్యం లగ్గించేస్తారేమో అని సిద్ధేశ్వరి భయపడింది. అందుకని భర్తతో—

"చూడండి, మన రఘు? వేలెడంత వున్నాడో లేదో అన్నీ వెధవ అలవాట్లు చేసుకుటున్నాడట! సిగరెట్లు కాలుస్తాట్ట. మన అబ్బుల్నికూడా కాల్చమన్నాడట! నాకలవాటులేదని మొహంతిప్పేసుకున్నాడట మనవాజమ్మ. రాడీ పిల్లకాయలతో చేరి మన అబ్బాడి, వెంకట్రామయ్యాది, పేర్లు గోడమీద వ్రాస్తున్నాడట. అరా 'ఇదేమిపనిరా, రఘూ! తప్పుకాదా!' అని మందలిస్తే పుస్సాచ్చి వాళ్ళ మేనత్తగారింటికి వెళ్ళిపోయాట్ట! ఏమిటో నిర్వాకంచేస్తాడు మనకొడుకు" అని సుబ్బమ్మ మురిసిపోతోంది పాపం! వెధవ సావాసాలు చేస్తే మగపిల్లలు చెడిపోరూ?" అంది.

రాజారామంగారు ఏమీ మాట్లాడలేదు. ఆయనకి అరుంధతి బ్రతుకు గురించి చూచాయగా తెలిసింది అంతకని రఘు వుండకపోయినంత మాత్రాన్న అరుంధతి పరపతి తగ్గిపోదుకనుక వాడికి ఎక్కడ ఇష్టంవుంటే అక్కడేవుండి చదువుకోవచ్చును-అని వూరుకున్నారు. ఈమధ్య సిద్ధేశ్వరికి, సుబ్బమ్మ తనింట్లో వుండిపోవటం అట్టే నచ్చలేదు. సీతక్కా సుబ్బులికి పెళ్ళిళ్ళు అయి అత్తవారిళ్ళకి వెళ్ళిపోయారు. వాళ్ళభర్తలు 'జామాతో దశమోగ్రహః' అన్నదానికినీ

పణలుగా అధికారాలు చెలాయిస్తున్నారు. వాళ్ళు పుట్టిళ్ళకి వచ్చినప్పుడల్లా దోసెడేసి రూపాయలు ఇయ్యందే వెళ్ళరు. ఆటు పెద్దకొడుకు బాబ్జీ, చక్కగా వుద్యోగం చేసుకుంటున్నాడని సంబరపడటానికీ తమకు ఆసరాగా వుంటాడని ఆశపడటానికీ అవకాశం లేకుండగా అతను ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి పుట్టింటినించి చిల్లికానీ తెచ్చుకోకుండా వచ్చింది.

ఇటు తనఅల్లుళ్ళముక్కులు పిండేవాళ్ళయినా గోడలు కాస్త సిరీ సంపదాకల ఇంటిపిల్ల అవుతుందేమో అని ఎదురు చూసిన సిద్ధేశ్వరి ఆశ నిరాశ అయిపోయినది. ఇల్లు కిచాటుగా నడుస్తోన్న పరిస్థితిలో ఈ సుబ్బమ్మ ఆమెకి ఒక శనిదేవతలా కన్పడింది. కూతుళ్ళకందీయాల్సిన సొమ్ము కోసరం ఆమె చాటుగా ధాన్యం అమ్ముకోవటం, వడ్డీలకి అప్పులివ్వటం, పాలూ, పెరుగూ అమ్ముకోవటం సుబ్బమ్మ కనిపెట్టొందేమో అని సిద్ధేశ్వరికి దుగ్ధగా వుండేది. నిజానికి సుబ్బమ్మకి ఈ విషయాలేమీ పట్టవి కానేకావు. తెల్లవారి లేవటం, అంట్లన్నీ చెరువువద్దకి జేరవేసి తోమి ఇంటికితెచ్చి కాఫీకాచి అందరికీ ఇచ్చి మళ్ళీ చెరువుకిపోయి స్నానంచేసి నాలుగుబిందెల నీళ్ళు జేరవేసుకుని, మడికట్టుకుని, వంటచేసి ఇంతల అందరికీ వడ్డించి, తాను తిని మడివిప్పేసి కంచాలు ఎంగిళ్ళూ, ఎత్తిపెట్టి ఇల్లుకడుగుకొని తృప్తిగా ఏచాపమీదో వొరిగి ఏ భాగవతమో రామాయణమో, చదువుకుంటూ కూర్చొనేది. మళ్ళీ నాలుగుకాగానే పొయ్యి రాజేసి కాఫీచేసి సిద్ధేశ్వరి ఏమన్నా ఫలహారం పురమాయిస్తే

చేసి అందరికీ పెట్టి తాను చెరువుకుపోయి అంట్లన్నీ తోము కుని స్నానంచేసి ఇంటికివచ్చి నాలుగుబిందెలనీళ్ళు మళ్ళీ జేరవేసుకుని అందరికీ వండి పెట్టేది. ఆమెకి కాఫీ అలవా టుండేదికాదు. ఒక్కపూట భోజనం చేసేది. రాత్రిళ్ళు అందరి భోజనాలయినాక మిగిలివుంటే మజ్జిగచుక్క త్రాగేది; లేకపోతే అల్లానే పడుకునేది. అలాంటి అజాత శత్రువు అయిన సుబ్బమ్మ సిద్ధేశ్వరికి విడతీయలేని సమస్యా కన్పడింది! ఇల్లాలు విరుద్ధభావాల పుట్ట అయినప్పుడు, ఇల్లు అగ్నిహోత్రంలా మండటం ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. సిద్ధేశ్వరిలో ఈ మార్పు రావటం సుబ్బమ్మ కని పెట్టలేదు. సుబ్బమ్మకి నాలుగు సామాన్లూ వుంటే వండి పడేయటం తప్ప వాళ్ళ ఆలోచనలు, వీళ్ళ ఆలోచనలు కనిపెట్టగల సామర్థ్యంకానీ, కనిపెట్టుదామన్న వుద్దేశ్యంకానీ వుండేదికాదు.

11

భర్త పోయినది మొదలు రాజారామంగారి పంచనే వుంటూ కాలం వెళ్ళదీస్తున్నది సుబ్బమ్మ. రఘూ నెమ్మ దిగా పెద్దవాడయినాడు ఆ ఏటితో స్కూల్ ఫయినల్ క్లాసు అయిపోతుంది. ఇన్నిరోజులబట్టీ కుర్రాణ్ణి అడ్డంవేసు కుని భర్తకి వాళ్ళచేతా వీళ్ళచేతా, తర్పణం వదిలించేది.

ఈ వేటితో హైస్కూల్ చదువు అయిపోతుంది కనుక నాడికి వడుగుచేస్తే ఇంక ఎవర్నీ బ్రతిమాలాల్సిన అవసరం వుండదు అనుకొంది. అంచేత ఒకరోజు తీర్గా భోజనాలు అయినాక హాలులో అందరూ కులాసాగా కబుర్లు చెప్పుకుం దుకు కూర్చొన్నప్పుడు అన్నగార్ని వుద్దేశించి అన్నది సుబ్బమ్మ.

"అన్నయ్యా, వాడి మెళ్ళో ఓ జందెం పోగువేసే భారం నీదే! ఈ ఎండాకాలం సెలవల్లో కానిచ్చేద్దామని చూస్తున్నాను."

"అదేంటమ్మాయ్! అల్లా అంటావు? ఒంటిపోగేం ఖర్మం! జంటపోగుల బాధ్యత మాత్రం నాదికాదా వేమిటి? ఏమంటావ్ సిద్ధీ?" మురిపెంగా అన్నారు రాజారామం గారు.

"ఏమంటాను? సంతోషిస్తాను! అప్పటికి చూడొచ్చామా, చేయొచ్చామా? ఎవరిపరిస్థితులు ఎలా పెట్టడో భగవంతుడు?" నిమీలితంగా చూస్తూ అన్నది సిద్ధేశ్వరి.

సుబ్బమ్మ మనస్సు చివుక్కుమన్నది. అయినా ఆత్మీయతని చంపుకోలేని సుబ్బమ్మ-

"అదేంటొదినా! అలాగంటావ్? చిన్నప్పణ్ణించీ మేనమామ ఆశ్రయంలో పెరిగినవాడు, మీ మాటకాదంటాడా! ఏది ఏమయినా 'సుశీ'ని వదలనుసుమా!" అన్నది సుబ్బమ్మ.

"మెరికలాంటివాడు ! వాణ్ణి పైకి పోనిస్తాసేమిటే అమ్మాయ్ !" అన్నారు రాజారామంగారు.

"బాగుంది ! మహాబాగుంది ! మీరిలా ముచ్చట్లు పడుతో వుండండి ! అది విన్నదంటే మీ బస్తీమరదలు ముండే బెంగెట్టుకుంటుందిగా అక్కడ పెరుగుతున్నదిగా, ఒక రాచకన్యక ?" అన్నది సిద్ధేశ్వరి.

వాతావరణంలోని మార్పు గమనించాడు రాజారామంగారు.

"సరిసర్లెండి ! మన అబ్బులికికూడా సెలవల్లో వడుగు చేద్దామనుకున్నాకదా ! ఇద్దరికీ కలిపి చేసేస్తే సరిపోతుంది. ఇద్దరకూ చేసేద్దాం !" అన్నారు రాజారామంగారు వైశాఖమాసంలో వడుగు ముహూర్తం పెట్టారు. ఇంటిపెత్తనం కుటుంబానికి ఇచ్చారు, కుటుంబం పెత్తనమంటే సామాన్యంకాదు. సహజంగా మహారాజఠీవి కుటుంబానిది. చేసేది శుభకార్యం. కాస్తఘరానా కుటుంబమాయె! పేనుకు పెత్తనం ఇస్తే, తలంతా చెడగొరిగిందన్నసామెతగా, తమచుట్టాల్ని, సుబ్బమ్మ అత్తవారి తరఫు చుట్టాల్ని అందర్నీ పిలిచారు. అందరికీ అయిదారురోజులు ఘరానాగా విందులు చేశారు. ఒకరోజు గానకచ్చేరీ, ఒకరోజు వాద్యకచ్చేరీ, ఇంకోరోజూ భరతనాట్యమూ, ఇంకోరోజు హరికథా అయిదోరోజు మెహనాయిలతో ఫెళ్లిమంటూ వూరిలోని జనం అందరికళ్ళకి విందుగా చెవుల పసందుగా జరిపించారు. అందరూవచ్చి బాలవటువులను,

ఆశీర్వదించి, కుటుంబం చేసిన ఏర్పాట్లు చాలా బాగున్నాయి అని మెచ్చుకొని, తృప్తిగా భోజనంచేసి వెళ్ళారు. కుటుంబం భుజాలు తెడుముకున్నాడు. శంఖ చక్రాలు అతని భుజాలమీద మొలవలేదు. అయినా, అన్నగారు తనమీద పెట్టిన బాధ్యత తాను నిర్వర్తించాననే తృప్తితో ఛాతీ విరుచుకునే నడిచేడు. వచ్చినబంధుజనం అంతా వెళ్ళిపోయే సరికి, రఘు వాళ్ళ పరీక్షా ఫలితాలు తెలిశాయి. రఘు ఫస్టుమార్కులతో ప్యాసయ్యాడు; అబ్బులు పరీక్ష తప్పాడు. రఘు ఇంటరు చదువుతానన్నాడు.

"డబ్బు చాలద్దా నాయనా! ఏదన్నా వుద్యోగం చూసుకో ఇంక" అన్నది సుబ్బమ్మ.

రఘుకి చిన్నతనమనిపించింది. ఎమ్మెలు ప్యాసయిన వాళ్ళకి వుద్యోగాలు లేక అఘోరిస్తోంటే తన స్కూల్ ఫయినల్ చదువుకు ఎవరు పిలిచి యిస్తారు ఉద్యోగాలు? ఒకవేళ ఏ కోమటి కొట్లోనో పద్దులు వ్రాయటానికి కుదిరి, వాళ్ళిచ్చే ఇరవయిరూపాయలతోనూ, తమ ఇద్దరి జీవితాలు గడుస్తాయా! బి. ఎ. అయినా ప్యాసయితేనేకాని, వంద రూపాయల ఉద్యోగంరాదు. రఘు ఇప్పుడిప్పుడే, లోకంలో తను నిలవాల్సిన స్థానంగురించి ఆలోచించుతున్నాడు.

"అమ్మా! నాకు మంచి మార్కులు వచ్చాయి. ముందు ఎలానో కాలేజీలో జేరితే, స్కాలర్ షిప్పు సంపాదించుకునే ధైర్యంవుంది. అదీకాక, నాన్న పోగానే నీ నగలన్నీ అమ్మి మామయ్యచేతికిచ్చి డబ్బు దాయించావు

కదా! అదిప్పటికి ఏ నాలుగువేలో అవుతుంది. అది పుచ్చుకుని, మనిద్దరం మకాం పెట్టుకుందాం? కనీసం, బి. ఎ. అయినా ప్యాసవుతేకాని, మంచి వుద్యోగం రాదు" అన్నాడు. సుబ్బమ్మ బాగా ఆలోచించింది. రఘుకి చదువు చెప్పించాలి. వాడి ఉత్సాహ తరంగాలకి అనకట్ట కట్టకూడదు. ఆడపిల్లలున్న ఇద్దరు మేనమామలున్నారు. వాళ్ళకి ద్రవ్యలోపమేమీలేదు. ఎవరయినా ఆదుకుంటారు ఆ సమయానికి! అని ధైర్యం చేసింది సుబ్బమ్మ. చేతికి ఆసరాగా వుంటాయని వుంచుకున్న, రెండువందల రూపాయలతో పట్నంవెళ్ళి రఘుని కాలేజీలో జేర్పించింది. నెలకి పదిరూపాయిలకి ఒక చిన్నగది తీసుకుని, అక్కడ మకాం పెట్టారు తల్లీకొడుకూను. 'అమ్మాయ్యా! ఈ విధంగా, వాళ్ళంతటవాళ్ళే, వదిలారుకదా' అని నిట్టూర్చింది సిద్ధేశ్వరి. రఘుకి స్కాలర్‌షిప్ వచ్చింది. పుస్తకాలు కూడా కొనకుండా, లైబ్రరీకివెళ్ళి, పుస్తకాలు తెచ్చుకుని, చదువుకునేవాడు. రెండువందలు ఎంతికాలమని వస్తాయి? ఎంత పొందికగా గడుపుకున్నా నాలుగు నెల్లు గడిచేసరికి, నయాపైన లేకుండగా, ఖర్చుఅయిపోయింది. రాజారామం గారికి డబ్బు పంపమని, యెన్ని వుత్తరాలు వ్రాసినా జవాబు లీయకపోవటంతో, సుబ్బమ్మ అన్నగారింటికి బయలుదేరక తప్పలేదు. సుబ్బమ్మ రాకచూసి, ముఖం చిట్లించుకుంది సిద్ధేశ్వరి.

అయినా సుబ్బమ్మ చూడనట్లుగానే, గమనించ

నట్లుగానే అలవాటుగా లోపలికివెళ్ళిపోయింది. ఇంక తప్పని తద్దినం అనుకుందేమో!

"రఘు జాగ్రత్తగా చదువుకుంటున్నాడా?" అంది.

"బాగానే చదువుకుంటున్నాడు వొదినా! మీ చలవ ఇదంతాను" అంది కృతజ్ఞతగా సుబ్బమ్మ.

"మేం చేసిందేముందమ్మా! వాడి కృషి! కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారుకదా!" అంది. ఇంతలో రాజా రామంగారు పొలంనుంచి వచ్చారు. సిద్ధేశ్వరి లోపలికి జారుకుంది.

"ఏదన్నా డబ్బు సర్దుబాటు చేయాలి అన్నయ్యా" దడుసూనే అడిగింది.

"ఇంకా కోతలన్నా పట్టలేదు. నాదగ్గర డబ్బెలా వుంటుందమ్మాయి?" అన్నారు రాజారామంగారు.

"అదికాదు అన్నయ్యా! అప్పుడు నానగలమ్మి ఇచ్చినడబ్బు, నీకు పొలం ఏదన్నా కొనిపెట్టమని ఇచ్చాను కదా! ఆ డబ్బు యిచ్చేస్తే ఎలాగో ఈ నాలుగేళ్లూ, గడిపేస్తాం. ఆపయిన, ఇచ్చినవాడు చల్లగాచూస్తే వీదన్నా ఉద్యోగంలో చేరిపోతాడు" అంది సుబ్బమ్మ.

రాజారామంగారు కస్సుమని లేచారు.

"అన్నాళ్ళు నా యింట్లోపడి తిన్నారు, మిమ్మల్ని నేను కానీ అడిగానాఁ ఈనాడు, వాడు నీకు యెసరు ఎక్కిం చాడు కనుక నువ్వు నన్ను, స్వంత అన్నయ్య అనే ప్రేమ అన్నా లేకుండగా, నీ డబ్బు లెక్క - జమా, అడగటాని కొచ్చావు. నీ ముష్టిడబ్బు కావాలనుకున్నావా?" అంటూ

పెద్ద పెద్ద గావుకేకలు పెట్టూ, పిల్లల వడుక్కూ అయిన ఖర్చులు వ్రాసిన పద్దుపుస్తకం సుబ్బమ్మకిందకి గిరవాటు వేశాడు.

"చూడు అమ్మాయ్! మొత్తం అయిన ఖర్చు, నాలుగువేలల్లోనూ, నీ వంతు రెండు వేలూ, అయిపోయాయి. నేను కనుక నీ డబ్బులోది ఎర్రని వేగాణీ, ఎరుగుంటే నాపిల్లలకి నేనుకాకుండా పోతాను. పోనీ వీడోదిక్కూ మాలిననాడకదా అనీ, నాకూ ఆడపిల్లలు కలిగున్నారు కదాఅనీ, జేరదీశాను. ఈ నాడు వాడు వీకుమేకై కూర్చుని; ఇప్పులాడిలా, జమాఖర్చు లడుగుతాడా? గతిలేని వెధవకి కాలేజీ చదువెందుకు?" అంటూ బయటకెళ్ళిపోయాడు. సుబ్బమ్మ ముఖం వివర్ణమై పోయింది. ఆ పద్దుపుస్తకం చేత్తోపుచ్చుకుని, సిద్ధేశ్వరిదగ్గర కెళ్ళింది.

"చూడు వదినా! నేను నగలమ్మి ఇచ్చిన డబ్బు అంతా, వడ్డుకి ఖర్చు అయిపోయిందంటున్నాడు అన్నయ్య! అంత ఖర్చు నేను నిభాయించుకోగలనా? రఘూ చూడబోతే ఇక్కడ పెద్దమామయ్య తన డబ్బుని, పిల్లల్ని పెట్టిస్తున్నాడుకదా, అనే ధీమాతో, కాలేజీలో చేరి కూర్చున్నాడు. కుర్రవాడివడ్డుగు అంత డాబూ దర్పంగా నేను చేయమన్నానా? ఏదో నోవెల్లో దేముడి సమక్షంలో, జరిపించితే పోయేదానికి తల విరబోసుకుని, ఖర్చుపెట్టారు. మీ పిల్లడిదయితే, ఏదో మీకు ఇంత కలిగున్నది కనుక, దర్జాగా చేసుకున్నారు. మీ వాడితోసమంగా, మావాడికి కూడా, ఎందుకు చేయాలి చెప్మా! పోనీ, ఏదో మేనమా

మలుకదా జరిపించుతున్నారు అని కలగజేసుకోకుండా ఊరుకున్నాను. ఊరుకున్నందుకు, నా డబ్బంతా ఖర్చు చేశారు. ఇప్పుడు, ఒక వెయ్యిరూపాయిలన్నా సర్దితే, ఎలానో కష్టపడి వాణ్ని గట్టెక్కించుతాను. వాడయినా, పద్దులూ అవి వ్రాసి, నెలకి నలభయి, యాభయి సంపాయిస్తున్నాడుకానీ, కూర్చోవటంలేదు. వాడు చదువుకుని పరీక్షలు ప్యాసయితే మీకుమాత్రం లాభంకాదా చెప్పు!" సంగతి బోధపరుస్తున్నట్లు అంది సుబ్బమ్మ.

సిద్ధేశ్వరి తలవొంచుకుని ఆలోచించింది. క్షణంఆగి;

"ఏమో! ఆయనకి మేనరికాలు ఇష్టంలేదేమో! లేకపోతే మేనల్లుడికి, ఆమాత్రం సాయంచెయ్యలేరా?"అన్నది.

సుబ్బమ్మ సంగతి సందర్భాలేమిటో గ్రహించకల్గింది. ఎంతచెడ్డా, అన్నా చెల్లెళ్ళకి, మేనరికాలు ఇష్టంలేకుండగా పోతుండా? మేనరికాలు కలవలేదంటే, అటు భావమరిదికీ ఇటు వదినగారికీ, ఇష్టంలేకపోతేనే మేనరికాలు కలవకుండా వుంటాయి. సుబ్బమ్మ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా వడుగు ఖర్చులు వ్రాసిన పద్దుపుస్తకం పట్టుకుని, రఘు దగ్గరకు వెళ్ళిపోయింది.

12

ఆ సమయ సూర్య కిరణాలు మొక్కల చిగుళ్ళని రాగరంజితం చేస్తుండగా, ఆ అరుణిమ, చెంపలో ప్రతిఫలిస్తుండగా, పరికిణీ వెనక్కి మడిచి కట్టుకుని సరిగ్గా అమరని,

వాయిల్ వోణీని బిగుతుగా, మొలలో చెక్కుకుని, కాళ్ళ రత్నం తీగెలని, సీతాఫలం చెట్టుకొమ్మలకి చుట్టుతూ, కూనిరాగాలు తీస్తూంది అనూరాధ. సుబ్బమ్మ రిక్షా దిగుతూనే, ఒక్కక్షణం అనూరాధని చూసి ముగ్ధురాలైంది. రెండు చెంపలనిండా, చారెడేసి మొద్దుపొక్కులతోనూ, ఎత్తుగా నల్లగావున్న పెదిమలతోనూ చెంపకు చారెడేసి కళ్ళువున్నా కరుగ్గా చూసే చూపులతోనూ వుండే, సుశీల అప్రయత్నంగా సుబ్బమ్మ కళ్ళముందు నుంచుంది. అనూరాధ గేటుచప్పుడవటంతో వెనుతిరిగి చూసింది.

'అత్తా!' సంభ్రమాశ్చర్యాలతో ఒక్క గెంతువేసి సుబ్బమ్మని కౌగలించుకుంది.

మెత్తని, కాశ్మీరపు సిల్కుచీర మడతలా, వున్న అనూరాధ శరీరాన్ని తనగుండెల్లోకి పొదువుకొంటూ -

"నాతల్లే, నాతల్లీ! కులాసాగా వున్నారా, నువ్వూ తమ్ముడూనూ?" అంటూ అనూరాధ రెండు చెంపలూ గాఢంగా, ముద్దుపెట్టుకుంది.

"బాగుంది! అత్తా కోడళ్ళముచ్చట! రాధీ, అత్తయ్యకీ, కాళ్ళు కడుక్కోను నీళ్ళన్నా ఇయ్యకుండా, గేట్లోనే నిలవేళావేమే? లోపలికి రానియ్యవేమిటి? ఇప్పట్నించీ నీ ఆజ్ఞేనా ఆవిడకి? రండొదినా లోపలికి!" సాదరంగా అంది అన్నపూర్ణ. సుబ్బమ్మ లోపలికి వెళ్ళింది. కుటుంబం అప్పుడే బజారునుంచి వచ్చాడు.

"ఏమక్కా కులాసగా వున్నావా?" అన్నాడు.

"ఆ కులాసే" అంది.

"రఘూ బాగా చదువుకుంటున్నాడా?" అన్నాడు.

"బాగానే చదువుకుంటున్నాడు తమ్ముడూ! పరీక్ష ఫీజు కట్టాలి. సొమ్ములేక..." సుబ్బమ్మ నాన్చేసింది.

కుటుంబం విసుబోయేడు.

"అదేమక్కా! వాడికి డబ్బులేకపోవటమా? కరణాల పొలం, సిస్తు అంతా ఏంచేస్తున్నావ్?" అన్నాడు.

"నాకు పొలమా? సిస్తా? ఏమిట్రా నువ్వంటున్నది? నా కర్థంకావటంలేదు" ఆశ్చర్యంగా అంది సుబ్బమ్మ.

"ఎంత అమాయకురాలివే అక్కా! నీ నగలమ్మగా వచ్చిన డబ్బుపెట్టి, అన్నయ్య అయేడే యీకరం పొలం కొన్నాడుగా? ఆ సిస్తుదాచి, మళ్ళీ నిరుడు యింకో యీకరం కొన్నాడ. కొంటం తనపేరే కొన్నాడులే! ఆడ దానిపేరవుంటే సిస్తులు సరిగ్గా ఇవ్వరనిలాకొన్నాడు. నీకు సాలుకి ఇరవయి బస్తాలు మక్తా యిచ్చేట్టు ఏర్పాటుచేసేడు కూడా అన్నయ్య!" చెప్పాడు కుటుంబం.

"అదేంరా! నాతో మాటకయినా చెప్పలేదు?" అంది సుబ్బమ్మ.

"చెప్దామనుకొనే మర్చిపోయాడేమో అన్నయ్య. నేను కనుక్కుంటాలే! ఇంతకీ, రఘూ పరీక్షఫీజు కట్టడానికి సొమ్ములేదంటావా? నేను ఇస్తాలే పట్టుకెళ్ళు!" వందరూపాయలు ఇచ్చాడు కుటుంబం. సుబ్బమ్మని వారంరోజులదాకా వెళ్ళనీయలేదు అన్నపూర్ణ. ఈ మధ్య అన్నపూర్ణ పుట్టింట్లో పంటా వార్పూ చేస్తోంది. అన్నపూర్ణ మామ్మ కనకమ్మగారు కాలం చేసింది. అన్నపూర్ణకి, తను పుట్టింట్లో

వుండవలసిరావటం ఎంతో కష్టంగా వుంటోంది. అవతల తమ్ముడు, పెళ్ళికెదుగుతున్నాడు. తన కొడుకు చదువు కెదుగుతున్నాడు. అనూరాధ పెద్దమనిషి అయ్యింది. దానికి పెళ్ళిచెయ్యాలి. కొడుక్కి చదువు చెప్పించి వాడ్ని నలుగురిలో ఒక మనిషిగా నిలబెట్టాలి! సదానందంగారు ఇంటి విషయాలేమీ పట్టించుకునేవారుకాదు. వేళకింత వండిపెడితే సాపాటు చేయటం, తన ఆఫీసుపనేదో చేసుకుపోవటం తప్పితే, లౌకికమైన సంగతులు ఆయన పట్టించుకునేవారు కాదు. అన్నపూర్ణ తమ్ముడు శంకరానికి సంబంధాలు వస్తున్నాయి. ఒక్కటీ నచ్చటంలేదు. కుటుంబానికి మటుకు, సీతతూతుకు, సుభాషిణిని శంకరానికి చేస్తే బాగుంటుందని, ముచ్చటగా వుండేది. శంకరానికి సంబంధాలు వచ్చినప్పుడల్లా అస్తమానం అన్నపూర్ణని సతాయించేవాడు.

"నువ్వే పెంచి పెద్దచేశావ్! నీకామాత్రం స్వతంత్రంలేదా? నా అన్న మనుమరాలయితేనే నువ్వు నాతో సంసారం చేయగల్లుతావ్?" అనేవాడు.

అన్నపూర్ణకి లోపల్లోపల భయమేసేది. శంకరం పెరిగి పెదవాడయినాడు. అడ్డాలో పిలవాడుకాడు! గడ్డాలు వచ్చిన మగవాడు. తనమాట వింటాడని నమ్మిక మేమిటి? పోనీ, తండ్రితో గట్టిగా చెపుదామన్నా, తన అత్తవారు అంటే తండ్రికి, అట్టే సదభిప్రాయం లేదు. మంచిచెడ్డలు కాలాన్నిబట్టి, వ్యక్తుల్నిబట్టి మారుతూ వుంటాయని చాలామంది మనుష్యులు గ్రహించుకోరు. అలాంటి అవ్యక్తపు మనుష్యులే, సదానందంగారూనూ! అన్నపూర్ణ కేవలం

వంటమనిషిగా, తన పుట్టింట్లో పెరిగింది కాని, తమ్ముడూ, తండ్రీ అన్న ప్రేమార్ద్రతతో ఆమె మెలగలేదు, ప్రతీపూటా ఏ కూరచేస్తే విసుక్కుంటారో, ఏ మాట చెప్తే కేకలు వేస్తారో, అన్న భయంతో, తన దిక్కుమాలిన జీవితాన్ని, అవ్యక్త సంసార సాగరంలో గట్టు తెలియని దారిన ఈదులాడుతూ వుండేది. వాళ్ళమీద ఆమె కేమి సాకు వుందని ఆమె, తన తోటికోడలు మనుమరాల్ని చేసు కొమ్మని చెప్పి కలుగుతుందిగా శంకరం ఇల్లు పట్టకుండా తిరిగేవాడు. సదానందంగారు, తన ఆధ్యాత్మిక అన్వేషణలో మునిగిపోయేవారు. ఇంట్లో వున్నవీ లేనివీ చూసుకుని వచ్చేపోయే బంధువు లందరికీ, ఆదరసత్కారాలు నెర వేర్చుతూ వుండేది అన్నపూర్ణ. కుటుంబం ఈ మధ్య కొద్దిగా మారేడు. పిల్లలు ఎదుగుతున్నారు. అన్నపూర్ణ చెప్పినట్లు విని, తనవూరు వెళ్ళి వేరే మకాం పెట్టే, అన్న గారు ఏమన్నా అనుకుంటాడని భయంగా వుండేది. అంచేత తన పొలం సిస్తు అంతా తెచ్చి, సదానందంగారి చేతికిచ్చి దాచమనేవాడు. సదానందంగారు ఆ డబ్బుతో ఇల్లూ పొలాలూ కొంటూ, అమ్ముతూ వుండేవారు. ఆ అమ్మక నమ్మకాలన్నీ సదానందంగారు తన పేరనే జరిపించేవారు. కుటుంబం ఎప్పుడూ, తన డబ్బుగురించి మామగార్ని అడిగే వాడుకాదు. ఆయన డబ్బుగలమనిషి. తన భార్యని కన్న తండ్రి! తన పిల్లలు ఇద్దరూ ఆ ఇంటనే పుట్టిపెరిగారు. శంకరం తర్వాత ఇంట్లో చిన్నపిల్లలు తమ రమణా,

రాధాయేకదా! ఆ పిల్లల భవిష్యత్తు తాతగారైన సదానందంగారు, గుత్తుంచుకోరనుకోవటానికి కుటుంబంయొక్క శాంతియుత సమిష్టి హృదయం ఆలోచించనీయలేదు. తను అన్న మమమరాలు ఆ ఇంటి గోడలవుతుంది. అవుతుం దేమిటి? అయ్యి తీరాలి! అయినప్పుడు, తమకింకేం కావాలి! వేళకింత ప్రసాదం తప్ప తన కేమీ అక్కర్లేదు. తమ పిల్లల సంగతీ అక్కా, తమ్ముడూ, చూసుకుంటారు- అనుకుని రోజులన్నీ నిష్ఠూచీగా గడిపేశాడు కుటుంబం. పొలం పనులు వున్నప్పుడు, అన్నగారి ఇంటిలో వుండటం, ఆపనులు అయిపోయినప్పుడు మామగారి ఇంటికి రావటం, అయిదూ పదీ, వుంటే భార్య చేతికియ్యటం చేసేవాడు. అన్నపూర్ణకి మటుకు, రోజుకొక యుగంలా వుండేది. ఇంటిసంగతులేమీ ఇటు భర్త, అటు తండ్రీ కూడా పట్టించుకొనే వారుకాదు. అనూరాధ పెళ్ళి, ఒకసమస్య అయిపోయింది అన్నపూర్ణకి. అంచేత సుబ్బమ్మని రాగానే, ఆమె వచ్చినపని అయి పోగానే వెళ్ళనియలేదు. రఘూ చదువుకుంటున్నాడు. ఎక్కడో పావలాడబ్బులు ఇచ్చే వుద్యోగం సంపాదించుకోక పోడు. తన వెనకా ముందూ పినతండ్రులుకాని, మేన త్తలు కాని లేరు. వున్నవాళ్ళు సర్వసంగ పరిత్యాగం చేసిన తండ్రీ, తలతిక్కగా పెరిగిన తమ్ముడూ! వాళ్ళనించి, తను ఏమి సహాయం కోరుతుందీ రఘుకి, రాధనిచ్చి పెళ్ళిచేస్తే ఇద్దరూ, ఒకరి కొకరు ఆసరాగా వుంటారు. తనకా వొంట్లో జవసత్వాలు లేవు. చిన్నప్పటినుంచీ, తల్లిలేని తనంవల్లా, కుటుంబంయొక్క అపసవ్యపు ప్రవర్తనవల్లా, అన్నపూర్ణ

మానసికంగా చాలా కృంగిపోయింది. ఆమెకి సుబ్బమ్మ చల్లని దేవతగా, కన్నతల్లిగా కన్పించింది. అంచేత అన్న పూర్ణ, సుబ్బమ్మతో రాధ పెళ్ళివిషయం చెప్పింది.

"తప్పకుండా రఘూకి, రాధని చేసుకుంటాను పూర్ణా! బెంగపెట్టుకోకు! వాడిచదువు కానీయి!" అంది సుబ్బమ్మ.

"ఏమో వదినా! మీ భరోసా మీదే బ్రతుకు తున్నాను." అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది అన్నపూర్ణ.

"ఛ! పిచ్చిదానా! నాకుమటుకు, నా అన్న తమ్ముళ్లు కాక ఇంకెవరున్నారు! ఇవ్వేళ పిలిచి ఇంతపెట్టినా అన్నతమ్ముళ్లే, వాళ్ళకి, మనమీద కష్టంతోచి, ఈ తద్దినాలు, ఇంకా ఏమిటిరా భగవంతుడా! మన సంసారం మనం చేసుకుంటుంటే, వచ్చిపడ్తోంటారు- ఈ దిక్కుమాలిన అక్క-చెల్లెళ్ళు-అని, తిట్టుకున్నా, అన్నతమ్ముళ్లే! వీళ్ళోదర సంబంధం పెట్టుపోతల పరిధిలోకుంచింప చేయుటం ఎంత అవివేకం! తప్పకుండా, నా కోడలు మేనకోడలే అవ్వాలి. నేను నా రక్త సంబంధం వదులుకుంటానా?" అంది సుబ్బమ్మ. అనూరాధ తలుపు వెనకాతల నించుని, తల్లీ, మేనత్తా, మాట్లాడే మాటలన్నీ వింది. రాధ మనస్సులో చిన్న లేతకోరిక తలెత్తింది. ఆమె రఘూని పెద్దయి నాక చూడలేదు. అతనితో మాట్లాడలేదు. అయినా పధ్నాలుగేళ్ళ అనూ, రాధమనస్సునిండా, రఘూ యొక్క ప్రతిరూపమే గాఢంగా ముద్రవేసుకుంది. అది శరీరాకర్షణ కాదు. అమాయకపు ఆత్మీయత! రఘూ మనస్సేమిటో

రాధకి తెలీకుండానే, తనంటే, రఘూకి, అమితఇష్టమనే, నిర్ణయానికి వొచ్చింది. ఎందుకలా నిర్ణయించుకుందో, రాధ మనస్సుకే తెలీదు! భగవంతునికే తెలియాలి? అనూరాధకి, మేనత్త సుబ్బమ్మంటే, చెప్పలేనంత ఆపేక్ష! వున్నవాళ్ళు రోజులూ, మేనత్తని చుట్టుకుని తిరిగేది. సుబ్బమ్మ ప్రక్కలోనే పడుక్కునేది. అన్నివేళలూ అన్నపూర్ణ రఘూ ప్రసక్తి తెచ్చి మాట్లాడుతోంటే, రాధ మనస్సులోనే మురిసిపోయేది. రఘు బావకి, కాకరకాయ పచ్చడి ఇష్టమని సిటి వంకాయలుకూడా, కరకరలాడేట్లు వేపాలని, హిందీ పాటలంటేకూడా చాలా ఇష్టమనీ, ఇలా రఘూ ఇష్టాయిష్టాలన్నీ, గుప్తధనంలా; తన లేత మనకారపు పసిహృదయంలో భద్రపరుచుకుంది అనూరాధ!

13

ఒక్కొక్క రోజుగా, కాలం కరిగిపోతోంది. కాలం ఎవ్వరి ప్రయోజనాలకోసం ఆగదు! మనం తిన్నా తిన కున్నా, ఆనందించినా, రోదించినా రోజులు ఒక్కలానే తెల్లవారుతాయి. కుటుంబాల్లో ఎన్నో మార్పులు వస్తాయి. ఒక చెట్లునీడనని్రంచి ఒక పసరిక బయల్లో మేసి, ఒకదాని పొట్టలో ఒకటి తలపెట్టుకుని ముడుచుకుని నిద్రపోతూ పెరిగిన మేకపిల్లలు సహితం పెద్దయినాక పోతులుగా మారి

పోయి కుమ్మ్నకుని కుమ్మ్నకుని, రక్తాలు ధారలు కట్టించు కుంటాయి. అన్నపూర్ణకి జీవితం భవిష్యత్తులో ఇంకాచీకటి మయింగా తోచసాగింది. అటు అత్తవారింట్లో రాజారామంగారు, ఇటు పుట్టింట్లో కన్న తండ్రి సదానందంగారూ ఒక్కసారే, ఇహలోక బంధనాలనుంచి, విముక్తులైనారు. రాజారామంగారు సుశీల పెళ్ళి చేయకుండగానే చనిపోయారు. సిద్ధేశ్వరిచేతుల్లోంచి ఇంటి పెత్తనం చల్లగా బాబ్జి, చేతుల్లోకి తీసుకున్నాడు. అయినా సిద్ధేశ్వరి తన రాజకీయపు పెత్తులు మానలేదు. రఘూ ఇప్పుడు ఒక డిగ్రీ సంపాదించుకున్నాడు. నెలకి ఒక వంద రూపాయలు సంపాదించు ంటున్నాడు. పెనకాముందూ ఎవ్వరూ బంధుజాలంలేరు. ఏమున్నా బంధు వర్గం అంటూ వుంటే అది తమరే! అటు అన్నపూర్ణకీ తండ్రి పోయేకు పెనక దిక్కుంటూ ఎవరూ లేరు. అంచేత అన్నపూర్ణ తప్పకుండా సుబ్బమ్మ సంబంధం కోసం తాపత్రయ పడుతుంది. కుటుంబానికి తమ మీద ఎంతగౌరవమున్నా భార్యా పిల్లల కన్నా ఎక్కువగా తమనిచూసుకుంటాడని హామీ ఏమిటి? రాజారామంగారు పోయిన దగ్గరనించీ ఎక్కువగా అన్నపూర్ణదగ్గరే వుంటున్నాడు. తన కన్న కూతురు సౌఖ్యం కంటే, అన్నకూతురు సౌఖ్యం ఆతనికెక్కువా? ఇంక అక్కాతమ్ముళ్ళు, వియ్యమందారంటే తను ఎంతా కాకుండగా పోతుంది. పోనీ పుట్టి టివారు వున్నారు; ఇన్నాళ్ళూ తను పోషించి పెద్దచేసిన తమ్ముళ్ళున్నారు- అని ధీమాగా అనుకుంచుకు కూడా లేదు. తన తమ్ముళ్ళు చూడబోతే

శరీరం అమ్మి ధనమార్జించి, తమ భార్యల మెడలు నింపిన అరుంధతినే వెళ్ళకొట్టారు. తాము తప్ప, వేరే గత్యంతరం లేని, అరుంధతినే, ఇంట్లోంచి వెళ్ళగొట్టిన తన తమ్ముళ్ళు, పిల్లా జెల్లాతోవున్న, తన్ని ఆదరిస్తారా? వాళ్ళకి తనుమీద ఆపేక్ష లేదు. ఉంటే సీతకూతురుని తన పెద్ద తమ్ముడు కొడుకుకి ఎందుకు చేసుకోడు? ఇదంతా తీరిగ్గా ఆలోచించింది, సిద్ధేశ్వరి. కుప్పనూర్సుల రోజుల్లో కుటుంబం వచ్చాడు. సిద్ధేశ్వరి బాబ్జికి ఉత్తరం వ్రాసి రప్పించింది.

"చిన్నాన్నా! ఇంక మా కుబుంబానికి నువ్వే పెద్ద దిక్కువి! సుశీని గాలికివదిలిపోయాను నాన్న! నాకేం తోచటంలేదు! నాకేమీ అనుభవంలేదు." అన్నాడు బాబ్జి.

కుటుంబానికి సంతోషంవేసింది. రాజారామంగారు వుండగా ఇంటిలో ఖర్చుకి రామత్తులువచ్చినా కుటుంబాన్నే మేనేజిమెంట్ చేయమనేవారు. ఆ నాలుగు రోజులూ, కుటుంబం శరీరం మరచిపనిచేసేవాడు. ఇటీవల రాజారామం గారు పోయాక పొలం పనులు, ఊళ్ళూ తోటలూ మొదలయిన పనులున్న రోజుల్లో, బాబ్జి, తను చేస్తోన్న ఉద్యోగానికి సెలవుపెట్టి వచ్చి, కూలీలని ఏర్పాటుచేసి ఆ పనులు తను స్వయంగా దగ్గరుండి చేయించుకోవటం మొదలు పెట్టాడు. చెట్టంత మనిషి తమ వుండగా బాబ్జి ఎవరూ లేని వాళ్ళలా తమ పొలంపనులు తాము వేరే కేటాయింపుగా చేసుకోవటం కుటుంబానికి కష్టం తోచింది. అతని అహం భావిక వ్యక్తిత్వం గాయపడింది కూడా!

అల్లాంటిది, అన్నగారుపోయిన నాలుగేళ్ళకి తనపెద్ద తనం తన అన్నకొడుకు గుర్తించటంతో కుటుంబానికి సంతోషం వేసింది.

2853

"ఎంతమాటన్నావురా పెద్దాడా? సుశీని గాలికి వదిలాడ అన్నయ్యా! తల్లి, అన్నలు, అక్కలు, పినతండ్రి, ఇంచరము వున్నాము. దాన్ని ఇంతవున్నచోట, పడేయలేక పోతామా? ఏదీ? మీరిన్నాళ్ళూ మీ తిప్పలు మీరు పడుతున్నారు కదా, నన్ను సంప్రతించలేదుకదా అని వూరుకున్నాను. ఈ కుప్పనూర్పులు అవనీ! ఏమన్నా సంబంధాలు చూద్దాం! కాసులుపోస్తే, కాళ్ళబడని వాడెవడ్రా ఈ రోజుల్లో! మనలా కట్నాలు హార్డ్ కేష్ ఇవ్వగల మగాడెవడువున్నాడు మనలో" అన్నాడు. బాబ్జి కృణం ఆలోచించాడు. అటు తల్లేమో, రఘూకే ఇవ్వాలని, అడుగమంటోంది. ఇటు పినతండ్రేమో, రఘూ వూసెత్తకుండా సంబంధాలు వెతుకుతాను - అంటున్నాడు. బహుశా, రఘూకి, తన కూతుర్నిచ్చుకుందామన్న కోరిక వుండివుంటుంది. దానికి రిజర్వేషన్ జరిగిపోయిందేమో కూడా! అయినా మనసులో మల్లాగుల్లాలు పడటమెందుకు? అని వూహించుకుని అన్నాడు.

"అదే చిన్నాన్నా! నేనూ చెప్దామనుకుంటున్నాను. ఎక్కడో దూరపు సంబంధాలు వెతుక్కోవటం ఎందుకు? చిన్నప్పట్నించీ అనుకుంటుండేవాళ్ళము, రఘూకిద్దామని! మనకయినా ఆమేదా కావాల్సిన బంధువు? మన పిల్లల్లో ఒకడుగా పెరిగాడు రఘూ! వాన్నకనుకవుంచే ఈ పెళ్ళి

ఏనాడో జరిపించి వుందురు. ఏమిటో నాన్నపోయిన దగ్గర్నించీ సుబ్బమ్మత్త రావటం మానేసింది. రాకపోకలులేకపోతే అంతమాత్రాన్న రక్తబంధుత్వం పోతుందా? నాకూ అమ్మకూ కూడా మనకు కలిగినదేదో ఇచ్చి సుబ్బమ్మత్త సంబంధమే కలుపుకోవాలని వుంది. నాన్న తరఫు బంధువులు, నువ్వూ అత్తేకదా మాకు మిగులున్నది?" కళ్ళనీళ్ళతో అన్నాడు బాబి!

కుటుంబం హృదయం కరిగిపోయింది. ఒక్కసారి తమ బాల్యం కళ్ళకు కట్టినట్లయింది. అన్న రాజారామం గారు తమని తల్లయి తండ్రై లాలించారు! మంచికీ, చెడ్డకీ తలవొంచారు. సుబ్బమ్మ పెళ్ళి, తన పెళ్ళి అయ్యేదాకా, కంటికి నిద్రపోలేదు. పిత్రార్జితమైన ఆస్తిని అరయకరమైనా అమ్మకుండా తనకు సగం పంచి ఇచ్చారు. కట్టనివాళ్ళు "యాభైయకరాల పొలం, యాభైవేలరూపాయల అప్పుతో ఇచ్చాడు మీ అన్నయ్య! మళ్ళీ కొనుక్కున్నట్లే అయ్యింది. నీకు - ఆ అప్పలన్నీ తెర్చేసరికి.?" అంటారు. అంటే మటుకు యకరం, వెయ్యిరూపాయల కెవరన్నా ఇస్తారా? తన అన్న కనుక తనకి పంచిపెట్టాడు! మళ్ళీ ఆ అన్న చల్లెళ్ళ కుటుంబం ఏకంకావటం తనకు ఆనందకరం కాదూ?

"అంతకంటే కావాల్సిందేముందిరా పెద్దాడ! తక్షణం వెళ్ళి చెప్పివద్దాం! పెద్దపండుగ అవ్వగానే మాఘంలో ముహూర్తం పెట్టిద్దాం! ఇంతకీ రఘూ అదృష్ట

వంతుడు ! వాడికి అన్నీ ఘరానాగా జరిగే ప్రాప్తివుంది ! వడుగు చూశావా ? నాలుగు వూళ్లూ మ్రోగిపోయేటట్లు చేశామా ! పెళ్ళికూడా అలానే చేయిస్తాను చూడు ! అందులో ఆఖరిపిల్ల పెళ్ళి ! ఆపిల్ల మా నాన్నేకనుకవుంటే ఇలా జరిగేదా ? అనే కించపడకుండగా చేయాలి." ఉత్సాహంగా అన్నాడు కుటుంబం.

"ముందు అత్తని వొప్పించాలికదా !" అన్నాడు నీరసంగా బాబ్జి.

"అత్త ఎందుకు వొప్పుకోదురా పిచ్చాడా ! అసలు దానంతట అదే అడుగును, ఎంతయినా మగపిల్లడి తల్లికదా అని బిగుసుకు కూర్చుందికాని !" అన్నాడు కుటుంబం.

14

విజ్ఞానం బాగా పురోభివృద్ధి చెందింది. నిత్యం రేడియో లో రాబోవు ఇరువయి నాలుగుగంటలకీ 'వాతావరణ' సూచన అంటూ గాలి పొడిగావుండేదీ, తడిగావుండేది, సముద్రంలో తుఫాను వచ్చేదీ, పోయేదీ, ముందుగానే చెబుతున్నారు. ఇంత భూనభోంతరాళముల చలనాదులను కని పెట్టే శాస్త్రవిజ్ఞానం పిజృంభించినా ఏ విజ్ఞానశాస్త్ర కారుడూ మానవ మనో వక్రికరణము, ఏ సిద్ధాంతాన్నను స

రించి జరుగుతుందో స్థిరీకరించి చెప్పలేకపోయేము ! మనుష్యులు సృష్టించుకున్న, మనుష్యులు చెప్పినట్లు వినటంలేదు. మనుష్యులు సృష్టించుకున్న యంత్రాలు మనుష్యులు చెప్పినట్లు బుద్ధిగా వింటున్నాయి. ఒక్కమనుష్యులకి తప్ప తక్కిన యావత్ప్రపంచ స్థిర, చలన, జీవకోటీ, విశ్వాసమన్నపదాన్ని అంతో, ఇంతో భూమిమీద నిలపటానికి ప్రయత్నించుతున్నది !

హఠాత్తుగా ఉరుములేని పిడుగుల్లా గుమ్మంలో ప్రత్యక్షమయిన కుటుంబాన్ని, బాబ్జినీ చూచి సుబ్బమ్మ విస్తుబోయింది.

"కులాసాగా వున్నారా అత్తా !" అంటూ బాబ్జి వస్తూనే సుబ్బమ్మని పలకరించి ఆమె కాళ్ళకి వంగి దండం పెట్టాడు.

"లేయ్యా ! పిచ్చినాయనా ! నీ పెళ్ళాం పిల్లలు కులాసానా తండ్రీ ," అంది సుబ్బమ్మ ఆపేక్షగా.

"ఆ ! కులాసగానే వున్నారు అత్తా ! అసలు రావటమే మానేశావ్ ! నాన్నతోపాటు మేమంతా కూడా పోయేము అనుకున్నావా అత్తా! ఒక్కగా నొక్క మేన త్తని నాలుగురోజులు వచ్చి నట్టింటవుండి మేనకోడళ్ళని, మేనల్లుళ్ళని చూడకూడదా !" అన్నాడు బాబ్జి.

సుబ్బమ్మ శరీరం అంతా గోదావరిలా పొంగింది. ఎంతయినా తన తోడబుట్టినవాడి కొడుకు కనుక తను రాలేదని మనసు కష్టపెట్టుకుంటున్నాడు. తనకు మాత్రం ఎవరు

వున్నారు ? ఆ అన్న సంసారం తమ్ముడు సంసారం తప్పితే తన బాగోగులు చూచేవారు ఎవళ్ళున్నారు ?

"అదేరా తండ్రీ ! వద్దామనే అనుకుంటూంటాను. కాని ఇదిగో మీ బావయ్య ఉద్యోగం వెలగబెట్టున్నాడు కదా ! ఏదో వేళకింత ఉడకేసి పెట్టటంతో సరిపోతోంది. ఏదో వాడిమెడలో బండని కట్టేస్తే ఇంక నా బాధ్యత వుండదు. ఇద్దరూ ఏదో తంటాలు పడ్తారు. ఆ ఘడియ్ లోసం చూస్తున్నాను. ఎప్పుడో వాడి పెళ్ళికాస్తా జరిపించేస్తే మీ ఇళ్ళల్లో ఎన్నిరోజులుండమన్నా వుంటాను." అన్నది సుబ్బమ్మ.

"అదే అడగటానికి వచ్చా మక్కయ్యా ! రఘూ పెళ్ళి ఈ మాఘంలో చేసేస్తే బాగుంటుందనిపించింది. నిన్ననకూడా సంప్రతించి ముహూర్తం పెట్టుకొందామని వచ్చాము, చల్లకివచ్చి ముంతదాచటమెందుకు?" అన్నాడు కుటుంబం.

"వాడి చిన్నప్పట్నించీ వాడి బాగోగులు మీరే చూస్తున్నారు. అంతకన్నా కావల్సిందేముంది! మీ ఇష్టమే నాఇష్టం" అంది సుబ్బమ్మ.

"అంత తేలిగ్గా మాట ఇచ్చేయకు లత్తా ! అసలు కథానాయకుని అనుమతిలేనిదే మనమెవరం - కార్యాలు జరుపటానికి !" అన్నాడు బాబ్జి.

"ఆఁ, కుర్రాడు ! వాడికేం తెలుసు ! తల్లిమాట కాదంటాడా ?" అన్నాడు కుటుంబం

"జీవన సహచరిని ఎన్నుకునేటప్పుడు, తల్లిదండ్రుల ఆజ్ఞకాని, ఆత్మీయతకాని అడ్డువస్తాయా! అందులో రఘు ఇప్పుడు స్వార్థతంత్రుడు. అతన్ని మనం ఏవిధంగానూ నిర్బంధించి ఏపనీ చేయించలేము. చిన్నప్పటి జ్ఞాపకాలు, మమకారాలు నశించకుండావుంటే చేసుకుంటాడు; లేకపోతే లేదు." అన్నాడు బాబ్జి.

"అంతమాటనకురా పెద్దాడా! వాడు మీ ఇంట్లో మీ తోబుట్టువులాగే పెరిగాడు. ఈనాడు వాడంతట వాడు నాలుగురాళ్ళు తెచ్చుకుని బ్రతుకుని నడుపుకోగలిగినంత మాత్రాన్న మిమ్మల్ని మర్చిపోతాడా! అలా ఎప్పుడూ అనుకోకు! లేవండి. స్నానాలు చేయండి భోజనాలు చేసేద్దురు కాని." అంది సుబ్బమ్మ.

"భోజనం మాటకేంలే అత్తా! ముందు రఘురానీయి! అతనితో ఈ వ్యవహారం అవుననిపించుకున్నాక అప్పుడు తీరిగ్గా చేస్తాను భోజనం! ముందు చిన్నాన్నని స్నానం చేయనీ" లేచి "న్నానా! స్నానానికిపద!" అన్నాడు బాబ్జి.

కుటుంబం బాగ్‌లోంచి తువ్వాలు తీసుకుని పెరట్లోకి వెళ్ళాడు. సుబ్బమ్మ వంటింట్లోకివెళ్ళి పీటలూ, కంచాలూ, సర్దుతోంది. ఇంతలో రఘుకూడా ఆఫీసునించి ఇంటికి వచ్చాడు.

"హల్లో గుడ్‌మార్నింగ్ బావగారూ!" అని విష్ చేసిన బాబ్జినిచూసి రఘు క్షణం తెల్లబోయాడు. చిన్నప్పట్నించీ బాబ్జి ఎప్పుడూ ఎవ్వరితోనూ చనువుగా, ప్రేమగా మాట్లాడటం రఘుకి తెలీదు. బాబ్జి ఎప్పుడూ తన చదు

వేమిటో, తనగొడవేమిటో తప్ప తక్కిన సంగతులేవీ పట్టించుకునేవాడు కాదు. ఈ అయిదారేళ్ళలోనూ రఘూ, బాబ్జిని చూసిందీ లేదు. అందుకని బాబ్జి పనికట్టుకుని తమ ఇంటికి రావటం, తనతో "ఆప్యాయతగా మాట్లాడబోవటం, వింతగా కన్పించింది, వూరకెరారు మహాత్ములు" అన్నట్లు ఏదో విశేషం వెంటపెట్టుకు వచ్చాడని గ్రహించాడు రఘు.

"అంతా కులాసగా వున్నారా బావా? అత్తా పిల్లలూ అంతా బాగున్నారా?" అన్నాడు రఘు.

"ఆఁ అంతా కులాసగానే వున్నారు? ఏం నాయనా కాస్త అటువేపు ఒకసారివస్తేనే నీఆభిజాత్యం కరిగిపోతుందా? మేనమామవున్నాడు, మేనత్తవుంది, పిలలున్నారు ఒక్కసారి అమ్మా నువ్వూవచ్చి నాలుగురోజులుండి వెళ్ళిపోతే తప్పా!" అన్నాడు బాబ్జి.

అయాచిత వాత్సల్యం వొలకబోస్తున్న బాబ్జిని చూసి తనలో తనే నవ్వుకున్నాడు రఘు.

"రావొచ్చు బావా! కాని ఏదీ చదువుకొంటున్న రోజులూ! చదువును వదిలి గాలి తిరిగితే చదువుకాస్తా గుంటకట్టి గంటవాయిస్తుందని భయం. ఏదో చదువుకున్నందుకు వుట్టినే పోకుండగా వుద్యోగం అంటూ దొరికిందా! ఇంక దీన్ని అంటిపెట్టుకుని కూర్చోవాలి. తలమ్ముకుని బ్రతికే వాళ్ళకి సెలవులు ఎక్కడదొరుకుతాయి చెప్పు! ఇంక అమ్మ అంటావా; ఆమె ఇష్టం. నాలుగురోజులు అన్నగారింటిలో వుండి రావచ్చును. కాని ఆవిడ నన్ను విడచి కదలటానికి

పెద్ద బ్రహ్మప్రళయం చేస్తుంది ! ఇలానే గడిచిపోతున్నాయి రోజులు !" అన్నాడు రఘు ఇంతలో కుటుంబం స్నానం చేసి లోపలకు వచ్చాడు. బాబ్జి, రఘు మాటాడుకోవటం చూసి ఆతని మనస్సు సంతోషతరంగితమైంది.

"ఏరోయి రఘూ ! అప్పుడే ఆఫీసర్ బావగార్ని చూసి ఈ రైతు మామయ్యని మర్చిపోయావట్రా !" హుషారుగా అన్నాడు కుటుంబం.

"ఓ ! నువ్వూ వచ్చావా మామయ్యా ! అత్తా, రాధీ, రమణా కులాసగా వున్నారా! ఐ మిస్ మిరిద్దరూ కలిసేవచ్చారనుకుంటాను." అన్నాడు రఘు.

"ఓ అంతా కులాసగానే వున్నారు. పదండి. ఆలస్యం అయిపోతోంది. భోజనం చేద్దాము ! అక్కా ! వడ్డించెయ్యవమ్మా !" అనికేక వేశాడు కుటుంబం.

"అవును. ఆలస్యం అయిపోయింది. లే బావా !" అని రఘు ఆఫీసుకి వెళ్ళివచ్చిన బట్టలు మార్చి, లుంగీ కట్టుకుని వచ్చాడు.

"ముందు నాకు ఒకమాట ఇస్తేనేకాని భోజనం చెయ్యను."

నవ్వుతోన్నా గంభీరంగా ముఖంపెట్టిఅన్నాడు బాబ్జి.

అంతరార్థం గ్రహించేడు రఘు. బాబ్జిధోరణి రఘుకి అంతగా నచ్చలేదు. అవతల చిన్నమామయ్య నించున్నాడు. తనకా ఆకలి నకనకలాడుతున్నది. అంచేత చమత్కారంగా

"మాటకేంలే! వెంట్యమాటలిస్తాను. ముందు భోజనానికి లే! చిన్నమామయ్య కాచుకున్నాడు కూడా!" అన్నాడు రఘూ.

"మీరిద్దరూ భోజనంచేస్తూ వుండండి. నేనూ అక్కడే కూర్చుని సంగతి సందర్భాలు వివరిస్తాను." అని భోజనాల గదివెంపు దారితీసాడు బాబ్జి! రఘూ కుటుంబం కూడా వెళ్ళి భోజనాలగదిలో తమకని నిర్దేశించిన పీటలమీద కూర్చొచ్చారు.

"నువ్వుకూడా దా నాయనా! భోజనంచేస్తూ మాట్లాడకూడదా ఏమిటి?" అంది సుబ్బమ్మ.

"కతికితే అతకదని, నీకు తెలీదా ఏమిటి అత్తా!" అన్నాడు బాబ్జి.

విషయం సులభగ్రాహ్యంఅయ్యిందిరఘుకి. మౌనంగా వూరుకున్నాడు.

"ఆఁ! అవన్నీ పూర్వకాలంవారి మూఢనమ్మకాలు! అయినా మేనత్త – మేనమామ పిల్లలకి కతికితే అతకదని సామెత ఏమిటి నామొహం!" అన్నాడు కుటుంబం.

"రానాయనా! ఈరోజుల్లో ఇంకాపాతకాలపు నమ్మకాలేమిటి?" అంది సుబ్బమ్మ. ఎంతచెప్పినా బాబ్జి భోజనం చేయకుండానే కూర్చున్నాడు. కుటుంబం, రఘు భోజనాలు చేశారు. బాబ్జి అమాటా ఈమాటా చెబుతూ నెమ్మదిగా అసలు విషయం చెప్పాడు. రఘు, సుశీలని చేసుకొమ్మని తన తల్లి చెప్పమందని చెప్పాడు. రఘు అంతా విన్నాడు.

"అయితే దానికేనా ఇంతసేపు భోజనంకూడా చేయకుండగా, కూర్చున్నావు?" అన్నాడు రఘు.

"అవును బావా! ఇప్పుడు సుశీ పెళ్ళి బాధ్యత నాదేకదా! నువ్వు వూఁ అంటే ఈ మాఘంలోనే కానిద్దామని వుంది" అన్నాడు.

"అంత తొందరెందుకు బావా! నే నెక్కడికన్నా పారిపోతానా?" అన్నాడు రఘు ఎగతాళిగా!

"అల్లాగంటే ఎలా? నువ్వు ఇప్పుడు ఆర్జనపరుడివి! ఆడపిల్లల్ని కన్నతండ్రుల దృష్టిలో, నువ్వు సానపట్టిన వజ్రంలా కనపడుతున్నావ్! నీ విలువ నీకేం తెలుసు?" అన్నాడు బాబ్జి.

"సర్లే! అమ్మా, నేనూ ఆలోచించి వ్రాస్తాము. ముందు భోజనం చెయ్యి" అని మళ్ళీబలవంత పెట్టాడు.

"వ్రాస్తామంటే కుదరదు! నువ్వుసుశీని ఎరుగున్నావు కనుక ఇంక పెళ్ళిచూపులంటూ అవసరంలేదు. కట్నం కానుకా అంటావా, నీ ఇష్టం వచ్చినంత అడుగు! మాకు డబ్బుకి లోటులేదుకదా! అదీకాక, నువ్వు మాకు మేనత్త కొడుకువి! నీకు ఎంత ఇవ్వాల్సి వొచ్చినా చూకు బాధ అనిపించదు." అన్నాడు బాబ్జి.

"బాగుంది బావా! నువ్వు డబ్బుకు లోటుచేస్తావని నాకు సందేహమెందుకు వుంటుంది? పెళ్ళి అన్నాక కాస్త మంచీ, చెడ్డా ఆలోచించిద్దూ! ఏ సంగతీ అమ్మతో కబురంపిస్తాను. మాకు మటుకు మీకంటే ఎవరున్నారు?"

అన్నాడు రఘు. బాబ్జి భోజనం చేసి ఆఫీసుకి సెలవు లేదని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ, కుటుంబాన్ని చాటుకుపిల్చి;

"చిన్నాన్నా! ఇంక నీదే భారం! సుశీ నీ కూతురే అనుకో!" అని వెళ్ళిపోయాడు. కుటుంబంకు చనిపోయిన అన్నగారు జ్ఞాపకానికి వొచ్చి, కళ్ళు తడిఅయ్యాయి. బాబ్జి వెళ్ళిపోయాక, కుటుంబం రఘూని కదలేశాడు. అటోటో తేల్చి చెప్పమన్నాడు.

"నాకు పెద్దత్త నడవడి ఇష్టంలేదు మామయ్యా! ఆమెకు నేనంటే కిట్టదు. మేము ఎప్పుడు వెళ్ళినా ముఖం, గంటు పెట్టుకునేది!" అన్నాడు రఘూ.

"ఆమె, నడవడి ఇష్టం లేకపోతే, పిల్లనేం చేసిందిరా?" అన్నాడు కుటుంబం.

"ఎందుకు? చేసుకుని ఆ పిల్లని బాధ పెట్టాలా? ముందు పెళ్ళి చేసుకుని, తర్వాత మీ అమ్మ అలా మూతి ముడుచుకుంది; మీ అన్న పంపుగకి పిలవలేదు. అని ఆమెని హింస పెట్టటం ఎందుకు? అంత్య నిష్ఠూరంకంటె, ఆది నిష్ఠూరం మేలుకదా? అయినా బావ వెర్రిపడుతున్నాడు కాని మామయ్యా, పెద్దత్తకి నిజంగా నాకు సుశీ నివ్వటానికి ఏమాత్రం ఇష్టం వుండదు. వూరికే, కన్నీళ్ళు తుడవడానికి, బాగుండదని కటురంపి వుంటుంది" అన్నాడు రఘు.

కుటుంబానికి కోపం వొచ్చింది.

"ఒరే రఘూ! లేనిపోని అగావీలు వెయ్యకు. ఆమెగారికి ఇష్టం ఎందుకుండదు? అయినా నువ్వు పెళ్ళి

చేసుకునేది ఎవర్ని? ఆమెనా; ఆమె కుతుర్నా? వాళ్ళు మనసారా, కోరారు కనుకనే, నిన్ను ఇంటికివొచ్చి అడిగారు! లేకపోతే ఈ మాత్రం సంబంధం తేలేకనా? నీ తాతలాంటి వాణ్ణి తెస్తారు!" అన్నాడు కుటుంబం. మామయ్య పౌరుషానికి రఘుకి నవ్వొచ్చింది.

"నా తాతలాంటివాడికి కట్నం ఇయ్యక్కర్లేదు మామయ్యా! వూరికనే చేసుకుంటాడు. నా తాతలాంటి వాడికిచ్చి చేస్తేనే మంచిది." తన జోక్‌కి తనే నవ్వుకున్నాడు రఘు.

సుబ్బమ్మ బ్రతిమాలింది:

"వొకే బాబూ! పెద్దమామయ్య బ్రతికుంటే, సుశీపెళ్ళి ఎప్పుడో చేసివుండేవాడు. చిన్నప్పట్నించీ వాళ్ళింట్లో పెరిగావు. నీకంత అభిమానం లేకుండగా ఎలా పోయిందిరా?" అంది.

"ఒకచోట పెరిగినంతమాత్రాన్న ప్రేమలు కురిసిపోతాయా అమ్మా! చిన్నప్పట్నించీ పెద్దత్త జెలసీని అనుభవించాను కనుకనే నాకు వాళ్ళింటి అమ్మాయితో పెళ్ళి అంటే శరీరం జలదరిస్తోంది. 'సుశీ' వచ్చిన మర్నాటినుంచీ నువ్వు నయ్యో గొయ్యో వెతుక్కోవాల్సిందే! వాళ్ళింటి ఆడపడుచులు యెవళ్ళు, అత్తవారివెంపుబంధువుల్ని ప్రేమగా చూశారు చెప్పు! సీతొదిన పెళ్ళయి వెళ్ళిన మర్నాడే ఆమెగారి అత్తగారు శాశ్వతంగా చచ్చిపోయింది! ఇల్లు ఖాళీ! ఇంక సుబ్బులొదిన సరేసరి! ఈమెగార్ని ఇస్తామని వెళ్ళగానే మామగారు చచ్చిపోయాడు! వాళ్ళు ఆపట్టింపుకేమో

పెట్టుకోకుండా చేసుకునేసరికి చక్కగా మొగలిపూ తిలా పెళ్ళికెదిగివున్న ఆడపడుచు కూడా హారీమంది! ఎంచు కొచ్చిన బెడద! వాళ్ళింట్లో ఎవ్వరికీకూడా కాలు చల్లన లేదు" అన్నాడు రఘు.

"పోనీలేరా! నేనుచెప్తే వింటావని నన్ను తీసుక వచ్చాడు పెద్దాడు! ఏదో పెద్దవాడ్ని! నామీద గౌరవం పుంచుతావనుకున్నాను. నన్నుకూడా చీమలాగా తీసిపారే స్తున్నావు!" అన్నాడు కుటుంబం.

"తప్పు మామయ్యా! నీమీద నాకు గౌరవం, అభి మానం ఎప్పుమూవుంటుంది. నాకు వాళ్ళపద్ధతి సరిపోదంతే? ఏంచెయ్యనుగి పెద్దమామయ్యకనుకవుంటే మారు మాట్లాడ కుండా వొప్పుకునేవాడ్ని! నాకా వెనకదట్టతలేదు. నా మానాన్న నేను 'సుశీని' పెళ్ళిచేసుకుని కులుకుతే అమ్మ గతేంకాను చెప్పు! పెళ్ళి అయ్యేదాకా వూరుకుని తర్వాత, 'నేను చెయ్యమన్నానా అంటే నేను చెయ్యమన్నానా!' అని తల్లీ కొడుకూ తగువులాడుకుంటూ కూర్చుంటారు. ఇంక మనకి కష్టం వొచ్చినా సుఖం వొచ్చినా ఆదుకునే వారెవరుంటారు చెప్పు. ఇంక ఆ పిల్ల బాధపడటమే కదా! నువ్వే ఆలోచించు!" అన్నాడు రఘు.

కుటుంబం ఆ సాయంత్రం వెళ్ళిపోయాము.

"ఒకే బాబూ, బావ, చిన్నమామయ్య అంత జాలిగా అడిగారు. వొప్పుకున్నావు కాదు. నేను నా పుట్టిం టికి శాశ్వతంగా దూరమయిపోతాను, అవును నాకున్న

మమకారం నీకెందుకు వుంటుంది?" అంది సుబ్బమ్మ ఎద్దేవాగా.

"ఏంచేసేది అమ్మా! సుశీలన్నా ఆట్టేమంచిపిల్లకాదు. పెంకితనం ఎక్కువ! మనం చెప్పినట్లు వినదు. చిన్నప్పుడే ముదిమాటలు చెప్పేది. విద్యావిహీనఃపశుః అని వివేకంలేని వాళ్ళని చూసి, చూసి ఎలా కట్టుకోమంటావు?" అన్నాడు.

"ఓరే! చేసుకుంటే చేసుకున్నావు; లేకపోతేలేదు. అనవసరంగా పేర్లు పెట్టకు" అంది రోషంగా సుబ్బమ్మ.

"ఓహ్హో ఏం రోషం వచ్చిందీ, అమ్మగారికి! ఆ మాత్రం పుట్టింటివారుకాని లేకపోతే నన్ను నిలవనీయక పోదువు!" అన్నాడు.

కొడుకు మాటి మాటికీ దెప్పుతూంటే సుబ్బమ్మకి కళ్ళనీళ్ళపర్యంతమైంది. తల్లి దైన్య ముఖం చూసిన రఘు తనలో తను నవ్వుకున్నాడు.

"అమ్మా! ఏంజరిగిందనమ్మా! అంత చిన్న బుచ్చుకుంటావు? ఇంతకీ నేను, నిన్ను పుట్టింటివారికి దూరం చెయ్యనులే! మేనరికం కలుపుకో! ఎవరొద్దన్నారు?" అన్నాడు. సుబ్బమ్మ కళ్ళు ఆనందంతో తళుక్కుమని మెరిశాయ్.

"చేసుకుంటావా! నా బాబే! నా తండ్రే! రేపొద్దుటే, బండికట్టించు. వొదినతో చెప్పి శుభం అనుకుని వస్తాను. అందాకా, నీ వ్రేలినున్న ఎరుపు రాయి వుంగరం ఇయ్యి, అది దాని వ్రేలికి తొడిగిస్తాను. వాళ్ళంటి వుప్పుతిని పెరిగాం వాయినా! వాళ్ళ గురించి ఎన్నడూ

చెడుగా తలచకూడదు. ఇంతకీ మనం ఇవ్వబోవటంలేదు కదా! తెచ్చుకుంటున్నాం! తెచ్చుకున్నదాన్ని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి;" అన్నది సుబ్బమ్మ.

తల్లి తొందరకి రఘు ఒకవంక ఆనందిస్తున్నాడు, వేరొకవంక చింతిస్తున్నాడు. సుబ్బమ్మ నైరాశ్యపు బ్రతుకునకు, వెలుగురేఖ రఘు! కోడలురావాలి! ఆమె యొక్క ఆగిపోయిన జీవనరాగానికి ఊత్తపల్లవి వేయాలి! అది సుబ్బమ్మ, ఆజన్మవాంఛ! మనుమడ్నెత్తుకుని తిరిగిన నాడు, ఆమె జీవితం తరించినట్లు భావించుతుంది. ఇరవయి సంవత్సరాల యవ్వన జీవితంలోని, కోరికలకు గోరీకట్టి రఘుని పెంచి పెద్దచేయటంలోనె తన శరీరాన్నీ మనస్సునీ కూడా, వంచింపచేసుకుంది. కొడుకు సుఖం తప్ప వేరే ప్రాపంచిక సుఖదుఖాలు ఆమె ఆశించలేదు.

"బండెందుకమ్మా?" అన్నాడు రఘు కవ్విస్తూ.

"అదే! పెద్ద తగరింటికి వెళ్ళొద్దూ!" అంది.

"నేను మేనరికం చేసుకుంటానన్నాను కాని, 'సుశీ'ని చేసుకుంటానన్నానా?" అన్నాడు రఘూ. రఘూ మాట మెలికలోని అర్థాన్ని గ్రహించింది సుబ్బమ్మ.

"అయితే 'సుశీ'ని చేసుకోవా! అనూరాధని ఇచ్చే మాటుంటే, చిన్న మామయ్య 'సుశీ'ని గురించి చెప్పటానికెందుకువస్తాడు?" అంది సుబ్బమ్మ సందేహంగా!

"బాగుంది అమ్మా! వాళ్ళు సాయితాగా వెళ్ళమన్నారు కనుక వచ్చాము మామయ్య. అంతమాత్రాన్న రాధని నాకు ఇవ్వడని రూఢి ఏమిటి? పోనీ ఎక్కడన్నా

సంబంధాలు చూస్తున్నాడేమో అంటే అదీ లేదాయె! అంచేత చిన్నమామయ్యవుండగా చిన్న తగారింటికి వెళ్ళు. ఇద్దర్నీ ఒక చోటపెట్టి అడుగు. ఇస్తానంటే సరే! లేకపోతే నాకై సంబంధం చేసుకుంటాను. నాకు పిల్లనివ్వటానికి దేశం గొడ్డుపోలేదు కదా?" అన్నాడు నిర్వేదంగా.

రఘు అంత స్పష్టంగా చెబ్తాంటే సుబ్బమ్మ కాదనీ, ఔననీ, అనలేకపోయింది. తనకయితే ఏ అన్నతమ్ముడి కూతురయినా ఒకటే! కాని తమ్ముడు ఇస్తాడన్న నమ్మకం సుబ్బమ్మకి కలగలేదు. ఒక్కతే కూతురు, నాలుగు రూపాయలు ఎక్కువిచ్చి ఘరానా సంబంధం చేసుకుంటారు. అందులో ఆపిల్లది చిన్నప్పట్నించీ బస్తీలో పెరిగిన పిల్ల! చదువుకుంటున్నది. దాని అభిరుచులు ఎలా వుంటాయో? సుఖీ అయితే తండ్రిలేని పిల్లకనుక, అన్నగారు చేయవలసి రావటంచేత, ఏదోవిధంగా వదిలించుకుందామన్న ధోరణిలో తమలాంటి దిక్కులేని సంబంధానికి ఇస్తామంటూ వచ్చారు-అని భావించింది సుబ్బమ్మ. అయినా ఒక్కసారి అడిగితే తన పరువు ఏమీపోదులే! అనుకుని నిభాయించుకుని వెళ్ళి అడగటానికే నిశ్చయించుకుంది సుబ్బమ్మ. సుబ్బమ్మకైనా పెద్దవొదిన సిద్ధేశ్వరి దగ్గరకన్నా, మరదలు అన్నపూర్ణవద్దే ఎక్కువ చనువు వుండేది. కాని అన్నపూర్ణ ఎప్పుడూ పుట్టింటనే వుండుటచేత అన్నగారింటికి వెళ్ళినంత చనువుగా తమ్ముడి దగ్గరకు వెళ్ళేదికాదు. అన్నగారితో

డబ్బు తగాయిదా వచ్చినదగ్గర్నించీ ఎప్పుడన్నా అవసరం వస్తే తప్పనిసరిగా ఆమెకాని, రఘుకాని వెళ్ళేవారు. వెళ్ళినా ఒక్కపూటకన్నా ఎక్కువరోజు లుండటానికి బిడియపడే వారు.

15

సుశీలకి తల్లిమీద బాగా కోపమువచ్చింది. ఈసారి ఆమెకి కుటుంబాన్ని చూస్తూంటే అసహనం కలగసాగింది. రఘు ఎప్పుడయితే, ఆమెని చేసుకోనని, తేల్చిచెప్పాడో, అప్పుడే ఆమె హృదయంలో ఈర్ష్యానలం, ప్రజ్వరిల్ల సాగింది. ఆమెకి ముందునించీ, రఘూ అంటే తేలికభావమే వుండేది. అభిమానం అనేది ఎప్పుడూలేదు. ఈనాడు, తన్ని తిరస్కరించడంతో, ఆమెలో అవమానం రగుల్కొంది. తమంతవారు, ఒక మెట్టుక్రిందికిదిగి, అల్లాంటి దిక్కులేని సంబంధం చూడటమే, తమ అంతస్తుకి ఒక గొడ్డలి పెట్టు! అల్లాంటిది, వాళ్ళు ఆ మాత్రం కృతజ్ఞతకూడా చూపలేకుండగా, కృతఘ్నులై తమని తిరస్కరించటం, అవమానం కాదూ?

"అమ్మా! నువ్వు చేసేవన్నీ ఇల్లాంటి అసందర్భపు పనులే! ఎందుకు అడిగించావ్, చిన్నాన్నచేతే ఆ దరిద్రపు

వెధవని నేను కట్టుకుంటానుకున్నావా? నాన్న ఆస్తిలో, మాకు మాత్రం హక్కులేదా? మా ఆడపిల్లలకేదో, చచ్చు పుచ్చు సంబంధాలుచేసి, బయటకు తోలేసి, ఆస్తిఅంతా, నీ కొడుకులకు, పట్టం కడదామనుకుంటున్నావా? వాడు, ఆరాధి పీనుగ, అంటే పడిచస్తున్నాడు. వాళ్ళూ వాళ్లూ, శాముకుని వీడవనీయి! మనకెందుకీ అక్కర్లేనితద్దినం?"అంది తల్లితో విసుగ్గా. సిద్ధేశ్వరి, నర్మగర్భంగా నవ్వింది.

"పిచ్చిసుశీ! నాకుమాత్రం నిన్ను ఆ తోలీకి శికానా లేనివాడికి ఇచ్చి చేద్దామనుందేమిటి! ఎక్కడ వొప్పుకుంటారో అని భయపడ్డాను. అడిగి లేదనిపించుకుందామనే అడిగించాను. నాళ్ళని కాదని మనంతట మనం వేరే ప్రయత్నాలుచేస్తే చిన్నాన్న, ఏమన్నా అనుకోడూ! ఎంత చేసినా, అక్కగారికన్నా ఎక్కువ వాళ్ళం అవగలమా మనం? వాళ్ళే వొదులున్నారుకనుక, ఇప్పుడు మంచి సంబంధం చూసినా ఏమీ అనుకోడు కుటుంబం" అంది సిద్ధేశ్వరి.

"ఆ రాధి అంటే పడిచస్తారు తల్లీ కొడుకూనూ! అదేదో, రంభ అనీ, లతామంగేష్కర్‌లా పాడుతుందనీ వాళ్ళు ముచ్చటపడ్తారు. చిన్నాన్న మటుకు మనకోసం ఏం చేస్తున్నాడు? ఆ మహానుభావుడు వచ్చినప్పుడల్లా మనం, దాసీవాళ్ళల్లా, ఆయనకి, వేడి, వెచ్చా చూడటం_ ఆయన పంటలంతా ఒబ్బిడిచేసుకుని, పెళ్ళాంపిల్లలకి ధారపోయటం! పాపం నువ్వేమో, ఆయనేదో మనకి బంగారు కిరీటం

నెత్తికి పెట్టాడనుకుని మాచేత చాకిరీ చేయిస్తావు! ఇక్కడ డబ్బుతినేవాళ్లు, ఇక్కడకొచ్చి పనిచేసుకోలేరా! బస్తీలు కావాలి పాపం దొరసానులకి. నన్ను కాదని, ఇప్పుడు, ఆ రాధి పీనుగని, చేసుకుంటే, ఎంత అప్రతిష్ట! నా కెంత అవమానం? ఎల్లాగూ చిన్నాన్న వాణ్ణి పైకి పోనీయటం ఇష్టంలేక ఆ రాధిని కట్టబెట్టాడు. చూడు! అల్లా కనుక జరిగిందంటే. నేను చెర్లోదూకి చస్తాను. అప్పైని, నీ తంత్రాలు నువ్వు తీరిగ్గా పన్నుతూ కూర్చోవచ్చు" అంది. సుశీల తీవ్రంగా.

"ఎంత తెలివితక్కువగా ఆలోచించావ్ సుశీ! మనకి కాని పని, వాళ్ళకి అయితే వొచ్చే అవమానం, నాదికాదా! దాని పాటా, దాని అందం అడుక్కు తిన్నీయి. దానిగొప్ప అందుకే ఉపయోగిస్తుంది. నీకింకా పసితనం వదలక అలా అనుకుంటున్నావ్. అక్కా తమ్ముడూ ఏక కుటుంబీకులు అయితే మన కీ వూళ్లో దుమ్ము, దూగరే మిగులుతుందని నాకు తెలీదా ఏమిటి? నీకు పదివేలుపోసి పదివందలు నెలకు సంపాదించే ఉద్యోగస్థుణ్ణి తేకపోతే నాపేరు సిద్ధేశ్వరి కాదు. చూడు." అంది.

"లేనిపోని ప్రతిజ్ఞలు చేయకు. మామయ్యలకు నువ్వు ఇల్లంతా దోచి సాయం చేశావు. వాళ్ళు చక్కగా మేడలు కట్టుకుని కులుకుతున్నారు. పెదమామయ్యకొడుకు ఐ. ఎ. యస్. పాసవ్వగానే పొంగిపోయావ్, సుబ్బుల్ని చేసుకుంటాడని. కాని వాడు మన చిన్నక్కకి చదువురాదని

తోసిపుచ్చి పై సంబంధం చేసుకున్నాడు. మనకంటే ఏదో ఇల్లూ వాకిలీ వున్నాయి కనక నీ పుట్టింటివారు నీకు సాయం చేయకపోయినా సాగిపోతోంది. పిన్ని గతేమయింది ? తన శరీరం లెక్కచెట్టకుండా, అవమానాన్ని లక్ష్యంచేయకుండా మామయ్యల సంసారాలే తనవి అనుకుని కాసులు కూడ బెట్టి ఇచ్చిందికదా ! పిన్ని డబ్బు సంపాదించి ఇయ్యకపోతే నీ తమ్ముళ్ళ సంపాదనలకి ఆ మేడలు కట్టేవాళ్ళా ? పిల్లలకి పెద్ద చదువులు చెప్పించ గలిగేవాళ్ళా ? కృతజ్ఞత చూపెట్ట కలగటం అంత తేలికయిన సంగతికాదు. ఈనాడు పిన్నిని ఇంటి చాయలకి రానీయటంలేదు మామయ్యలు. ఆవిడ తమ బంధువు అని తెలిస్తే సంఘంలో తమపేరు ప్రతిష్ఠలు పోతాయట. ఆపరువీయని డబ్బేదేనావుంటే, ఆ అమర్యాద కరమైన డబ్బు ఇప్పుడన్నా పిన్నికి ఇచ్చేయకూడదూ ? ఆ డబ్బు ఆమెకే వుంటే నౌకర్లను పెట్టుకుని చాకిరీ చేయించు కునేదిగా! ఎవళ్ళ స్వలాభాలు వాళ్ళు చూసుకుంటూంటారు. డబ్బుదగ్గిర తల్లనీ, తండ్రనీ, అన్ననీ, అక్కనీ మమకారాలు నించోలేవు! నిప్పుని చూసి పెద్దపులి పారిపోయినట్లు డబ్బునిచూసి మమకారాలు పారిపోతాయి. నీకసలు ఎవళ్ళ సంగతీ తెలీదు. అసలే అన్నపూర్ణ పిన్నికి మన మీద కుళ్ళు వుంటుంది. మండేపొయ్యిలో నెయ్యిపోసినట్లు మన సీతక్క కూతుర్ని, వాళ్ళ శంకరానికిచేసుకోమంటావు. చిన్నాన్న చేతకూడా చెప్పించావ్. మన 'సుభాషిణిని' అన్నం తిననిస్తుందా ఆపిన్ని ?" అంది సుశీల.

"తొందరపడుతున్నావ్! నేను నా పుట్టింటినించి పొందలేని ఆప్యాయత, మీ పిన్నికి మటుకు ఎలా లభించుతుందే? చూస్తోవుండు; నీకేం తెలుస్తుంది ఇప్పుడు?" అంది సిద్ధేశ్వరి. ఈలోగా కుటుంబం పొలంనించి ఇంటికి వచ్చాడు. కుటుంబం కుప్పనూర్పుళ్ళు అయిపోయాయి. ధాన్యం మిల్లుకి పట్టించి డబ్బుకూడా చేసుకున్నాడు. ఇంక ఒకటి రెండు రోజుల్లో భార్యదగ్గరకి వెళ్ళిపోతాడు. కుటుంబం చెంబు తీసుకుని చెరువుకి వెళ్ళి స్నానంచేసి వొచ్చాడు. సుశీల కంచం వేసి మంచినీళ్ళచెంబు ప్రక్కన పెట్టి, విసినకర్ర పట్టుకుని నించుంది. కుటుంబం వొచ్చి భోజనానికి కూర్చున్నాడు. సిద్ధేశ్వరి భోజనం వడ్డిస్తూ తన అస్త్రం విసరటం మొదలెట్టింది.

"ఏదో తండ్రిలేనిపిల్ల, తన కడుపులో దాచుకుంటుంది_ అనుకున్నాను. నిర్మోహమాటంగా చెప్పేసింది కుర్రాడు, ఇష్టపడటం లేదని! ఆమెకి ఎవరూ లేరు; మాకూ ఎవరూ లేరు. ఏదో కలిసిపోతే చాలునని భ్రమపడ్డాను. నా నమ్మకం, నట్టేటిలోముంచారు-తల్లీకొడుకూనూ! అదే, దాని తండ్రివుంటే, ఇల్లా సంబంధం చెడిపోనిచ్చేవారా?" కళ్ళమ్మట నీళ్ళు రాకపోయినా, ఒకసారి, చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది సిద్ధేశ్వరి. కుటుంబానికి కూడా కష్టంగానే వుంది. అన్నగారింటి పంచన అన్నాళ్ళువుండి, ఆ మాత్రం కృతజ్ఞత తన అక్క-గారు చూపక పోవటంతో కుటుంబానికి సుబ్బమ్మ అంటే, రోసం వచ్చింది.

"పోసి లేమ్మా! నువ్వేందిగులు పడకు. నావాటా అంతా తెగనమ్మినా కేసి అయినా, సుశీని పెద్దవుద్యోగస్థుడికి ఇచ్చి, చేస్తాను. నువ్వేం దిగులుపడకు! ఏదో కలుస్తా రేమో అని చూశాం. నాకక్కర్లేదు- అంటే వెళ్ళి కాళ్ళు మీద పడేస్తామా ఏమిటి?" అన్నాడు.

"ఇంకో చిత్రం! అతనికి, అనూరాధని చేసుకోవాలని వుందట! అది తెలీక సుశీని చేసుకొమ్మని అడిగాం. 'చిన్న మామయ్యా, అన్నకూతుర్ని ఇస్తానన్నాడు కాని, తన కూతుర్ని ఇస్తానని మాటకన్నా అనలేదు. అనూరాధని ఇస్తే కళ్ళుమూసుకుని చేసుకుంటాను' అన్నాడట, చూడండి, కాకి ముక్కుకు దొండపండట! ఆశకు, అంతనేదిడుండాలి. మన రాధమ్మని వేసుకపోవాలని వుందికాబోల్ను! దీన్ని వచ్చలేదంటే, మా అమ్మాయిని ఇస్తాం అంటారు కదాలని తల్లికొడుకూప్లాను, వేసుకున్నారల్లేవుంది.ఒక్కగానొక్క పిల్ల అల్లారు ముద్దుగా పెరిగింది. చదువూ సంగీతం వొచ్చినపిల్ల. ఈ దిక్కుమాలిన సంబంధానికి ఇచ్చి, దాన్ని జన్మాంతం దుఃఖపడేలా చేయటం ఎందుకు? ఒకవేళ పైకిపోవట మెందుకని ఇచ్చిచేసినా, మన రాధమ్మ, ఆవిడగారి మడీ, ఆచారానికీ తట్టుకోగలదా? సుశీఅంటే, పల్లెటూళ్ళో పెరి గింది కాబట్టి, పైగా చిన్నప్పట్నించీ, ఇద్దరూ ఆటపాటల్లో పెరిగారు కాబట్టి, ఆశపడి, ఆ మాత్రం ఆపేక్ష ఉండక పోతుందా అని అడిగాం; ఇప్పుడు, ఇన్నిరోజులుగా ముచ్చట పడుతున్న మేనరికం కాకపోయినాక,ఇంక సుశీకి సంబంధం కుదరటం ఎంతకష్టం? వీం వంక వుందో,

స్వయానా వాళ్ళింట్లో పెరిగిన మేనబావ వద్దన్నాడు– అనుకోరూ?" అంది సిద్ధేశ్వరి.

"ఆఁ ఎవరనుకుంటారమ్మా వొదినా, మీపిచ్చికాని! మన అంతస్థుకి తూగరని, మనమే ఇవ్వలేదని అనుకుంటారుగాని; వాళ్ళు నిరాకరించారని ఎందుకు అనుకుంటారు?" అన్నాడు కుటుంబం.

"ఇంకొక సంగతి మీరు చెవిన పడిందో లేదో, 'మా పెద్దమామయ్య, నా చదువుకి డబ్బు ఇమ్మంటే ఇవ్వలేదు. నాకు వడుగు చేశానని వంక పెట్టి, మా అమ్మనగలమ్మకొని ఇచ్చినడబ్బంతా కాజేశాడు. నేను అష్టకష్టాలుపడి చదువుకొని ఉద్యోగం చేసుకుంటుంటే, నా కాళ్ళమీద నేను నిలబడితే తగుదునమ్మా అంటూ అయిదువేలిస్తాను; మూడువేలిస్తాను, పిల్లను చేసుకొమ్మంటూవచ్చారు ఆ మాత్రం పిల్లనివ్వాలన్న వుద్దేశ్యమే పెద్దమామయ్యకు వుంటే నా కాలేజీ చదువుకు, నా డబ్బు కాజేసి కూడా ఎందుకని, సాయం చెయ్యాడు?' అన్నాట" అంది సిద్ధేశ్వరి. భగ్గుమంది కుటుంబం హృదయం. దేవుడిలాంటి తన అన్నయ్యని చనిపోయినాక కూడా ఆ మాటలు అంటూంటే, సహించలేక పోయింది కుటుంబం భ్రాతృవాత్సల్యం!

మనిషిలోని మంచినికానీ చెడునుకానీ, గుర్తెరిగిన బంధువులు, ఆమనిషి బ్రతికివున్నా చనిపోయినా చెప్పుకుంటారు. అందుకే ప్రతి ఆలోచించి పని చేసే వ్యక్తికూడా, బ్రతికినన్నాళ్ళూ మంచిగా నడుచుకుందుకే ప్రాధాన్యత ఇస్తాడు. వ్యక్తి నశించినా ఆవ్యక్తియొక్క గుణశీలాలు

నశించవు. తరతరాలుగా ఇప్పుకుంటూనే వుంటారు. కీర్తి కానీ అపకీర్తి కానీ అజరామరమైనది.

"వీడికొడుకు వాడిబొంద! వుద్యోగం అంటూ దేవులాడుతున్నాడు కనుకనే వాడికి పిల్లనివ్వాలను కోవటం. అంతేకాని, సిలన్, కొబ్బరి చిప్ప పట్టుకు తిరిగితే వాడికి పిల్లనిచ్చి పెళ్ళిచేస్తానని వూహకేగే వాడెవడు!" అన్నాడు.

"మహాబాగా చెప్పారు. మీ ఎదుట అనాల్సింది, నాలుగూ దులిపేద్దుకు. ఏమిటో కుర్రతనం, వెర్రిమాటలూ" ప్రాసగా అంది సిద్ధేశ్వరి.

"అంతే! అంతే! నా ఎదుట అంటే మక్కెలువిరగ తందును. వీడిబోడిడబ్బు కాజేస్తేకాని నాకిన్నకు గడవలా వెధవమాటలు. పిట్టకొంచెం కూతఘనం" అన్నాడు ఉత్తరాపాసన పట్టిలేస్తూను.

సిద్ధేశ్వరి తృప్తిగా నవ్వుకుంది. సుశీల అంతవరకూ పినతండ్రి ప్రక్కన నించుని విసురుతున్నదల్లా, ఆయనలేచి వెళ్ళేసరికి చేతిలోని విసనకర్రని నేలకేసి కసిగా విసిరి కొట్టింది.

"హుఁ. అన్ని మాటలు చెప్పావు; తను అన్ని మాటలు అన్నాడు. కాని 'రాధి'ని మటుకు వాడికి చస్తే ఇవ్వనని' అన్నడా? ఎందుకు అంటాడు? మనసులో వాడికి ఇవ్వాలనేవుంది. తన కూతురు కన్నా ఎక్కువా నేను? డబ్బుపెట్టి గొప్ప సంబంధం చేస్తాడట. పాపం ఈయనగారు నాకు దానం చేస్తాడు కాబోల్ను. నాతండ్రికేతనకి చదువూ,

సాధ్యాలేవని, ఆ బస్తీ పెళ్ళాం చిన్న చూపు చూసి వెళ్ళ గొట్టుతుందని ఆస్తి సగానికి సగం చెక్కలుచేసి దానం చేశాడు. అది మళ్ళీ మనకి దానం చేస్తాడేమిటి ? మనం ఇచ్చినది మన ముఖానే కొట్టాడు. ఇన్నాళ్ళబట్టీ మామగారింటిలో దాచుకున్న డబ్బంతా పెట్టి, శుభ్రంగా పొలమో మేడో కొనుక్కుని కులుకుతాడు పెళ్ళాం పిల్లలతో. చాకిరీ మనవంతు, ఆస్తులూ కులకడం వాళ్ళవంతు." అంది సుశీల కసిగా.

"రఘుకి చిన్నాన్న, రాధిని ఇయ్యాడు. నాదీపూచీ" నమ్మకంగా అంది సిద్ధేశ్వరి.

"చూసాగా ?" ఎదేవాగా అంది సుశీల.

16

రఘుకి చిన్నతనం నించీ, సిద్ధేశ్వరి అంటే ఒకవిధమైన భయం వుండేది. సిద్ధేశ్వరికూడా ఎప్పుడూ రఘుని మంచిచేసుకుందుకు ప్రయత్నించేది కాదు. ఆవిడకా అవసరం వుండేదికాదు. సుబ్బమ్మ, రఘుకూడా ఆ ఇంటిలో కాంది శీకుల్లాగడిపారు కాని ఒకవిధమైన ఆత్మీయతా బంధుత్వంతో కాలం గడపలేదు. సుబ్బమ్మఆడపుట్టువు కావటంతోపుట్టింటి నించి తనకి ఏమీ చిల్లికానీ లభించకపోయినా బాబ్జివచ్చి తన చెల్లిని ఇస్తామనగానే పొంగిపోయింది. స్త్రీ హృదయం

సముద్రంలాంటిది. అది ఎలాంటి కల్మష కశ్మలాలనుతీసుక వచ్చిన కాలువ నీటినైనా నిండుహృదయంతో పొంగి పోతూ తనలోనికి విలీనం చేసుకుంటుంది. రఘుకి అలా వుండమంటే ఎందుకు వుంటుంది ? సుశీలని తన కిస్తా ననగానే, చిన్నప్పటి సుశీల గుర్తుకువచ్చింది రఘూకి. అందరి మీదా లేనిపోని చాడీలు చెప్పటం, అ స్తమానూ చింతగింజలు వొళ్ళో పోసుకుని వాళ్ళింటికీ వీళ్ళింటికీ తిరుగు తోంటం, వాక్కుద్ధిలేక బండగా, తేడామాటలు మాట్లాడు తోంటం రఘు కళ్ళకి కట్టినట్లయింది. ఒక్కసారి రఘూ శరీరం జలదరించింది. 'అందరిచందంమాటా, డబ్బూ, దస్కం మాటా, దేముడెరుగును. అలాంటి పిల్లని చేసుకుని సంసారం ఎలా చేస్తానురా?' అని భయపడ్డాడు. సుబ్బమ్మ పుట్టింటివాళ్ళతో సంబంధాలు తెగిపోతాయి అని బాధ పడుతోంది కనుక చిన్నమామయ్య కూతురయితే ఫరవా లేదు_ అనుకున్నాడు. అనూరాధ పెరిగి పెద్దయినాక రఘూ చూడలేదు. చిన్నప్పుడు ఎప్పుడన్నా సుబ్బమ్మతో వెళ్ళినప్పుడు, అనూరాధ చనువుగానే వుండేది. పెద్దయి నాక రఘు ఎప్పుడన్నా వెళ్ళినా ఇంట్లోంచి బయటకు వచ్చేదికాదు. చిన్నప్పుడు అంతా అనూరాధకి తన తండ్రి వెంపు బంధువులు ఎవళ్ళన్నా వస్తే, ప్రాణం లేచివొచ్చేది. మేనత్త సుబ్బమ్మ అంటే ఆ పిల్లకి ప్రాణంగా వుండేది. ఆవిడ పక్కలోనే పడుకునేది. ఆ పిల్ల తండ్రివూరు ఎప్పుడూ చూసి ఎరుగదు అందుకని సుబ్బమ్మ వూరు ప్రయాణ మయ్యేసరికల్లా తనూ వస్తానని వేడ్చేది. సుబ్బమ్మ బండి

ఎక్కుతోంటే, కాళ్ళకు చుట్టుకుపోయి ఏడ్చేసేది. చిన్న గౌను, చిన్న జెడ వేసుకుని లేగబుగ్గలు ఎరుపెక్కిపోగా, వెక్కి వెక్కి ఏడుస్తోన్న అనూరాధని చూస్తే రఘుకి జాలి వేసేది.

"నోనీ పంపించకూడు అత్తా ! నేను తీసుకవచ్చి దిగబెడతాను మళ్ళీ!" అనేవాడు. అంతా ఫకుకున నవ్వేవాళ్ళు. తనన్నదాంట్లో, నవ్వొచ్చేమాట ఏముందో రఘుకి తెలిసేదికాదు.

"మీ మామయ్య కోప్పడతారు నాయనా ! లేక పోతే పంపిద్దును" అనేది అన్నపూర్ణ.

"ఏమ్మా ! పాపం ఎంతలా ఏడుస్తోందో చూడవే ! తీసుకురామ్మా ! మామయ్యతో ఏదో చెప్పొచ్చు !" అనేవాడు.

"వొద్దు. అసలే చినమామయ్య కోపిష్ఠినిషి ! ఈసారి వొచ్చినప్పుడు అడుగుదాం ! తీసుకవెళ్ళమంటే తీసుకవెళ్దాం" అనేది సుబ్బమ్మ.

అలానే 'రాధి' ఏడుస్తోండగానే వెళ్ళిపోయేవారు. వెళ్ళిన రెండు మూడు రోజుల దాకా రఘుకి, మతి తోచేది కాదు. చదువుకోబుద్ధి వేసేది కాదు. ఒకసారి సాహసం చేసి చిన్నమామయ్యని అడిగాడు రఘు. అసలు చిన్నమామయ్యతో మాట్లాడటమంటే జడసేవాడు. అయినా 'రాధి

వీడుపు రఘు, ఆత్మీయతా హృదయం స్పందింప చేయగా ధైర్యంచేసి అడిగాడు.

"పోనీ ఒకసారి తీసుకరా మామయ్యా ! అంతలా వస్తానని వీడుస్తోంటుంది రాధి."

కుటుంబం, భళ్ళుమని నవ్వాము.

"ఆరి పిల్లగాడిదా ! దానిమీద దయ పుట్టిందిరా నీకూ ! ముందు బాగా చదువుకుని పరీక్షలు పాస్‌వవు ! అప్పుడు ఏకంగా అట్టే పెట్టుకుందువుగాని! అయినా, 'రాధి' మునపట్లా వీడవటంలేదు. చక్కగా చదువుకుంటోంది. సంగీతం పాడుకుంటోంది. ఇప్పుడు రమ్మన్నా రాదు" అన్నాడు. సుబ్బమ్మ మురిసి మురిసిగా నవ్వుకుంది. రఘూ సిగ్గుపడ్డాడు. ఈమధ్య వెళ్ళినా 'రాధ, కనపడటం లేదురఘూకి. 'రాధ' రూపం చిన్నగానూ, చిన్న జెడా, చెంపలు ఎరుపెక్కిపోయి లేతగులాబీ రేకుల పెదాలు అదరటమూ, అదే పదేపదేగా, జ్ఞాపకం వచ్చి ఆ పిల్లదాని పట్ల ఆపేక్షగా రూపొందింది.

"అమ్మా ! 'రాధి'ని ఎదిగాక నేను చూడనేలేదు. ఎలా వుంటుందే" అన్నాడు.

"బాగానే వుంటుంది. పచ్చగా బొద్దుగ్గా వుంటుంది. పాటకూడా బాగా పాడుతుంది" అన్నది సుబ్బమ్మ.

ఇంకా ఏదన్నా వర్ణిస్తే బాగుండు ననుకున్నాడు రఘు. కాని సుబ్బమ్మ రచయిత్రి కాదుకనుక, అనూరాధ అందచందాల్ని, సంగీత సాహిత్యాల్ని, అంతకన్న ఎక్కువగా వర్ణించలేకపోయింది.

"అయినా ఒకసారి చూడాలి" పైకి అనకుండగా వుండలేకపోయాడు.

"అసలు ఇస్తానని, చిన్న మామయ్య అనసీయి. అప్పుడు తర్వాత చూడొచ్చు." అన్నది సుబ్బమ్మ.

"ఇవ్వడంటావా ?" అన్నాడు రఘు.

"మనం సుశీని కాదన్నామని కోపంవచ్చి వుంటుంది చిన్నమామయ్యకి" వూహించిన సంగతి చెప్పింది సుబ్బమ్మ.

"సుశీని కాదన్నామని కోపం తెచ్చుకుంటారా ఎవరన్నా? పోనీ ఆ పిల్ల నచ్చకపోతే మా పిల్లని చేసుకో; అంటారు కానీ;" ఆలోచనగా అన్నాడు రఘు.

"అలా అనేవాడయితే ఆ వేళనే, ఇక్కడి కొచ్చినప్పుడే అనొచ్చుగా ? ఏమీ మాట కయినా ఒక మక్కన్నా అనకుండగా వెళ్ళిపోయిన మనిషిని పట్టుకుని వెనకాతలే మనం వెళ్ళి అడగాలాగీ ఒకవేళ అడిగినా, ఆ ముచ్చట తీరుస్తాడనే నమ్మకం నాకు లేదు"అంది సుబ్బమ్మ.

"ముచ్చట పడ్డవాళ్ళ ముచ్చటలన్నీ ఎవరు తీర్చగలరే. దానికి భగవత్సంకల్పం కూడా తోడవ్వాలి. 'బాబ్జి' బావ ముచ్చటపడే వచ్చి ఆడిగాడు. నేను తీర్చగలిగానా ? అట్లాగే, నా ముచ్చట చిన్నమామయ్య తీర్చటానికి అశక్తుడవ్వవచ్చును. తీరదేమో అన్న అనుమానంతో, మనసులోని కోరికని మనసులోనే దాచుకుంటే తీరా చేయి దాటిన తర్వాత, అయ్యో! మనసులోని మమతని బయటపెట్టటం చాతకాక, చేతులారా మసి చేసు

కున్నామే; అని బాధ పడవలసి వస్తుంది. బాధ అన్నది ఎప్పుడయినా తప్పదుకదా! మన కర్తవ్యం మనం నిర్వహించు కున్న నాడు, మనవల్ల లోపమేమీ లేదనే తృప్తివల్ల, బాధ అనుభూతి కూడా ఆనందాన్నే ఇస్తుంది. కలితమన్నది భగవంతుడు తేల్చవలసిన సంతి! మనం ఈ జీవన నాటకంలో కేవలం పాత్రధారులం. భగవంతుడు వేది ప్రసాదిస్తే దాన్ని నిండు మనస్సుతో స్వీకరిస్తాను. సుఖాన్నే ప్రసాదిస్తాడో, దుఃఖాన్నే ప్రసాదిస్తాడో, అది నా పూర్వజన్మ సంచితమై వుంటుంది" అన్నాడు రఘు.

సుబ్బమ్మ నిర్ఘాంతపోయింది. తన కొడుకులో ఇంత తర్క వితర్కాలువున్నాయని ఆమెకు తెలీదు. ఇంకా చిన్న కుర్రవాడుగానే ఆమెకళ్ళకి కనపడేవాడు. పెళ్ళి విషయంలో కూడా, తన మాట వింటాడని ఆమె అభిప్రాయపడింది. కాని ఆ విషయంలో కూడా, రఘూ పెరిగిపోయి తన వివాహం గురించి తనే ఒక స్థిర నిశ్చయానికి వచ్చేశాడు. భయంపుట్టుక వచ్చింది. ఒకవేళ, కుటుంబం "రాధి"ని ఇయ్యనంటే ఎలాగ? తనకా ఒక్కడుగాని ఒక్కకొడుకు; ఏం అఘాయిత్యం చేస్తాడో! శరీరం జలదరించింది సుబ్బమ్మకి. అయినా పైకి బింకంగా,

"ఇస్తే ఇస్తాడు లేకపోతే లేదు. నువ్వన్నట్టుగా, మనకు రాధినిస్తే చేసుకుంటామని చెప్తాను. ఇవ్వకపోతే, మనం గుళ్ళపాడు సంబంధం సెటిల్ చేసుకుందాము. పిల్ల

అందంగా వుంటుంది. కట్నం తక్కువై తేనేం కాక; ఆ పిల్ల తల్లిలేదు. మనతోపాటుగా కలిసిపోతుంది" అంది.

"అవును. ఆ పిల్లకి దిక్కులేదు, మనకి దిక్కు వుండదు. దిక్కుమాలిన సంబంధం సమంగా సరిపోతుంది. తప్పకుండా అలానే చేద్దాం" అన్నాడు నిర్వేదంగా రఘు

కొడుకు ఏ అన్యమనస్కతతో అంటున్నాడో సుబ్బమ్మ గ్రహించకపోలేదు. అయినా కొడుకు ధోరణి అనుకూల వాతావరణంలో పడేదాకా ఆమె మనస్సుకి ఉపశాంతి లభించదు.

"వెంటనే వెళ్ళి, కనుక్కుని వచ్చేస్తాను. ఏ సంగతీ తేలిపోతే, ఈ మాసం లోనే నీ పెళ్ళి చేస్తాను. నాకూ వృద్ధాప్యము వచ్చేస్తోంది. ఒక కొడుకనీ, కోడలనీ ముచ్చట చూడకుండానే పోతానేమో అని భయంగా వుంది" అన్నది సుబ్బమ్మ.

"అలాంటి మాటలు అనుకోకు అమ్మా! నా కంఠంలో ప్రాపిరి వుండగా, నువ్వు ఏ విధంగానూ కష్టపడటం నేను సహించను" అని బయటికి వెళ్ళిపోయాడు రఘు. సుబ్బమ్మ మర్నాడే అన్నపూర్ణ వద్దకి ప్రయాణమైంది.

'బాబ్జి' కూడా చిన్నాన్న అంటే అసహనం కలిగింది. బాబ్జి ఒక బీద అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆరుగురు ఆడపిల్లలు కలిగారు. మళ్ళీ నెలతప్పినట్లు అనుమానం. సుశీల పెళ్ళిఅంటూ అయిపోతే, ఆస్తి పంచుకోవచ్చని బాబ్జికి ఆశ. తల్లి మాట నమ్మి, చిన్నాన్నని తీసుకుని వెళ్ళి, మేనత్తని అడిగి లేదనిపించుకోవటంతో బాబ్జికి చిరాకేసింది.

"ఆయనకి కూతుర్నే ఇచ్చుకోవాలని వుండేమో ! లేకపోతేతన సుశీ గురించి, కాస్త గట్టిగా చెప్పి వుండును. ఇప్పుడు ఎక్కడని వెతుకుతాం సంబంధాల్ని? ఈ రోజుల్లో, పత్రివాళ్ళకి చదువూ, సంధ్యలూ- సంగీతాలూ, సాహిత్యాలూ ఎక్కువైపోయాయి. ప్రతీవాళ్లూ ఏం చదువుకుందని, అడిగేవాళ్ళే. ఏం చెప్పను ? పోనీ పాట వచ్చునని చెప్దామంటే మంగళహారతి కూడా పాట్టం రాదాయె. నాకేమీ పాలుపోకుండా వుంది." అన్నాడు తల్లితో.

"ఆయన కూతుర్ని ఎందుకిస్తాడు ? ఇక్కడ్నించీ, పట్టుకెళ్ళిన పంట అంతా, మామగారి దగ్గర దాచుకున్నాడు కదా. ఏ ముప్పయ్ వేలో అవుతాయి. అవి ఇన్నాళ్ళూ, ఇల్లు కనిపెట్టుకుని వుండి, ఆ ముసలాయనకి చాకిరీ చేసి, తల్లి లేనిపిల్లాడిని పెంచి పెద్దచేసినందుకు ఆయన ఏ ఇల్లో

వాకిలో పిన్నిపేర ప్రాసేవుంటారు. అదీ ఇదీ కలిపి శుభ్ర మైన సంబంధం చేస్తారు." అంది సిద్ధేశ్వరి.

"అమ్మా; చిన్నాన్న దగ్గర ముప్పయ్ వేలు పోగు పడ్డాయి కే" ఆశ్చర్యంగా అన్నాడు బాబ్జి.

"ముప్పయ్ వేలేం కర్మ, ఇంకా ఎక్కువే వుంటాయి. అయనకి ఖర్చు ఏమివుంది? ఇక్కడవుంటే మనింట్లోనూ, అక్కడ వుంటే అత్తవారి ఇంట్లోనూ తిండి వెళ్ళిపోతుంది. ఇంకా పంట అంతా ఆదాయె," అంది.

"ఇక్కడ్నించి నువ్వు వండి పెట్టకు. ఈయనకి మనం నౌఖరీలమా? కాస్త సుశీల పెళ్ళికైనా సాయం చేయలేక పోయాడు. దౌర్భాగ్యుడు. డబ్బంతా మూట కట్టుకోటం మరిగాడు బాగా;" అన్నాడు బాబ్జి. బాబ్జికి ఈమధ్య డబ్బు విలువ బాగా తెలిసి వస్తున్నది. ప్రేమించిన అమ్మాయి, పేద దైనప్పటికీ, ఆమె అందాన్ని మోహించి, అదే హృదయం గమనైన ప్రేమ అనీ, తనేదో గొప్ప త్యాగమూర్తి అనీ గప్పాలు కొట్టుకుంటూ పెళ్ళి చేసుకున్నాడు. ఆ యువతి ఆరుగురుఆడసిల్లల్ని, అతనిలోనిదివ్యప్రేమారాధనకిజ్యోతుల్లా నిలబెట్టింది. ఇంకా అతనిలోని ప్రేమామృతం ఇంకిపోకుండా యధాశక్తి దోహదం చేస్తోనే వుంటోంది. అంతవరకూ, "ప్రేమమయమీ జీవనమూ, త్యాగమయమీ జగమూ" అంటూ ఉప్పొంగిపోయే వాడల్లా, తనకి ఇద్దరు కూతుళ్ళ వోణీలు వేసుకోవటం చూసేసరికి ఒక్కసారి చప్పబడి పోయేడు. ప్రేమ, ఆర్థిక తుష్టిని ఇవ్వలేదుగా మరి? అవ తల చెల్లెలి పెళ్ళి అయితేకాని, ఆస్తి పంపకానికి తల్లీ,

తమ్ముడూ వొప్పుకోరు. పోనీ తన కూతుళ్ళని అందగత్తె లేమో, ఎవరన్నా ప్రేమించి అయినా పెళ్ళి చేసుకుంటారు- అనుకుందుకు వీలులేదు. అందరాడపిల్లలకీ మేనత్తల పోలికలు తప్ప తల్లిపోలిక రాలేదు. అంచేత, కొన్నివేలు పోస్తే కాని, అతని ఆడపిల్లలకి సంబంధాలు కుదరటం కష్టం. దానితో బాబ్జికి డబ్బుయొక్క విలవ బాగా వంటపట్టింది. పెళ్ళాంతో "పోనీ ఆపరేషన్ చేయించుకోనా, పిల్లలు ఎక్కువౌతున్నారు?" అన్నాడు. ఆ మాటకి, ఆమె త్రాచల్లే లేచిపోయింది. తను నయాపైస తేలేకపోయినా వంశాంకురం మీది మమకారం ఆమెలో లేకుండగా పోలేదు.

"ఒక్క మగనలుసన్న లేదుకదా; మీకు నోరెట్టా వచ్చిందీ అలా అంటానికి" అని ఏడ్చింది.

"భగవంతు డిచ్చిన వరాలని వద్దనకూడదు నాయనా" అని, అతనిఅత్తగారుసూక్తి చెప్పింది ప్రతీఏడూ మగనలుసు కలుగుతుందేమో అని చూడటం, ఆడభూతం కలగడం అలవాటు అయిపోయింది ప్రతీ, ఫామిలీ ప్లానింగు వర్కరూ, పిల్లల్ని ఆర్థిక ఇబ్బందుల్లో పెంచటం కష్టమని, ఆపరేషన్ చేయించకోవటం ఉత్తమం అనీ, 'బాబ్జి' భార్యకి తమ శక్తివంచన లేకుండా చెప్పేవారు.

ఈ సారికి పోనియ్యండి ఒక్కమగ నలుసు కలగగానే, ఆపరేషన్ చేయించుకుంటాను." అంటూ, వుండేది. తన భార్య ప్రతీఏడూ ఒకొక్క పిల్లని కని తన దరిద్రం పెంచుతూంటే, బాబ్జి, తన చేతకాని తనాన్ని, కించపరుచుకోవటం ఇష్టంలేక, తక్కువ పిల్లలున్న వాళ్ళనిచూసి ఈర్ష్య

పెంచుకునేవాడు. ఒకొక్క పిల్లలున్న వాళ్ళు ఏదో విధంగా నశించిపోకూడదా! వాళ్ళ ఆస్తి తమకు కలవకూడదా- అని నిత్యం ఆలోచించేవాడు. తను చేతులారా దరిద్రం పెంచుకున్నాడన్న, అభిప్రాయం అతనిలో ఎప్పుడూ కలిగేదికాదు. చిన్నాన్న తమ ఇంట్లో తిండిజరుపుకుని ధనవంతుడై పోతున్నాడన్న దుగ్ధ, అతని శరీరాన్ని దహించి వేసింది.

"కావల్సి వస్తే వేరే మకాం పెట్టుకుంటాడు. నువ్వు మాత్రం భోజనానికి పిలవకు" అన్నాడు.

"అల్లాగే! నాకుమాత్రం ఓపిక వుండిచచ్చిందా ఏమిటి! ఏమిటో ఆడపిల్లలు గలవాళ్ళం! దేనికయినా అండగా వుంటాడని జేరనిచ్చాను" అంది.

"ఏం అండ! సీతక్కకూతుర్ని వాళ్ళ బావ మరిదికి చేసుకో నిస్తాడా పోనీ?" అన్నాడు.

"ఎందుకు చేసుకోరు? చచ్చినట్లు చేసుకుంటారు. లేకపోతే, అన్నపూర్ణ అక్కడ్నే వుంటుంది." అంది సిద్ధేశ్వరి.

"పోన్లే, చేసుకుంటే మాత్రం మనకేం ఒరుగుతుందిలే! గుర్రానికి తోకవుంటే, గుర్రమే విసురుకుంటుంది. సీతక్క కూతురు, డబ్బుగల ఇంటిలోపడితే అది సుఖపడుతుంది. మన కేమన్నా పెట్టిపోస్తుందా ఏమిటి? మన బ్రతుకు ఎక్కడ వున్నావు గొంగళి అంటే, వేసిన

చోటే వున్నాను- అన్నట్లు వుంటుంది." అన్నాడు బాబ్జి. బయటకు వెళ్ళిపోయేక, సుశీల అంది.

"చూశావా అమ్మా! అన్నయ్యకుళ్ళు. సీతక్క కూతురుకి గొప్ప సంబంధం అవుతే తనకేం ఒరగదని అంటున్నాడు. నన్నేమో ఆ గతిలేని రఘుగాడికిచ్చి ఏదో అయిం దనిపించేసి, ఆ స్తిఅంతా పంచుకుని, తీరిగ్గా తన కూతుళ్ళకి, పెద్దపెద్ద వుద్యోగస్థులని తెచ్చి పెళ్ళి చేయాలని తాపత్రయం! అమ్మా, నువ్వు వున్నావుకనుక సరిపోయింది. లేకపోతే, ఈ అన్న తమ్ముళ్లు నాకు పెళ్ళి చేస్తారా? వాళ్ళ పిల్లల్ని ఎత్తుకు మోస్తూ, వాళ్ళు సినిమాలకూ షికార్లకూ వెళ్ళి వస్తోంటే, నేను ఇంట్లో వండి వార్చి పెడుతోంటే ఇంతకూడూ, గుడ్డా, పడేస్తారు. తనకి తన పిల్లలు అందరూ ఎలా సమానంగా, కనపడతారో అల్లానే తనతల్లి తండ్రులకి కూడా తమ పిల్లలందరూ సమానంగా కనపడతారని తెలీదు కాబోల్ను. ఈ ఆస్తిఅంతా తనూ, తన పెళ్ళామూ, పిల్లలే, అనుభవించాలన్న తాపత్రయం తప్ప, అయ్యో, మన కష్టార్జితమేమీ కాదు! మన అక్క చెల్లెళ్ళకి, అన్నతమ్ముళ్లకీ కూడా, మన తండ్రి ఆస్తి అనుభవించ టానికి హక్కువుంది- అన్న జ్ఞానం వీళ్ళ ధనదాహంలో నశించి పోతుంది కాబోల్ను! అంతా, తనూ తన పిల్లలూ తప్ప ఇంకెవరూ బాగుపడకూడదు!" అంది.

"అంతే నమ్మా! అంతే. అందుకే 'తల్లిగలప్పుడే పుట్టిల్లు; పాలుగలప్పుడే పరమాన్నం!' అని అన్నారు. తల్లి తండ్రి లేని పిల్లల్ని ఎవరాదుకుంటారు? అన్నలు మంచికి

చూసినా, వదినలు వెనకాతల వాతలు పెడ్తారు - తామూ ఆడపుట్టుకే, పుట్టామనీ, తమ పుట్టింట తమకీ ఈ మాత్రపు సన్మానమే జరుగుతుందనీ తెలిసికూడా. అందుచేతనే తమరూ, తమ ఆడపడుచులని, నీచంగా చూడాలని, తలు స్తారేమో!" అంది సిద్ధేశ్వరి.

18

తండ్రి వచ్చిన నాలుగు రోజులకే, మేన త్తసుబ్బమ్మ రావటం, 'అనూరాధ'కి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఎప్పుడూ, అక్కగారు రావటంతోనే, ఆకబుర్లు ఈ కబుర్లు చెప్తూ, కూడా కూడా తిరిగే, కుటుంబం, సుబ్బమ్మ రాంగానే ఏదో పనివున్నట్టు, బజారుకేసి వెళ్ళిపోవటం, అన్నపూర్ణకి, ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా మా మూలు ఆదరణభావంతోనే సుబ్బమ్మని ఆహ్వానిం చింది.

"ఒక ముఖ్యమైన పనిమీద వొచ్చాను." అంది సుబ్బమ్మ. అనూరాధ కాళ్ళు తలుపువెనకాల నించు న్నాయి.

"ఏమిటి?" అంది అన్నపూర్ణ.

"ఏంలేదు. ఈ సంవత్సరం, రఘుకి పెళ్ళి చేసేద్దా మనివుంది. ఏదో మా అంతస్థుకి తగ్గ సంబంధాలు వస్తే

న్నాయి. అయినా, నీ కిచ్చిన మాట నిలపెట్టుకోవాలనే పుద్దేశ్యంతో వచ్చాను. రఘు కూడా, 'రాధి' విషయంలో సుముఖంగానేవున్నాడు. అంచేత, మీరు అంగీకరిస్తే, ఈ మాఘంలోనే, రఘుపెళ్ళి చేసేద్దాం!" అంది సుబ్బమ్మ. అన్నపూర్ణ కళ్లు ఆనందంతో చెమర్చాయి. తలుపు వెనకాతలి లేతమనసు తేలిపోతోంది. అనూరాధ చప్పున, ప్రక్కగదిలోని అద్దం ముందుకు వెళ్ళి నించుంది; ఆ పిల్ల దాని, దానిమ్మ పూకేకల్లాంటి పెదాలు పూరికే అదురుతున్నాయి. లేతగులాబీ పూల మృదుత్వంతోవున్న గుండ్రని బుగ్గలని, ఒక్కసారి, అరచేతులతో పట్టుకుని, నవ్వుకుంది. ఒక్కసారి, "రఘుభావ" అనే, అదృశ్యవ్యక్తి యొక్క వూహా రూపం, ఆ పిల్లదాని మనో నేత్రంముందు నించోగానే, అనూరాధ శరీరం యావత్తూ ఆనందోత్సాహంతో గజగజలాడింది. వివాహం అన్నది నూరేళ్ళపంట. కోరుకుని, మనసారా ఆరాధించిన వ్యక్తి, బాలికకు భర్తగా లభిస్తే ఆ బాలికకు, ఇహ పరాల భేదము కనపడదు. అనూరాధ, కూనిరాగాలు తీసుకుంటూ, ఆ గదిలోనే అటూ ఇటూ, తిరగసాగింది. ఏపనీ చేయబుద్ధవటం లేదు. అత్త, అమ్మల ఎదుటపడటానికి ఆ పిల శరీరం అంతా లజ్జ అనే చివురాకులు మొగ్గలు తొడిగింది.

అన్నపూర్ణ, వొంగి సుబ్బమ్మ పాదాలని స్పృశించింది.

"వొదినా! తల్లీ తండ్రీ లేనిదాన్ని! నాలాంటి ఎవరూ ఆదుకోని ఈ నిర్భాగ్యురాలి కడుపున పుట్టిన

దైనా, అది అదృష్టవంతురాలు కనుక మీకీ మంచి బుద్ధి ప్రసాదించాడు భగవంతుడు. నా కంతకంటే ఏమి కావాలి? ఇంక నా పిల్లభారం మీదే! దాని భాగ్యాలు మీవే!" అంది. అన్నపూర్ణ కళ్ళు సజలాలయ్యాయి.

"పిచ్చిదానా! నువ్వు, నీ కూతురూ వొప్పుకుంటారని, నాకు తెలుసును. కాని తమ్ముడు వొప్పుకోవద్దూ!" అంది సందేహంగా, సుబ్బమ్మ.

"ఆయన ఎందుకు వొప్పుకోరు? రఘు అంటే, మంచి ప్రేమవుంది ఆయనకి!" అంది అన్నపూర్ణ.

"మనుషు వుండి వుండొచ్చును. ఇప్పుడు వుంటుందన్న హామీ ఏమిటి? కాలం పెరిగేకొద్ది మనుషులూ, మమతలూ, మారరని నిర్ధారణ లేదుకదా! వాడిచేతికూడా ఓ నని పించితే శుభం అనుకోవచ్చును." అంది సుబ్బమ్మ.

"చిత్రంగా అంటున్నారు వొదినా! మీ తమ్ముడు, మీ చేతుల్లో మీరు ఎత్తుకు పెంచిన తమ్ముడు, మీ కొడుకుకు పిల్లనివ్వనంటారా! ఎంతాశ్చర్యం?" సందేహంగా అంది, అన్నపూర్ణ.

"పూర్ణా! నీకు లోకం పోకడ తెలీదు. ప్రతీ వ్యక్తీ కూడా, వచ్చినసంపదకి, దగ్గర లేని అప్పుకి దూరం వుంటారు. కుటుంబం తన కూతురి భవిష్యత్తుగురించి ఏమి నిర్ణయం చేసుకున్నాడో ఎవరికి తెలుసును?" అని, కుటుంబం సుఖీలని చేసుకొమ్మని, బాబ్జితోసహా వచ్చి చెప్పిన సంగతి, తమ రఘూ చేసుకోననటం చెప్పింది.

"వాడు నీ పుట్టింటివారికి దూరం కాకుండగా నీకు వుండాలని వుంటే 'రాధి'ని చేసుకుంటాను. లేకపోతే పై సంబధం చేసుకుంటాను_ అని ఖచ్చితంగా చెప్పాడు. అంచేత విధిలేక వచ్చాను." అంది సుబ్బమ్మ.

"అల్లా ఎప్పుడూ అనుకోవద్దు మీరు! మీరు అడగవల్సిన బాధ్యత వుండబట్టే వొచ్చారు. మీకు లేనిహక్కు నాకువుంటుందా? భార్యగా ఆయన ఎప్పుడూ నా సలహా లను పాటించలేదు. ఈ విషయంలో పాటిస్తే, నేనూ నా కూతురూ, పునర్జన్మ ఎ తినట్లు భావిస్తాను." అంది అన్న పూర్ణ.

రాత్రి అందరూ భోజనాలు చేసేరు. కుటుంబం తలనెప్పి వచ్చిందని, శొంఠి అరగదీసుకుని ముఖంనిండా పట్టువేసుకుని పడుకున్నాడు. సుబ్బమ్మ, మెల్లిగా గదిలోకి వచ్చింది. అన్నపూర్ణ భర్తకాళ్ళవద్ద కూర్చుని కాళ్ళు పట్టు తోంది. రాధ గోడప్రక్కగా, తండ్రికి కనపడకుండా నించుంది.

"ఏమిటి?" అన్నాడు.

"రఘు మా రాధిని ఇస్తే చేసుకుంటానన్నాడు. నువ్వునూకూడా, అంగీకరిస్తే ఈ మాఘమాసంలోనే జరిపి ద్దామని వుంది పెళ్ళి!" అంది సుబ్బమ్మ.

"నేనుకూడా అంటున్నావు? ఎవరు ఎనరు అంగీకరించారేమిటి?" వ్యంగ్యంగా అన్నాడు కుటుంబం.

"హుఁ! ఆ మాత్రం తెలీదా? తల్లికిష్టమయితే తల వరికి కట్టమని శాస్త్రం! తల్లివప్పుకుంది. పెళ్ళికూతురిమనసు

నాకు ముందే తెలుసు ? పెళ్ళికొడుకు చేసుకుంటానని నిశ్చితంగా చెప్పాడు!" అంది సుబ్బమ్మ.

"అయితే ఇంక నేనొకణ్ణి అడ్డుపడతానా ? సంతోషంగా జరుపుకోండి!" అన్నాడు.

అన్నపూర్ణ హృదయం కలుక్కుమంది. అనూరాధ కాళ్ళు వణకసాగాయ్!

"అదేం మాటరా! ఒక్కగా నొక్కతమ్ముడివి. నువ్వూ నేనూ, వియ్యమందాలని నీకు మాత్రం వుండదూ? నాకు ఒక్కనలుసు! నీకూ, ఒక్కపిల్ల. ఇద్దరం కలిస్తే ఎంత ముచ్చటగా వుంటుందో నువ్వే ఆలోచించు!" అంది సుబ్బమ్మ!

కుటుంబం మాట్లాడలేదు. బద్ధకంగా, గోడవెంపు వొత్తిగిలి, పడుకున్నాడు.

"ఏంరా మాట్లాడవూ ?" ఆత్రతగా అంది సుబ్బమ్మ. "చెప్పావుగా ! విన్నాను !" అన్నాడు ముభావంగా. తలనెప్పిగా వుంటం మూలంగా, ఇంకా, ఎక్కువ మాట్లాడిస్తే, బిరాకుపస్తుందని సుబ్బమ్మ గదిబయటికి వచ్చింది. బల్లిలా గోడకంటుకుని, నించున్న "రాధి" కనపడింది. మేనత్తని చూడగానే, ఆ పిల్ల ఇవతలకు వొచ్చింది. ఇద్దరూ, వసారాలో వేసివున్న పట్టెమంచం మీద పడుక్కున్నారు. అత్తని, రఘు భావగురించి, ఏమన్నా అడుగుదామని, ఆ పిల్ల మహా అనుకుంది. కాని ఆమెమాట, ధ్వనిరూపం దాల్చకుండగా, వూహామాత్రంగానే వుండిపోయింది. రాత్రంతా అనూరాధ ఆకాశంలోని

నక్షత్రాలను లెక్కపెడుతూనేవుంది. ప్రక్కలో పడుకుని తనకు వచ్చిన కీర్తనలన్నీ మృదువుగా పాడుతూ, వీపాట నేర్చుకుందుకు ఎన్నిరోజులు పట్టిందో, ఏ పాట పాడినప్పుడు తన స్నేహితురాళ్ళు తన్ని ఏమని పొగడారో, వివరాలన్నీ చెబూ గలగల్లాడుతూ కబుర్లు చెప్పే అనూరాధ ఆరోజు తనతో ఒక్కమాటన్నా మాట్లాడకుండగా చిన్నపిల్లలా బుద్ధిగావొచ్చి తన పొట్టలోకి ముడుచుకుపోలు పడుకున్న అనూరాధని చూస్తే సుబ్బమ్మకి ఆపేక్ష కలిగింది. ఆమెకి తెలీకుండానే ఆమె చేతులు అనూరాధని గాఢంగా పొదువు కున్నాయి.

తెల్లవారింది. ఆ రోజు వైకుంఠ ఏకాదశి! రాధ స్నానం చేసింది. చామంతి మడిలోని నీలం, ఎరుపుచామంతి పూలన్నీ కోసి మాలగా కట్టింది. మేనత్తకూడా స్నానం చేయుటచూసి,

"గోవెలకి వస్తావా అత్తా?" అంది.

"నువ్వు వెళ్ళు! నేను రాను!" అంది సుబ్బమ్మ. ప్రక్కింటి కమలతో రాధ గోవెలకి వెళ్ళింది.

కుటుంబం భూమి ప్రొద్దెక్కాక లేచాడు. ముఖం కడుగుకొని కాఫీ తీసుకుంటూండగా, సుబ్బమ్మ మళ్ళీ అడిగింది. కుటుంబం భూ అనలేదు; ఆఁ అనలేదు.

"మాట్లాడవేమిరా?" రెట్టించింది సుబ్బమ్మ.

"ఏం మాట్లాడను? భాజాభజంత్రీలతో భోజనానికి పిలుస్తే వొద్దని గోడచాటునించి పప్పుముద్ద కొసకేస్తావా, అని అడిగాడట! వెనకటికి ఒకరు! అలావుంది. మేమిద్దరం

మీ ఇంటికివచ్చి అడిగితే మొండిచెయ్యి చూపారు. అయ్యో ఒక్కగానొక్క మేనమామ మిగిలివున్నాడు మనకి అన్న నా పెద్దరికాన్ని నిలిపాడా! నిర్మొగమాటంగా, నిష్కర్షగా చేసుకోనని చెప్పాడు. ఇప్పుడు ఇలావచ్చి నా కూతుర్ని ఇస్తే చేసుకుంటానని చెప్పాడని అంటున్నావు! నవ్వాలో ఏడవాలో తెలియటంలేదు" అన్నాడుకుటుంబం.

"అవునుమరి! సుశీల వాడికి నచ్చలేదుట! పెళ్ళిళ్ళ విషయాల్లో పెద్దరికాలు అంటూ పట్టుకు కూర్చుంటే ఎలాగు? కలకాలం జీవితాలు గడపాల్సినవాళ్ళని మనం పెద్దరికాలనే పట్టుతో మన చేతులార వాళ్ళను జీవితాంతం దుఃఖపూరితం చేయటం పిల్లల సౌఖ్య సంతోషాలు కోరుకునే పెద్దలు చేయవల్సిన విధికాదు. వాడు 'రాధి'ని చేసుకుందుకు మనస్ఫూర్తిగా అంగీకరించాడు. ఆహ్లాదం కనపరిచాడు. అందుకని వొచ్చి అడిగాను" అంది సుబ్బమ్మ.

"అన్న కూతురు పనికిరానిది, తమ్ముడి కూతురు పనికి వొస్తుందా? సుశీలలో లేని అందం 'రాధి'లో కన పడిందా! నువ్వు అడిగావుకదా అన్న సంబరంలో రాధిని నీ కొడుక్కు ఇచ్చి పెళ్ళి చేస్తే ఇన్నాళ్ళుగా నా మంచీ చెడా చూసిన వొదిన ఏమనుకుంటుంది? బాబి ఏమనుకుంటాడు! తన కూతుర్ని చ్చుకుందామనే మన పిల్లల విషయంలో గట్టిగా చెప్పలేదు చిన్నాన్న. లేకపోతే నాలుగు కేకలు వేస్తే రఘూ సుశీని చేసుకోకపోనా? అనుకుంటాడు. నేను నాలుగు మాటలు చెప్పి రఘుని బ్రతిమాలి

బామాలి వొప్పించకపోలేను. కానీ నాకూ ఈ బలవంతపు వివాహాలు చేయకూడదు అనే అనిపించింది. తెల్లవారిలేస్తే వాళ్ళతో మసలవల్సిన వాడిని. వాళ్ళను వొద్దన్న వాళ్ళతో ఎలా సంబంధం కలుపుకుంటాను? నా పరిస్థితి ముందుకు వస్తే గొయ్యి, వెనక్కు మళ్ళితే నుయ్యిలా వుంది" అన్నాడు కుటుంబం.

అన్నపూర్ణ ఆగలేకపోయింది. చేతులారా పండంటి సంబంధాన్ని వొదులుంటుంటే ఆమె మాతృహృదయం విల విలలాడ సాగింది.

"ఎవరో ఏదో అనుకుంటారని మన అమ్మాయి పెళ్లి మానుకుంటారుటండీ! తెల్లవారిలేస్తే వాళ్ళతో మసలవల్సిన వాడినని బెంగపడుతున్నారు. వాళ్ళు వండిపెట్టక పోతే మీకు అన్నమే దొరకదా ఏం! నేను కుంటిదాన్ని, గుడ్డిదాన్ని, ఆ మాత్రం వండిపెట్టటానికన్నా పనికిరాని దాన్నా? అంతగా మొహమాటం అయితే వాళ్ళింటికి పెళ్ళటం మానెయ్యండి. చేతికి వచ్చిన సంబంధం కాదంటే ఇంక ఈ జన్మలో దానికి పెళ్ళి కాయ్యగలమా? అంతగా మీ అన్న కూతురికి పెళ్ళి కాకపోతే మీ వాటా అంతా రాసి యిచ్చెయ్యండి" వుద్వేగంగా అంది అన్నపూర్ణ.

అక్క ఎదురుగా భార్య అలా మాట్లాడుతోంటే సహించలేకపోయాడు కుటుంబం.

"నోర్ముయ్యి! ఆట్టే పేలకు? నాకు ఇష్టంలేదు. నేను చెయ్యను. అంతే. నా మంచిమాటే కావాల్సినొస్తే వాడు నా అన్న కూతుర్నే చేసుకోవాలి! అంతేకాని నా

పిల్లని ఇయ్యనను. తండ్రిలేని పిల్ల పెళ్ళికి ముఖం వాచిపోయి
వుండగా తగుదునమ్మా అని వాళ్ళింట్లో వుండి కూడా
వాళ్ళని కాదన్న ఈ మూర్ఖుడికి నా పిల్లని కట్టబెట్టుతానా
అది అసంభవం" అన్నాడు. అన్నవూర్ణ కళ్ళమ్మట నీళ్ళు
పెట్టుకుంది.

"నా మాట వినరా తమ్ముడూ! నువ్వు వేమీ ఖర్చు
పెట్టద్దు. నేనే పిల్లని తీసుకువెళ్ళి పెళ్ళి చేసుకుంటాను
మనసులు కలిసిన మనుషుని విడదీయకూడదు. చిన్న
పిల్లల్ని వేధ పెట్టకు" అంది సుబ్బమ్మ ప్రాధేయతగా.

"వాళ్లు నీతో చెప్పారా. ఒకళ్ళ ముఖం ఒకళ్లు
ఇంతవరకూ చూసుకుని ఎరుగరు. వాళ్ళ మనసులు క
శాయి అంటున్నావు. అసలు ఇతంతా నీ వేషమే. పెద్దో
నకి ముఖం కొట్టినట్లు వుండాలని, వాళ్లు పిల్ల నియ్యవస్తే
కాదని నాదగ్గరకొచ్చేవు. అసలు ఆవిడంటే నీకు ముం
నుంచీ కోపము పేరుకుంది. అంచేత వాళ్ళని ఈసడించినట్ల
వుండాలని వా సంబంధంకోసం, పెద్ద ప్రేమ వున్నట్లుగా
వొచ్చావు ! నాకు తెలియదా, ఒక్కచోట పెరిగి, ఆ
కున్న పిల్లని కాదన్నవాడికి ముక్కమొఖం ఎల్లాపుంటుంది
చూడన్నా చూడని అమ్మాయిని చేసుకుంటానన్నాడంటే
ఎల్లా నమ్మేది ?" అన్నాడు కుటుంబం.

"పోని నీ ఇష్టం వొచ్చినట్లు అనుకో, 'రాధి
మాత్రం ఇయ్యి. అదేచాల్ను. కావాలంటే పెద్దోడి
వాళ్ళ అసోసాలు పడకుండా 'సుశీ' పెళ్ళి అయ్యేదా

ఆగుతాను. ఇప్పుడు ప్రథానం చేసుకుందాం" అంది సుబ్బమ్మ.

"పోనీ అల్లా చెయ్యండి! మీ వొదినగారివల్ల, మీకు మాట రాకుండగానూ వుంటుంది, మన పిల్లకి సంబంధమూ చెడగొట్టుకోవాల్సిన అవసరమూ వుండదు!" ఆతృతగా అంది అన్నపూర్ణ.

"అబ్బే! అదెలా కుదురుతుంది? 'సుశీల' పెళ్ళి అయిన మర్నాడు, మన 'రాధి'కి చేసే స్తే వాళ్ళు ఆనవాలు కట్టలేరా? మీకేనా తెలివితేటలు వుంట. నేనే రఘూకి సుశీలని చేసుకోకుండా నిరోధించా ననుకుంటారు. అదేం లాభంలేదు. నువ్వు మాతో సంబంధం పొందదల్చుకుంటే సుశీని చేసుకోండి; లేదా మానుకొండి. రాధిని మాత్రం ఇయ్యటం కుదరదు."

"అంతేనా!" గాద్గదికంగా అంది సుబ్బమ్మ.

"అంతే!" అన్నాడు కఠినంగా కుటుంబం.

"ఒక్కసారి ఆలోచించు తమ్ముడూ!" దీనంగా అంది సుబ్బమ్మ.

"ఇంక ఆ విషయం మాట్లాడొద్దు" అక్కడ్నించి లేచి వెళ్ళిపోయాడు కుటుంబం.

"స్నానంచేసి మడిగట్టుకోండి వొదినా" అంది అతిథిని ఆదరించాల్సిన గృహిణి భాధ్యతతో అన్నపూర్ణ.

"వొద్దు వెళ్తాను" చేతిసంచీ సర్దుకోసాగింది సుబ్బమ్మ.

"భోజనం చేయకుండా వెళ్తారా" నిరోధించింది అన్నపూర్ణ.

"ఇవ్వాళ ఏకాదశి మాట మర్చిపోయావా?" ఎదురుప్రశ్న వేసింది సుబ్బమ్మ.

"అయితే ఇవ్వాళ ఏదో ఫలహారము చేసుకోండి. రేపు వుదయాన్నే భోజనంచేసి వెళ్ళొచ్చును. ఇంటి ఆడ పడుచు అభోజనంగా వెళ్తారా?" అంది అన్నపూర్ణ.

"ఆ మంచి మర్యాద కాలం వెళ్ళిపోయింది పూర్ణా. నేను ఈ యింటికి ఆడపడుచుగా రాలేదు. యాచనకి వచ్చాను. చెయ్యి వూరుకోలేదు, వెళ్ళమన్నారు. వెళ్తున్నాను. కొండంత సంబరాన్ని ఈ మబ్బులు విడగొట్టకల వని నే నేనాడూ నమ్మలేదు. ఈనాడు నమ్ముతున్నాను. తాళి కట్టించుకున్న మర్నాటినించి తన పుట్టింటికి తనే భిక్షుకురాలు అవుతుంది స్త్రీ. ఆప్యాయతగానీ, ఆత్మీయత గానీ, లుప్తమైన పుట్టింటి గడపనించి స్త్రీ, నిరుపేదగా, రిక్తహస్తములతోనే సెలవుతీసుకుంటుంది. ఏ ఆభిజాత్యాని కోసరం నేను పిల్లవాడితో అష్టకష్టాలు పడుతూన్నా, నా మానాన్ని నేను నిలవరించుకుని, నిలబడ్డానో, ఆ అభిజాత్యంయొక్క మహావృక్షాన్ని నా తోబుట్టువు గండ్రగొడ్డలితో నరికేయగలడని ఒక్కనాడూ వూహించుకోలేదు" దుఃఖంగా అంది సుబ్బమ్మ.

"నావల్ల ఏమీ నేరంలేదు. నామీద ఏమీ కోపం తెచ్చుకోరు కదూ! నా మనస్సు స్థిమితం వుంటంలేదు

మీరు, ఎల్లాగో రెండు రోజులుంటే, నాకు బాగావుండేది" అంది అన్నపూర్ణ.

"ఏమీ క్షోపం లేదు! నువ్వేం చేస్తావు! అంతా విధి చేతులో కీలుబొమ్మలం. కాని ఇంక వుండలేను." ఎంత బ్రతిమిలాడినా వుండనని, సుబ్బమ్మ వెళ్ళిపోయింది. అన్నపూర్ణకి కన్నీళ్ళు ఆగలేదు. ఎలాగో వంట ప్రయత్నం, చేస్తోంది.

అనూరాధ కోవెలకి వెళ్ళింది. భగవంతుడికి మనసారా పూలూ, కొబ్బరికాయలూ, పళ్లూ ఇచ్చింది. కళ్లు మూసుకుని;

"భగవంతుడా! నా మనసులోని కోరిక లేమిటో నాకు తెలీదు. నా జీవితం ఎలా నడుస్తే, బాగావుంటుందో, నీవే నిర్ణయించు! నీ నిర్ణయాన్ని నేను హృదయ పూర్వకంగా, స్వీకరిస్తాను." అని ప్రార్థించింది. దారిలో ఆమె మేనత్త, తండ్రి ఒక నిర్ధారణకి వచ్చివుంటారని, ఆలోచించింది. ఎందుకనో, ఆమె మనస్సులో, రఘు బావతో, పెళ్ళి అనే మాట తల్చుకోగానే, ఆరాటం కలుగుతోంది. అది సంతోషమో, సంకోచమో తెలిసే వయసుకాదు అనూరాధది! ఇంటికివచ్చేసరికి తల్లి కన్నీళ్ళతో సంగతంతా చెప్పింది. అనూరాధ ఏమీ అనలేదు. తన్ని ఇవ్వనన్నంత మాత్రాన్న, మేనత్త అంత కఠినంగా అభోజనంగా వెళ్ళిపోవటం ఏమీ నచ్చలేదు అనూరాధకి "వివాహము ఎవరికి ఎవరితో అన్నది, పుట్టినప్పుడే నుదుట వ్రాసిపెట్టాడు బ్రహ్మదేవుడు, అది కాదనటానికి మన మెవరము?" కర్మ

సిద్ధాంతాన్ని నమ్మే అనూరాధ బాధపడలేదు అప్పుడూ. అన్నపూర్ణ మటుకు రోజురోజుకీ కృశించిపోయింది. అనూరాధ పెళ్ళిగురించి ఆమె దిగులు పెట్టుకుంది. చిన్నప్పట్నించీ 'రాధి'ని రఘూకిచ్చి చేయాలని ఆమె అనుకుంటూండేది. ఆ ఆశ మొదలంటా నరికివేయబడింది. అనూరాధ ఎంత లాలించినా అన్నపూర్ణ మనసు మళ్ళించలేక పోయేది. కుటుంబంతో అస్తమానూ తగవుపెట్టుకుని నానా మాటలూ అనేది. దానితో కుటుంబం ఉద్రిక్తమై నాలుగు దెబ్బలు వేసేవాడు. తల్లి, తండ్రి దెబ్బలాడుకుంటుంటే అనూరాధ కళ్ళప్పగించి చూసేది, రమణ మటుకు తండ్రికి వత్తాసుగా వుండేవాడు.

"ఇంకా భాగాతన్నాలి నాన్నా యీ ఆడాళ్ళని. 'ఎ డాగ్, ఎ వుమన్, ఎ వాల్ నట్ ట్రీ, ది మోర్ యూ, బీట్ దెం, ది బెటర్ దె బీ' అన్నారు. ఎవరో పురాణ పురుషులు." అనేవాడు. రమణ భాగా ఎదిగాడు. బి. ఎ. ప్యాసయ్యాడు. నెలకో వందరూపాయలు తెచ్చుకునేవాడు. కాని ఆ వందకి తోడు తండ్రి దగ్గర ఇంకో వందరూపాయలు పుచ్చుకుని ఖర్చుపెట్టేవాడు. పేకాడటం, సిగరెట్లు త్రాగటం భాగా అలవాటు అయ్యాయి. తల్లి అంటే ప్రేమకాని అభిమానంగాని వుండేదికాదు. తండ్రి ఎప్పుడూ పట్టించుకునే వాడుకాదు. ఆయన పొలమేమిటో గొడవేమిటో తప్ప అయ్యో అనూరాధ పెళ్ళి చేతులారా చెడగొట్టామే, దానికి మంచి సంబంధం వెతకాలని కానీ, రమణ జూదగాడు అయిపోతున్నాడు- వాడ్ని సరిదిద్దాలని కానీ ఆ అజ్ఞే

వుండేదికాదు. అనూరాధ మెట్రిక్ పాసయ్యింది. కుట్టు పరీక్షలు కూడా ప్యాసయింది. సంగీతం బాగా పాడేది.

కాని, ఆమె చదువు, సంగీతం ఆమెలోనే నిక్షిప్తమై పోయేది వుపయోగించే ఆవకాశం ఆ పిల్లకి వుండేదికాదు. పోస్టీ కాలేజీలో జేరుదామా అంటే కుటుంబం అంతగా పట్టించుకునేవాడు కాదు. ఆయన ఎప్పుడూ అన్నగారి కుటుంబం యొక్క సాధక బాధకాలని చూడటంతో సరి పోయేది. రమణకి ఆడపిల్లల చదువు అంటే ఇష్టం వుండేది కాదు. ఆడవాళ్ళు చదువుకుంటే మగవాళ్ళని ఎదిరిస్తారని అంటూ వుండేవాడు. అంచేత ఆ పిల్ల కాలేజీలో జేరటానికి అవకాశం వుండేదికాదు. కాని అనూరాధ వూరుకోలేదు. పరీక్షలకి కట్టకపోయినా ఇరుగు పొరుగు పిల్లలు చదువుకునే పుస్తకాలు తీసుకుని చదివేది. దానితో ఆమెకి జనరల్ నాలెడ్జి బాగా వచ్చింది.

19

జీవితం ఎంతో చిత్రమైనది. నలుగురు నోళ్ళల్లోనూ, అవినీతి పరులు అని నానిపోతూండే, వ్యక్తులు, అధాత్తగా నీతిమంతులయి భార్యా పిల్లల్ని చేరదీస్తారు. నిజాయితీ పరులని పేరుపడ్డవాళ్ళు, ఏదో ఒకానొక అవసరంవల్ల నీతిలేని పని చేయక తప్పక, వీధిన పడ్తారు. చెడిపోయినప్పుడు,

అందునా మనకు కావల్సిన వాళ్లు చెడిపోయినప్పుడు, దానికి కారణాలు వెతుకుతాం. చెడ్డ, అంటే లోకంలో తాగుడు, వ్యభిచారము, జూదము ఇవేకావు. మనకు కావల్సినవ్యక్తి, మనం ప్రేమించి, ఆరాధించే వ్యక్తి మనం నమ్మిన సిద్ధాంతాల కనుగుణంగా నడుచుకోక పోతే, అది చెడు అని నిర్ధారిస్తాం. మంచి జరిగితే, దానికి ఎంతమంది కారకులున్నా, మన ఆత్మ, ఆ మంచేదో మన స్వయం కృషి వల్ల జరిగిందనుకుంటేకాని ఒప్పుకోదు. ఆభిజాత్యము మహోన్నతమైనది. ఈ ప్రపంచకంలో ఏదిమంచి? ఏదిచెడ్డ! ఏది కష్టం? ఏది సుఖం? ఏది గమ్యం? ఏ దగమ్యం? ఏది నీతి? ఏ దనీతి? విడదీసి చెప్పలేం! దివారాత్రులవలె, ఒక దానివెంట ఒకటి అంటిపెట్టుకునే నడుస్తున్నయ్! అన్న పూర్ణకి తనకి ఏదైనా, చెడు జరిగితే ఒకరినొకరు నెట్టుకు పోయి, నిర్విచారంగా వుంటం చేతకాదు. ఏది జరిగినా స్వయం కృతమే అంటుంది! ఆ తల్లికూతుర్లైనప్పటికీ, అనూరాధ, అన్నిటికీ కారణాలు వెతుకుతుంది. కుటుంబం ఈసారి పల్లెకు వెళ్ళాడు. పొలంలో వుండగానే సిద్ధేశ్వరికి తెలిసింది- వెంటనే మూటా ముల్లెకట్టి, సుశీలతో సహా, తలుపులు తాళాలువేసి పెద్దకూతురు, సీతగారింటికి వెళ్ళిపోయింది. కుటుంబం ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం వేసివుంది. ఆయన పద్దు పుస్తకాల బీరువా వీధరుగుమీద పెట్టివుంది.

'ఎప్పుడు వెళ్ళారా వొదినగారూ?' పాలేరుని అడిగాడు కుటుంబం.

"ఇప్పుడే వెళ్ళారండి!" అన్నాడు పాలేరు. తను వూళ్లోకి వస్తున్నట్లు తెలిసే వెళ్లారన్నమాట! కుటుంబం ఆశ్చర్యపోయేడు! తను పుట్టి పెరిగిన ఇంటికి తను ప్రతిధి ఈ నాడు! తను చిన్ననాటినించీ ఆడి పాడి పెరిగిన ఇల్లు, బంధితయై తనకేసి దీనంగా చూస్తోంది! ఆ ఇంటిమీద తన కేమీ హక్కు లేదు. జ్యేష్ఠభాగంక్రింద, అన్నగారికివెళ్ళింది. తన తన్న వుండగా ఆ ఇంటితలుపులు తెనకోసం ఎప్పుడూ తెరిచే వుండేవి! ఈ నాడు, ఆ ద్వారాలుమూసుకున్నాయి. ఎందుకని మూయబడ్డాయో కూడా కుటుంబం హృదయానికి తెలుసును. తను ఎన్నడూ చేయని, చేయలేని అన్యాయాన్ని తనకి అంటగట్టారని, నిశ్శబ్దంగా బాధపడ్డాడు, కుటుంబం. తన పుట్టిల్లుని కళ్ళారాచూసి, తన గొడ్లు వున్న సావిడికేసి నడిచాడు కుటుంబం! ఆ సావిడికి తడికలు కట్టి, పేడామన్నూ పెట్టిఅలికించి అందులోవుండి వండుకుతింటూ, వ్యవసాయపు పనుల రోజులు గడిపాడు. నెలరోజుల తర్వాత సిద్ధేశ్వరి వచ్చింది. వచ్చినా, కుటుంబాన్ని భోజనానికి పిలవలేదు, కుటుంబం ఎప్పుడూ తనకు తానుగా ఆమెని పరికరించలేదు!

ఆ మాఖంలో రఘూ పెళ్ళితోబాటు, సుశీలకీ సీతకూతురుకూ, కూడా పెళ్ళిళ్ళు అయ్యాయి. సీతకూతుర్ని శంకరం చేసుకున్నాడు! ఆ పెళ్ళిరోజున, అన్నపూర్ణ తేలిగ్గా నిట్టూర్చింది. సీతకూతురుతో, శంకరం పెళ్ళి మాటలు జరుగుతూన్నన్నాళ్లూ అన్నపూర్ణకి గుండె దడగా వుండేది. ఎక్కడ శంకరం వొద్దంటాడో, ఎక్కడ తన

భర్త తన్ని ఈ మాత్రంగానైనా చూడడో, అని భయ పడేది. కాని ఆభయాన్నించి దేముడు, ఆమెని తప్పించాడు! అన్నపూర్ణ భగవంతునికి మనసారా, ప్రణతులర్పించింది. సీతకూతురు అందమైనది. ఆమె శరీరము ఎంత ధవళోన్న తమో, మనస్సుకూడా, అంత ధవళతరమైనది! సరళమైన మృదుస్వభావ! శంకరం యొక్క అనవసరపు ఆర్భాటాన్ని మౌనంగా, అంగీకరించేది. శంకరానికి చిన్నప్పట్నించీ, తిక్కతనం అలవాటయింది. అతను స్వాభావికమైన మాతృ ప్రేమనుంచి వంచింప బడ్డాడు, చిన్నప్పుడే! తల్లి కావాలని, అనేమాట, వ్యక్తపరచలేని చిన్నతనంలో తనకు లభించని ఏదో ఒక అనిర్వచనీయ అనుభూతికోసం తిక్కగా దిక్కులు చూస్తూ ఏడిచేవాడు! శంకరం ఏడిచే ఏడుపుకు అన్న పూర్ణకికూడాకళ్ళుసజలాలయ్యేవి! కనకమ్మగారుఅన్నపూర్ణని గోప్పడి శంకరాన్ని ఆడించమనేవారు! తర్వాత పెద్దయి నాక, ఏమాటన్నా వ్యతిరేకంగా అంటే నొచ్చుకుంటా డనే భయంతో వూరుకునేది అన్నపూర్ణ! అల్లా తనమాటకి ఎదురనేది, ఎరుగకుండా పెరిగాడు శంకరం! అతని మాటకి ఎదురులేకుండగా నడుచుకుంటోంది సుభాషిణి కూడా!

అన్నపూర్ణకి తను ఇంకా పుట్టింట్లోవుండి పోవటం ఏమీ బాగాలేదు. తన చేతుల్లో పెరిగిన పిల్లవాడు, తన సంసారం తను చేసుకుంటున్నాడు. కష్టమో, సుఖమో, పంచుకుని, అనుభవిస్తారు అమాయకపు పిల్లలు! ఇంక తన విధి, తన ఆడపిల్లగురించి చూడాలి! అనూరాధ తోట కూర కాడలా ఎదిగిపోతోంది, ఆడపిల్లగురించి అన్నపూర్ణకి

దిగులు పెరిగిపోయింది. కుటుంబం వీసంగతి పట్టించుకోడు! పొలం పనులున్నప్పుడు ఆవురు వెవ్వెటం, ఆపాకలో వండుకు తినటం_ లేనప్పుడు, అన్నపూర్ణవద్దకు రావటం తప్ప అయ్యో! చేతులారా, వచ్చిన సంబంధాన్ని పాడు చేశాము! పిల్లదానికి తగిన సంబంధం చూసి పెళ్ళి చేయా లన్న ధోరణి కనిపించేదికాదు. అయ్య అక్కడ! అమ్మ ఇక్కడ! ఇక ఇద్దరికి పొత్తుఎక్కడ? _ అన్నట్లు కాలం జరిగి పోతోంది తప్ప కుటుంబానికి మటుకు కాలంయొక్క విలువ తెలిసిరావటంలేదు. 'ధైర్యే సాహసే లక్ష్మీ!' అని ఒకరోజు అన్నపూర్ణకి తెగింపు వచ్చింది. ఏది ఏమయితే అదయిందని తాను పుట్టి పెరిగిన యిన్నాళ్ళకి, తాళికట్టించుకున్న ఇరవయి ఏళ్ళకి తనకుతానే పుట్టిల్లువదలి, పల్లెటూరు వెళ్ళింది అన్న పూర్ణ! అనూరాధకూడా వెళ్లింది. వెళ్ళటం సరాసరి తన అత్తగారిఇంటికే వెళ్ళింది. అన్నపూర్ణని! సిద్ధేశ్వరి ఆప్యా యంగా ఆహ్వానించింది.

"మేము చెప్పలేదనుకోకమ్మా! ఆయన పెళ్ళయిన మర్నాటినించీ, పోరుతూనే వున్నాము, హాయిగా, భార్యని తెచ్చుకుని, వండించుకు తినమని. వినలేదు. ఇంక విధిలేక నేను, ఈ చాకిరీలు చెయ్యలేక ఆయనకేసి చూడటం మానేశాను. దానితో తిక్కకుదిరి వండుకు తింటున్నారు. కాని ఇన్నాళ్ళకు నిన్ను పిలిపించుకోటం నా కెంతో సంతో షంగా వుంది." అన్నది సిద్ధేశ్వరి.

"మమ్మల్ని ఆయన ఆహ్వానించలేదు. మాకు మేమే వచ్చాము!" అని చెప్పుకోవటం ఇష్టంలేక పోయింది అన్నపూర్ణకి.

"ఎక్కడ వుంటున్నారు!" అంది దీనంగా. అబ్బులు కొడుకు దారిచూపించుతానన్నాడు. అన్నపూర్ణ, అనూరాధ చిక్కుచిక్కు మంటూ, వెనకాతలే వెళ్ళారు. గొడ్లసావిడికి తడికలు కట్టిన ఇంటిలో తొలిసారిగా, అన్నపూర్ణ గృహ ప్రవేశం చేసింది. అన్నపూర్ణ రావటం చూసిన కుటుంబం;

"ఎందుకు వచ్చావుగీ" అన్నాడు, కోపంగా.

"అది మీరు అడగవల్సిన సరైన ప్రశ్నకాదు నాన్నా! 'ఇన్నాళ్లూ రావటంలో ఎందుకు అలక్ష్యం చేశావు?' అని అడగాలి" అంది అనూరాధ.

"మీ తమ్ముడు గెంటేశాడా, ఇంట్లోంచి!" అన్నపూర్ణ మాట్లాడకపోవటం చూసి అన్నాడు వ్యంగ్యంగా కుటుంబం.

"తండ్రి హయాంలోనే గొటివేయబడితే, మన సంసారం యీసరికి చక్కగా, మహారాజ కళలో, సాగిపోయేది!" అంది అనూరాధ!

"నామటుకు నేను, మీకు రమ్మనమని కబురంపినట్లు గుర్తులేదు!" వెటకారం చేస్తూ అన్నాడు.

"అల్లాంటి అవసరం ఎప్పటికీ రాకుండగా వుండాలనే మా కోరిక" అనూరాధ, కఠినంగా అంది. ఎందుచేతనో కూతురు మాటలకు బదులు చెప్పగల సాహసం లేక పోయింది కుటుంబానికి.

"మీ ఖర్మ! వీడవండి !" అని బయటకు వెళ్ళాడు. అన్నపూర్ణ లాంతరు వెలిగించి సంజెదీపం పెట్టింది. ఆ లాంతరు వెలుతురులో వంటచేయటం మొదలు పెట్టింది. ఇన్నాళ్ళ బస్తీ జీవితం తర్వాత, పల్లెటూళ్లో కిరసనాయిల్ దీపంముందు, వంటచేయవల్సి రావటం అన్నపూర్ణకి కిచాటుగావుంది. అయినా తప్పదు! ఎల్లాగో ఆ రాధికి పెళ్లి అయ్యేదాకా ఈ కష్టం నిశ్శబ్దంగా భరించాలి !_అయిపోతే, అసలు చేయగలిగితేనే తనకి నిశ్చింత! అనుకుని పొయ్యి ముందు కూర్చుంది అన్నపూర్ణ.

20

కుటుంబం నలభయి ఏళ్ళవాడయినా, ఇంకా పసి తనంగానే, ఆలోచించేవాడు! ఏదన్నా ఒక పనిచేయాలంటే ఇంకొకరు నిర్దేశిస్తేకాని చేయలేని బలహీనత కుటుంబానిది! ఒకళ్ళు చెప్పినట్లు వినటంతో అతనికి ఒక విధమైన మూన సిక తృప్తి కలిగేది. ఆ అలవాటు; మనకి అయినవాళ్ళని అదుపులోనికి, పెట్టుకోవాలనే ఆతృత అన్నపూర్ణలో లేక పోవటంచేత కుటుంబం పరాయి వాళ్ళ చేతిలో కీలుబొమ్మ అయినాడు. మనిషిలోని లోపాలని మన కనుగుణంగా మలుచుకోగలిగితే, ఆలోపాలు మన్ని అంత బాధించవు!

2853

అనూరాధ పాక ముందు కూర్చుని ఆలోచించింది. స్త్రీ అన్నదానికి, పుట్టినింటికీ, ఎప్పటికయినా బుణాను బంధం తెగిపోక మానదు. స్త్రీకే కాదు, పురుషుడికికూడా! ఎప్పటికో తెగిపోయే సంబంధాన్ని వూహించుకుని ముందుగానే, తెగేసుకుంటారు. కొందరు; తెగేదాకా తాడు లాగుతూనే వుంటారు మరికొందరు! కొంతమందికి సమిష్టి గావుంటే, వీలుగావుంటుంది- కొంతమంది వంటరిగావుంటే సుఖశాంతులతో తులతూగుతారు. ఒకొక్కళ్ళ తీరు ఒకొక్కలా వుంటుంది. సమిష్టిగా వుంటే లాభం అనికానీ వేరుగా వుంటే లాభం అని కానీ నిర్వచించలేము. అది వ్యక్తిగత విషయం. దాన్ని సాంఘికం చేయబూనటం; సాహసికమే అవుతుంది. ఒక పనివల్ల ఒక మంచీ ఒక చెడూ కలుగుతుంది. అన్నపూర్ణ పుట్టినింట వుండటం మూలంగా ఒక తల్లిలేని పిల్లాడు, నిశ్చింతగా పెరగటానికి అవకాశం వొచ్చింది. ఈవేరుకాపరమే అప్పుడు పెట్టగలిగితే నిర్భయంగా రఘూకీ గాధకి పెళ్ళిచేయగలిగి వుండును కుటుంబం. దేనికయితే జడిసి కుటుంబం ఏ పుట్టినింటి కయితే దూరం కాలేక స్వంత కూతురి మానసికానందాన్ని తన అరికాళ్ళనేసి నిర్దయగా నలిపేసేడో, ఆపుట్టినింటికే, దూరం కావల్సి వొచ్చింది. ఆ బాధ కుటుంబానికి ఇప్పుడు రాధికి, మనసులో చీపురు ముల్లులా గుచ్చుకుంటూనే వుంటుంది. అన్నపూర్ణకి మటుకు ఆబేధం ఏమీలేదు! ఎల్లాగో రాధికి పెళ్లి అవటమేకావాలి! ఎవర్నైనా అల్లునిగా స్వీకరించకలదు! ఎవర్నైనా అల్లునిగా ఆత్మీయత చూపెట్టకలదు

అన్నపూర్ణ! ఆ తల్లికడుపునపుట్టి, ఆతల్లి పాలని త్రాగి పెరిగిన 'రాధ' అల్లా అనుకోగలదా? రాధకి కుటుంబం, మంచి సంబంధాలే చూస్తున్నాడు. తను చేసిన తప్పుకి, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న కుటుంబం తన సర్వస్వం కట్నంగా ధారపోసి అయినా 'రాధ'ని అందరూ, అద్భుతపడేలా, గొప్పవరుడికి ఇచ్చి పెళ్ళి చేయాలని తాపత్రయపడుతున్నాడు! అయితే అనూరాధ, రఘుబాబ నామం తప్ప మరో పేరుని గణన చేయని అనూరాధ అంతతేలిగ్గా మనసు మార్చుకుని, కాబోయే భర్తలో ఆలీనం కాగలదా! మనసుని మసి చేసుకుని శరీరంతో నవ్వగలదా? ఆ శక్తి, ఆ ఆత్మకాంతి ఆమెలో జీవంతమై వున్నదా? ఏమో! ఎవరి జీవితాలు ఎంతగా మారవలెనని విధాత వ్రాశాడో- ఎవరు చూడొచ్చారు?

—:o:—